honeybee.org

Vol-10 Issue-2

సంపుటి 10 సంచిక 2 జనవరి - ఫిబ్రవరి 2022

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక











# 2021 లో 'పల్లెసృజన' ప్రగతి







కోవిడ్-19 మహమ్మారి వలన ప్రజలు ఒకరికి ఒకరికి సంబంధం లేకుండా అనేక కష్టాలు పడటంతో ప్రారంభమైంది 2021వ సంవత్సరం. 2020వ సంవత్సరంలో పల్లెసృజన చాలా కార్యక్రమాలు నిర్వహించింది. పల్లె వాసులతో కలవడం మరియు పునాది స్థాయి ఇన్నోవేటర్‌లని గుర్తించటం, వారి ఇన్నోవేషన్‌లు రైతుల అవసరం వారిదాక తీసుకుని వెళ్ళటంలో కానీ, వారిని పురస్కారంతో సత్కరించటం వంటి వాటితో చాలా ఉత్సాహంగా పని చేసింది.

ఆ సంవత్సరం శుభప్రదంగా మన సృజనాత్మక రైతు శ్రీ చింతల వెంకట్ రెడ్డి గారికి 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించటంతో ప్రారంభమైంది. దీనితో మన పల్లెసృజన కుటుంబంలో మూడు పద్మశ్రీలు ఉన్నట్లయ్యింది. ఇది చాలా ఆనందదాయకమైన విషయం.

ఈ సంవత్సరంలో పల్లెసృజన 26 కళాశాలల్లో 10 వేలకన్నా ఎక్కువ విద్యార్థులతో, 500 మంది శాస్త్రవేత్తలతో కలవటం జరిగింది. ఎఎస్‌సిఐ, ఎన్‌ఎఆర్‌ఎం, పిఆర్‌ఎల్ లాంటి ప్రభుత్వ సంస్థలు సైంటిస్టులతో సంభాషించేందుకు తోడ్పడ్డాయి.

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్స్ (టిఐయస్‌యస్)కి చెందిన 35 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రూరల్ ఇంటర్న్‌షిప్ కల్పించటం జరిగింది. ఈ విద్యార్థులకై వరుసగా మూడు సంవత్సరాలుగా మన పల్లెసృజన ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 4 కళాశాలలతో పల్లెసృజన అవగాహనా ఒప్పందాలు చేసుకొన్నది. 160 మంది మహిళలకు గ్రామీణ స్థాయిలో వ్యాపారావకాశాల గురించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించటం జరిగింది. మన ఇన్నోవేటర్ గోదాసు నరసింహ తయారు చేసిన గుర్రపుడెక్క తీసే యంత్రం గురించి నార్వే దేశానికి చెందిన ఒక పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తమ ప్రాజెక్టుగా తీసుకొని ఆయనతో సుమారు 4 గంటలు వీడియోలో సంప్రదించటం జరిగింది. ఈ కార్యక్రమాలు 'సృష్టి' (యస్‌ఆర్‌ఐఎస్‌టిఐ) వారి సౌజన్యంతో జరిగింది.

కిమ్స్ ఫౌండేషన్ వారు గ్రామీణ ప్రాంతాలలో వైద్య సదుపాయాలు కల్పించటంలో సలహాలు ఇవ్వవలసిందిగా మన పల్లెసృజనను తమ సహాయ మండలి సభ్యులుగా ఆహ్వానించింది. వారి పరిశోధన ప్రస్తుతం పల్లె ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలతో పాటు, సాంప్రదాయ వైద్య విధానాలను కూడా ఉపయోగించటం ఈ కార్యక్రమం ఉద్దేశ్యం. పల్లెసృజన ఈ దిశగా సలహాలు యివ్వటానికి సూచనలు తయారు చేస్తున్నది.

టి-హబ్, టియస్‌ఐసి, టాస్క్ సంస్థలకి చెందిన ప్రధాన కార్యనిర్వహణాధికారులు పల్లెసృజనను సందర్శించి ఏవిధంగా వారితో మనం సహకరించ గలమో చర్చించటం జరిగింది. దీనికి సంబంధించిన అవగాహనా పత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి. టియస్‌ఐసి వారు పల్లెసృజనను తమ సలహా మండలి సభ్యులుగా ఉండాలని ఆహ్వానించింది.

కోవిడ్ కారణంగా ఈ సంవత్సరం భౌతికంగా మన ఇన్నోవేషన్‌ల ప్రదర్శనలు తక్కువ ప్రదేశాలలో నిర్వహించ గలిగాము. సంవత్సరం చివరి 3 నెలలు గుంటూరు, తిరుపతి, విజయవాడ ప్రదర్శనలకు వీలు కలిగింది. భారీ సంఖ్యలో ప్రజలు ఈ ప్రదర్శనలని సందర్శించటం జరిగింది. వ్యవసాయ దారులతో ఫలప్రదమైన సంప్రదింపులు జరిగాయి.

కరోనా వల్ల దాదాపు 20 నెలలు పాఠశాలలు మూతపడటం కారణంగా కోల్పోయిన చదువుల నష్టాన్ని అంచనా వెయ్యటానికి గాను 4 వెబినార్లు నిర్వహించి, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సమాజానికి చెందిన వారితో జరిగిన సంభాషణలలో చాలా ఉపయోగకరమైన విషయాలు తెలియజేశాయి.

మన పల్లెసృజన కోవిడ్ కారణంగా ప్రదర్శనలు నిర్వహించలేని భర్తీ తీర్చటానికి గాను అక్టోబర్ 2020 నుంచి ప్రతి వారం వెబినార్‌లు నిర్వహించింది. ఈవిధంగా డిశంబర్ 8న జరిగిన 50వ వెబినార్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల నాబార్డ్ సిజియంలతో పాటు, విశ్రాంత సిజియం గార్లు పాల్గొని ఇన్నోవేషన్‌లకి సహాయం అందించే విషయంపై భరోసా ఇచ్చారు. ఈవిధంగా వారం వారం నిర్వహించిన వెబినార్‌లలో 2-3 ఇన్నోవేటర్‌లు వారి ఇన్నోవేషన్‌లు పరిచయం చెయ్యటం జరిగింది. ప్రస్తావన సంవత్సరంలో ఈవిధంగా 85 మంది ఇన్నోవేటర్‌లు, 168 ఇన్నోవేషన్‌లు, తెలుగు రాష్ట్ర రైతులకి ప్రజలకి పరిచయం చెయ్యటం జరిగింది. ముఖ్యంగా ఈ వేదిక రైతు ఇన్నోవేటర్లను, రైతులను, సమాజాన్ని సంధానం చేయగలిగింది.

గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్ కొప్పుల అశోక్‌ని రైతునేస్తం పురస్కారంతో సత్కరించారు. శ్రీమతి దూబ రాజు, మోదా శివకుమార్‌లకు 87 దేశాలలోని ఇన్నోవేటర్లు పాల్గొన్న అంతర్జాతీయ స్థాయిలో హనీబీ వారు నిర్వహించిన కార్యక్రమంలో గుర్తింపు లభించి, సత్కరించ బడ్డారు. ఇది మన పల్లెసృజన బృందానికి ఎంతో సంతోషించదగ్గ విషయం. గొర్రె అశోక్‌కు చెందిన నాలుగు ఇన్నోవేషన్లకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

ఎంతోమంది ఐచ్ఛిక కార్యకర్తలు మన శ్రేయోభిలాషులు, ప్రభుత్వం, ఎన్‌జిఓ సంస్థలు, వ్యక్తుల సహకారంతో ఈ చిన్ని విజయాలు పల్లెసృజన బృందం సాధించ గలిగింది. వారందరికీ ధన్యవాదాలు. 2022వ సంవత్సరం మరిన్ని కార్యక్రమాలు మీ అందరి సహాయ సహకారాలతో నిర్వహించాలని పల్లెసృజన ఉత్సుకతతోఉంది.

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

**పల్లెసృజన**

## అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల

# ఇన్నోవేషన్లు

### జొన్న, మొక్కజొన్న పంటల్లో అంతర సేద్యానికి వెంకట్ వీడర్

ఇన్నోవేటర్ : **వెంకటయ్య**, మహబూబ్‌నగర్



ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న వీడర్లు ప్రత్తి, మిప లాంటి పంటల్లో అంతర సేద్యానికి మాత్రమే పని చేస్తాయి. కానీ, ఈ వీడర్‌తో జొన్న, మొక్కజొన్న, వేరుశనగ లాంటి పంటలతో పాటు ప్రత్తి, మిరప పంటల్లో కూడా అంతర సేద్యం చేసుకోవచ్చు. పంట వేసిన సాలు వెడల్పును బట్టి అనువైన గొర్రు, గుంటక 9 అంగుళాల నుండి 30 అంగుళాల వెడల్పు వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. ఒకే చక్రంతో నడిచే ఈ యంత్రం మహిళలు కూడా సులువుగా తోలవచ్చు. ఒక లీటరు పెట్రోలుతో 2-3 ఎకరాలలో సేద్యం చేసుకోవచ్చు.

### తక్కువ ఖరీదులై ట్రాక్టర్ హైడ్రాలిక్ క్రేన్


ఇన్నోవేటర్ : **మహిపాల్ చారి**, హన్మకొండ



ట్రాక్టర్‌కు క్రేన్ ఏర్పాటు చేసుకోవాలంటే లక్షలాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. కానీ, ఈ హైడ్రాలిక్ క్రేన్ ఖరీదు సామాన్య రైతుకు కూడా అందుబాటులో వుంటుంది. గ్రామాల్లో, గోడౌన్‌ల వద్ద హమాలీలు లభించక, ధాన్యం మూటలు, ఇతర బరువులను ఎత్తే కూలీల ఖర్చు విపరీతంగా వుంటోది. దీనికి పరిష్కారంగా కనుగొన్నదే ఈ ట్రాక్టర్ హైడ్రాలిక్ క్రేన్. ట్రాక్టర్‌కు, లారీలకు, ఎద్దుల బండ్లను బరువులను ఎత్తడం, దించడం కేవలం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులే చేసుకోవచ్చు. ఎటువంటి నిర్వహణా ఖర్చులు ఉండవు. ఊరికొక్క క్రేన్ ఉంటే చాలు రైతులు ధాన్యం సంచులు ఇంటికి, మార్కెట్‌కు తరలించేందుకు హమాలీల కొరకు వేచి ఉండాల్సిన అవసరం లేదు. గోడౌన్ యజమానులకు ఇది చాలా ఉపయోగకరమైనది.

### సమాన దూరం, లోతులో విత్తనం వేసే జడిగం

ఇన్నోవేటర్ : **గొర్రె అశోక్**, సూర్యాపేట



ఏ విత్తనమైనా సమాన దూరంలో, సరియైన లోతులో నాటితేనే విత్తనాలు వృధా కాకుండా మొలకెత్తుతాయి లేకుంటే విత్తనం వృధా, పంట దిగుబడి కూడా తగ్గుతుంది. ఈ సమస్య పరిష్కారానికి సన్న చిన్నకారు రైతుల కోసం తయారు చేయబడిన చేతి పరికరం ఈ జడిగం. ఒక అడుగు నుండి 2-3 అడుగుల దూరం, 2-3 అంగుళాల లోతులో విత్తనం వేసుకోవచ్చు. సాధారణ రైతు కూడా దీన్ని అందుబాటులో ఉంచుకోవటానికి అనువైన తక్కువ ఖరీదులో లభిస్తుంది. ప్రత్తి, మొక్కజొన్న లాంటి విత్తనం నాటే పనులు ఇక వంగి భూమిలో నాటి అలసి పోవాల్సిన అవసరం లేకుండా నిలబడే విత్తనం వేసుకుంటూ సమాన దూరంలో నాటుకోవచ్చు.

### జొన్న, వేరుశనగ అంతర సేద్యాల వీడర్

ఇన్నోవేటర్ : **వెంకటేశ్వరా చారి**, హన్మకొండ



జొన్న, వేరుశనగ లాంటి పంటల్లో సాధారణంగా ఎద్దులతోనే అంతర సేద్యాలు చేస్తూ ఉంటారు. ఒక ఎద్దుల జతకు 5-6 దంతెలు వేసి అంతర సేద్యం చేస్తూ ఉంటారు. అందుకు ఎక్కువ కూలీలు అవసరం, చాలా ఖర్చవుతుది. ఈ వీడర్‌తో కూడా ఒకేసారి 5-6 సాళ్ళలో ఒకే వ్యక్తి అంతర సేద్యం చేసుకోవచ్చు. ఒక ప్రధాన చక్రం వుండి, బ్యాలెన్స్ చేసుకోవడానికి అనువుగా ఇరువైపులా రెండు సైకిల్ చక్రాలు ఏర్పాటు చేయటం వలన తేలికగా బ్యాలెన్స్ అవుతుంది. మహిళలు కూడా సులభంగా అంతర సేద్యం చేసుకోవచ్చు.

<u>మొక్కలు కావలసిన వారు సంప్రదించండి :</u>

**బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

cmyk




# 2021 లో 'పల్లెసృజన' ప్రగతి




కోవిడ్-19 మహమ్మారి వలన ప్రజలు ఒకరికి ఒకరికి సంబంధం లేకుండా అనేక కష్టాలు పడటంతో ప్రారంభమైంది 2021వ సంవత్సరం. 2020వ సంవత్సరంలో పల్లెసృజన చాలా కార్యక్రమాలు నిర్వహించింది. పల్లె వాసులతో కలవడం మరియు పునాది స్థాయి ఇన్నోవేటర్‌లని గుర్తించటం, వారి ఇన్నోవేషన్‌లు రైతుల అవసరం వారిదాక తీసుకుని వెళ్ళటంలో కానీ, వారిని పురస్కారంతో సత్కరించటం వంటి వాటితో చాలా ఉత్సాహంగా పని చేసింది.

ఆ సంవత్సరం శుభప్రదంగా మన సృజనాత్మక రైతు శ్రీ చింతల వెంకట్ రెడ్డి గారికి 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించటంతో ప్రారంభమైంది. దీనితో మన పల్లెసృజన కుటుంబంలో మూడు పద్మశ్రీలు ఉన్నట్లయ్యింది. ఇది చాలా ఆనందదాయకమైన విషయం.

ఈ సంవత్సరంలో పల్లెసృజన 26 కళాశాలల్లో 10 వేలకన్నా ఎక్కువ విద్యార్థులతో, 500 మంది శాస్త్రవేత్తలతో కలవటం జరిగింది. ఎఎస్‌సిఐ, ఎన్‌ఎఎఆర్‌ఎం, పిఆర్‌ఎల్ లాంటి ప్రభుత్వ సంస్థలు సైంటిస్టులతో సంభాషించేందుకు తోడ్పడ్డాయి.

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషియల్ సైన్స్ (టిఐయస్‌యస్)కి చెందిన 35 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు రూరల్ ఇంటర్న్‌షిప్ కల్పించటం జరిగింది. ఈ విద్యార్థులకై వరుసగా మూడు సంవత్సరాలుగా మన పల్లెసృజన ఈ విధమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నది.

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 4 కళాశాలలతో పల్లెసృజన అవగాహనా ఒప్పందాలు చేసుకొన్నది. 160 మంది మహిళలకు గ్రామీణ స్థాయిలో వ్యాపారావకాశాల గురించి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించటం జరిగింది. మన ఇన్నోవేటర్ గోదాసు నరసింహ తయారు చేసిన గుర్రపుడెక్క తీసే యంత్రం గురించి నార్వే దేశానికి చెందిన ఒక పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు తమ ప్రాజెక్టుగా తీసుకొని ఆయనతో సుమారు 4 గంటలు వీడియోలో సంప్రదించటం జరిగింది. ఈ కార్యక్రమాలు 'సృష్టి' (యస్‌ఆర్‌ఐఎస్‌టిఐ) వారి సౌజన్యంతో జరిగింది.

కిమ్స్ ఫౌండేషన్ వారు గ్రామీణ ప్రాంతాలలో వైద్య సదుపాయాలు కల్పించటంలో సలహాలు ఇవ్వవలసిందిగా మన పల్లెసృజనను తమ సహాయ మండలి సభ్యులుగా ఆహ్వానించింది. వారి పరిశోధన ప్రస్తుతం పల్లె ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలతో పాటు, సాంప్రదాయ వైద్య విధానాలను కూడా ఉపయోగించటం ఈ కార్యక్రమం ఉద్దేశ్యం. పల్లెసృజన ఈ దిశగా సలహాలు యివ్వటానికి సూచనలు తయారు చేస్తున్నది.

టి-హబ్, టియస్‌ఐసి, టాస్క్ సంస్థలకి చెందిన ప్రధాన కార్యనిర్వహణాధికారులు పల్లెసృజనను సందర్శించి ఏవిధంగా వారితో మనం సహకరించ గలమో చర్చించటం జరిగింది. దీనికి సంబంధించిన అవగాహనా పత్రాలు రూపుదిద్దుకుంటున్నాయి. టియస్‌ఐసి వారు పల్లెసృజనను తమ సలహా మండలి సభ్యులుగా ఉండాలని ఆహ్వానించింది.

కోవిడ్ కారణంగా ఈ సంవత్సరం భౌతికంగా మన ఇన్నోవేషన్‌ల ప్రదర్శనలు తక్కువ ప్రదేశాలలో నిర్వహించ గలిగాము. సంవత్సరం చివరి 3 నెలలు గుంటూరు, తిరుపతి, విజయవాడ ప్రదర్శనలకు వీలు కలిగింది. భారీ సంఖ్యలో ప్రజలు ఈ ప్రదర్శనలని సందర్శించటం జరిగింది. వ్యవసాయ దారులతో ఫలప్రదమైన సంప్రదింపులు జరిగాయి.

కరోనా వల్ల దాదాపు 20 నెలలు పాఠశాలలు మూతపడటం కారణంగా కోల్పోయిన చదువుల నష్టాన్ని అంచనా వెయ్యటానికి గాను 4 వెబినార్లు నిర్వహించి, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు, సమాజానికి చెందిన వారితో జరిగిన సంభాషణలలో చాలా ఉపయోగకరమైన విషయాలు తెలియజేశాయి.

మన పల్లెసృజన కోవిడ్ కారణంగా ప్రదర్శనలు నిర్వహించలేని భర్తీ తీర్చటానికి గాను అక్టోబర్ 2020 నుంచి ప్రతి వారం వెబినార్‌లు నిర్వహించింది. ఈవిధంగా డిశంబర్ 8న జరిగిన 50వ వెబినార్‌లో ఉభయ తెలుగు రాష్ట్రాల నాబార్డ్ సిజియంలతో పాటు, విశ్రాంత సిజియం గార్లు పాల్గొని ఇన్నోవేషన్‌లకి సహాయం అందించే విషయంపై భరోసా ఇచ్చారు. ఈవిధంగా వారం వారం నిర్వహించిన వెబినార్‌లలో 2-3 ఇన్నోవేటర్‌లు వారి ఇన్నోవేషన్‌లు పరిచయం చెయ్యటం జరిగింది. ప్రస్తావన సంవత్సరంలో ఈవిధంగా 85 మంది ఇన్నోవేటర్‌లు, 168 ఇన్నోవేషన్‌లు, తెలుగు రాష్ట్ర రైతులకి ప్రజలకి పరిచయం చెయ్యటం జరిగింది. ముఖ్యంగా ఈ వేదిక రైతు ఇన్నోవేటర్లను, రైతులను, సమాజాన్ని సంధానం చేయగలిగింది.

గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్ కొప్పుల అశోక్‌ని రైతునేస్తం పురస్కారంతో సత్కరించారు. శ్రీమతి దూబ రాజు, మోదా శివకుమార్‌లకు 87 దేశాలలోని ఇన్నోవేటర్లు పాల్గొన్న అంతర్జాతీయ స్థాయిలో హనీబీ వారు నిర్వహించిన కార్యక్రమంలో గుర్తింపు లభించి, సత్కరించ బడ్డారు. ఇది మన పల్లెసృజన బృందానికి ఎంతో సంతోషించదగ్గ విషయం. గొర్రె అశోక్‌కు చెందిన నాలుగు ఇన్నోవేషన్లకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది.

ఎంతోమంది ఐచ్ఛిక కార్యకర్తలు మన శ్రేయోభిలాషులు, ప్రభుత్వం, ఎన్‌జిఓ సంస్థలు, వ్యక్తుల సహకారంతో ఈ చిన్ని విజయాలు పల్లెసృజన బృందం సాధించ గలిగింది. వారందరికీ ధన్యవాదాలు. 2022వ సంవత్సరం మరిన్ని కార్యక్రమాలు మీ అందరి సహాయ సహకారాలతో నిర్వహించాలని పల్లెసృజన ఉత్సుకతతో ఉంది.

సంపుటి-10 సంచిక - 2 జనవరి - ఫిబ్రవరి 2022

# పల్లెసృజన

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సంపాదకులు :
**జమ్ములమడక శశిమోహన్**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త**
**పి. చంద్రకాంత్ శర్మ**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్**
**జమ్ములమడక శ్రీకర్**
**కల్పనా శాస్త్రి**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail : narendragrafixhyd@gmail.com

**Rs. 400/-**
**for 2 years Subscription**

## ఈ సంచికలో.....

* చేనేత కార్మికులకు మోకాలి నొప్పులు లేకుండా చేసిన 'మోధా పెడల్ ఆపరేటింగ్ యంత్రం' - 4
* కోవిడ్ సమయంలో జాతీయ స్థాయిలో 'పల్లెసృజన' వెబినార్ల ప్రథమ వసంతం - 8
* అబ్బోజు వెంకటేష్ సృష్టి 'అన్ని రకాల మాగాణి పంటలకు ఒకే 'ఏకచక్ర వీడర్' - 11
* అంతరించి పోతున్న 'సాంప్రదాయ నార తాళ్ళు' - 13
* పునాది స్థాయి ఇన్నోవేషన్లతో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి - 14
* జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు - 18
* ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం - 22
* వృక్షాయుర్వేదము - 24
* 10 వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు - 26
* ఆయుర్వేద జ్ఞాన మథనం - 30
* స్పందన - 31

**కవర్ లోపలి పేజీల్లో ...**

2021వ సంవత్సరంలో 'పల్లెసృజన' పురోగతి
అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

**మధ్య పేజీలో :**

నవంబర్ - డిశంబర్ 2021లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు

Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix,** 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. –500094. Telangana State, Editor : **J. Sesimohan.**

**HoneyBee Regional Collaborators & Publications**

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank,
Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr. Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Nam Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

# మద్దతు ధరతో రైతుల భవిష్యత్తు మారుతుందా?



2020లో ప్రారంభమైన పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్ రైతుల పోరాటం 2021లో ముగిసింది. కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ బిల్లులను ఉపసంహరించడం ఈ సమ్మె ముగియడానికి ఒక కారణం అయితే సమ్మెలో పాల్గొన్న రైతు సమాఖ్యలు కొన్ని షరతులతో సమ్మెను ముగించారు. అందులో ప్రధానమైనది యం.యస్.పి. (కనీస మద్దతు ధర). ఒక సంవత్సరం పాటు శాంతియుతంగా రైతులు చేపట్టి గెలిచిన ఈ సమ్మె చరిత్రలో నిలిచిపోతుంది. కేంద్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేస్తామన్న ఆశ్వాసన పూర్తి చేయలేకపోయింది. అయితే ఈ పరిస్థితుల్లో రైతు భవిష్యత్తును ఆశాజనకంగా చేయాలంటే కొన్ని నూతన మార్గాలు వెతకడం అవసరం.

విశేషజ్ఞులు, వ్యవసాయ ఆర్థిక నిపుణులు "కనీస మద్దతు ధర"ను ఉపయోగించి రైతుల భవిష్యత్తును బాగు పరచాలని నూతన విధానాలను చర్చిస్తున్నారు.

రైతుల క్షేమం కొరకై కేంద్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు కొన్ని చర్యలు చేపడుతూ వచ్చాయి. ప్రైవేటు సంస్థల వల్ల రైతు నష్టపడకుండా 1955లో "ఎసెన్షియల్ కామోడిటీ యాక్ట్" తీసుకు వచ్చారు. అలాగే కనీస మద్దతు ధరని 1960లో ప్రవేశ పెట్టారు. బఫర్ స్టాక్ పాలసీతో ప్రభుత్వం మార్కెట్ ధరలను నియంత్రణ చెయ్యడానికి ప్రయత్నాలు చేసింది. అలాగే రైతులకు నష్టం కాకుండా వారినుండి కొన్న ధాన్యాన్ని 'పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ (పిడియస్) ద్వారా దేశంలోని పేద ప్రజలకు బియ్యాన్ని పంచడం జరిగింది. దీంతో రైతులకు ఎక్కువ దిగుబడి వచ్చే వరి వంగడాలను 'గ్రీన్ రెవల్యూషన్' మాధ్యమంగా పండించడం, ప్రభుత్వం ధాన్యం సేకరించి దేశంలోని ప్రజలకు ఆహార భద్రతను సాధించడం జరిగాయి.

మొదట్లో మద్దతు ధర మరియు పిడియస్, బియ్యం, గోధుమలు, పంచదారలకు మాత్రమే ఇచ్చారు. రైతులు ఈ పంటలపై మొగ్గు చూపటం మొదలైంది. వర్షాధార ప్రాంతాల్లో పండిస్తున్న చిరు ధాన్యాలు, పప్పులు, నూనెగింజలు లాంటి పంటలపై రైతులకు శ్రద్ధ తగ్గింది. వరి పంట 3 కోట్ల నుండి 4.4 కోట్ల హెక్టార్లకు గత యాభై సంవత్సరాల్లో పెరిగిందని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. అలాగే గోధుమ 3.1 నుండి 3.7 కోట్ల హెక్టార్లకు పెరిగింది. పప్పు దాన్యాలు ఈ కాలంలోనే 3.7 నుండి 2.5 కోట్ల హెక్టార్లకు పడిపోయింది. ప్రధానంగా ఈ మార్పు వర్షాధార ప్రాంతాల్లో జరిగింది. దేశంలో దాదాపు 68% వ్యవసాయం వర్షాధార ప్రాంతంలో జరుగుతుంది. ఈ రైతులు ప్రభుత్వం మద్దతు ఇస్తున్న పంటలకే ప్రాధాన్యమిచ్చారు. దాంతో వారి ఆహారంలో పప్పులు, నూనె గింజలు, చిరుధాన్యాలు లేకుండా పోయాయి. పిడియస్ ద్వారా ఇవి లభ్యం కావటం లేదు కాబట్టి వీరి ఆరోగ్యంపై పెద్ద ప్రభావం పడిందని విశ్లేషకులు అభిప్రాయ పడ్డారు. కరువులకు నిలబడే పౌష్టికంగా మేలైన పంటలు వర్షాధార ప్రాంతాల నుండి మాయమయ్యాయి. దాదాపు 20 రకాల ఇలాంటి రైతుహిత, సమాజహిత పంటలను తిరిగి వాడకంలోకి తేవాలంటే వీటిని 'మద్దతు ధర' పరిధిలోకి తీసుకు రావాలి. దీనివల్ల ఆహార భద్రత, ఆరోగ్య అభివృద్ధి, రైతుల పెట్టుబడులు తగ్గటం, వారి ఆదాయాలు పెరగటం, రుణాలు తగ్గటం జరిగే అవకాశముంది. ముఖ్యగా వర్షాధార ప్రాంతాలలోని రైతులకు ఈ పద్ధతి ఎంతో అనుకూలంగా ఉంటుంది. దీనిపై దేశవ్యాప్తంగా చర్చ అత్యవసరం.

మరోమాట, "కనీస మద్దతు ధర"ను ఎక్కువ పంటలకు విస్తృతం చేయటమే కాకుండా, 'మద్దతు ధర'గా నామకరణం చేయాలి. వెసులుబాటు పెంచడానికి ప్రతి పంటకు మద్దతు ధర ఒక రేంజ్‌లో ఉండాలి. అతి తక్కువ ధర, అతి ఎక్కువ ధర. వీటిని ప్రభుత్వం ప్రతి పంటకు నిర్వచించాలి. ప్రభుత్వం కొనే ధర వీటి మధ్యలో ఉండాలి. ఈ విధంగా చేయడంతో దేశానికి అవసరమైన పంటలను రైతులు పండించడానికి వాటికి సరైన ధర ప్రభుత్వం నిర్ణయించడం సంభవం. రైతులకు అన్ని పంటలు పండించడానికి ప్రోత్సాహం లభిస్తుంది. ఉదాహరణకు నూనెగింజల ఉత్పత్తి తగ్గడం వల్ల మనదేశం గత

## సంపాదకీయం

ఆర్థిక సంవత్సరంలో 76 వేల కోట్ల నూనె (ఆహారానికి) దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఇలాంటి లోటులను తగ్గించుకోవడానికి రేంజ్ మద్దతు ధర చక్కగా ఉపయోగ పడుతుంది. నూనెగింజల పంటలకు ఆకర్షణీయమైన మద్దతు ధర ప్రకటిస్తే రైతులు ఈ పంటలను పండించడానికి ముందుకు వస్తారు. ఈవిధంగా ఆహార భద్రత, పౌష్టిక ఆహారం, రైతులకు తక్కువ పెట్టుబడి, అధిక ఆదాయం, పంట ధరల నియంత్రణ - అన్ని లాభకరంగా ఉండేట్టు చేసే అవకాశం ఉంటుంది. ఏ పంట వెయ్యాలి అన్న నిర్ణయాన్ని రైతు సునాయాసంగా తీసుకోగలడు.

విస్తారమైన పంటలు అంటే 20-25 రకాలు రైతులు పండిస్తూ ఉంటే ఆహార పరిశ్రమకు అనుకూలంగా ఉంటుంది. ఈవిధంగా రైతులు - పరిశ్రమల మధ్య సామరస్యంతో అభివృద్ధి దిశగా వెళ్ళగలరు. ప్రజల ఆరోగ్యం మెరుగుపడే అవకాశాలున్నాయి. ఆరోగ్యకరమైన సమాజం - ఆనందకరమైన జీవితానికి దారి తీస్తాయి.

ఇద్దరు వ్యవసాయ శాస్త్రవేత్తలు అమిత్ భదూరి, కౌస్తుబ్ బెనర్జీ మరో రైతు లాభకరమైన ప్రస్తావన ముందుకు తెచ్చారు. రైతులు పంటల అమ్మకంతో వారికి రుణాల పంపిణీని లింకు చేయాలని ప్రతిపాదించారు. రైతులు తమ మద్దతు ధర పరిధిలోని పంటలను ప్రభుత్వానికి అమ్మితే, సరియైన ధరకే కాకుండా ప్రతి రైతుకు రివార్డు అంకాలు ఇవ్వాలి. బ్యాంకులు రైతు రుణాలను వారి రివార్డు అంకాల ఆధారంగా వితరణ చెయ్యాలి. రైతుల రివార్డు అంకాలను అవసరానికి వాడుకునేట్టుగా సులువుగా పద్ధతిని తయారు చెయ్యాలి. దీంతో ప్రభుత్వాలు పంటలను కొనడం సులువు అవుతుంది. అలాగే రైతులకు రుణాలు కూడా నిశ్చిత పద్ధతిలో లభించే అవకాశముంది.

ప్రస్తుత పరిస్థితుల్లో రైతులకున్న అనేక ప్రశ్నలు, బాధలు, కష్టాలు, నష్టాలు తీరాలంటే ఒక నూతన ప్రస్తావనలను కూలంకషంగా చర్చించి, రైతుహితంగా దేశ అభివృద్ధికి అన్ని కోణాల్లో అనుకూలంగా ఉండేలా నిర్వచించాలి. ఏ పంట వెయ్యాలన్న ప్రశ్నకు జవాబు రైతుకు సులభంగా లభించాలి. ఆ నిర్ణయం రైతే తీసుకోవాలి. పంటను అమ్మడంలో అనిశ్చిత, రైతు ఆదాయంలో ఒడిదుడుకులు, ఏ పంట వెయ్యాలో ఎవరు నిర్ణయిస్తారన్న మీమాంస, ఆరోగ్యానికి అనువైన చిరుధాన్యాలు, పప్పులు, నూనెగింజలు విస్తారంగా పండిస్తే దేశ ఆహార భద్రత, ఆర్థికంగా వెనుకబడిన దేశ ప్రజల ఆరోగ్యం, పెట్టుబడులు తగ్గడం, రైతుల ఆదాయం పెరగటం - ఇవన్నీ సాధ్యం కావాలి. రైతు క్షేమమే భారతదేశ క్షేమం. రైతు బంగారు భవిష్యత్తు మనదేశాన్ని ఉన్నత ఆర్థిక, సామాజిక, మానవత్వ స్థాయి దిశగా నడిపిస్తుందని 'పల్లెసృజన' విశ్వాసం.

ఈ సంచికలో చేనేత పరిశ్రమకు విప్లవాత్మకమైన ఇన్నోవేషన్‌ను గురించి వ్రాసాము. మోథా శివకుమార్ సంవేదనతో, నేతన్నలు, నేతక్కల దైనందిన కాళ్ళనొప్పులను తగ్గించాలన్న తపనతో సృష్టించిన ఇన్నోవేషన్‌ను గురించి చదవండి. వీలైతే చేనేత కుటుంబాలకు సాయం చేయడానికి ముందుకు రండి.

కరోనా ఉధృతి తగ్గినట్లుగా సూచనలు కనిపిస్తున్నాయి. తగు జాగ్రత్తల్లో ఉండి ప్రకృతిని గౌరవిస్తూ, తోటి మానవుల ఆనందాన్ని ఆకాంక్షిస్తూ, భవిష్యత్తు ఆనందమయం కావాలని మనసారా కోరుకుంటూ.....

భవదీయ

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)

---

## సమస్యలకు ఆహ్వానం

'పల్లెసృజన' ఇంతవరకు సమాజంలోని సమస్యలకు పరిష్కారాలు (ఇన్నోవే షన్‌లను) వెతికి, వెలుగులోకి తీసుకు రావడానికి స్వచ్ఛందంగా గత పదిహేను సంవత్సరాలుగా ప్రయత్నాలు చేస్తున్నది. వాటివల్ల పునాది స్థాయి ఇన్నోవేటర్ల సృజనాత్మక శక్తి వెలుగులోకి రావటంతో పాటు, ఎంతోమందికి శారీరకంగా, ఆర్థికంగా, సమయ పరంగా ఎంతో లాభం చేకూరింది. ఈ ప్రయాణంలో పరిష్కారాలు వెతికిన అనుభవంతో సమాజంలో వున్న సమస్యలను కూడా వెతికి పల్లెసృజన కుటుంబంలో వున్న ఇన్నోవేటర్ల ద్వారా పరిష్కారాలు చేయిస్తే సమాజానికి ఇంకా లాభం చేకూరు తుందని భావించాం.

గ్రామాల్లో మీరెవరైనా వ్యక్తిగతంగా లేదా నలుగురికీ సంబంధించిన ఏదైనా సమస్యకు పరిష్కారం వుంటే బావుంటుంది అనుకుంటున్నారా? ఐతే అటువంటి సమస్యలను క్రింద ఇచ్చిన వాట్స్ యాప్ నంబర్లకి పంపగలరు. ఎన్ని సమస్యలైనా పంపవచ్చు. పరిష్కారాలను మా ఇన్నోవేటర్ల సహాయ సహకారాలతో వెతికే ప్రయత్నాలను, వాటి ప్రగతిని మీకు 'పల్లెసృజన' పత్రిక ద్వారా తెలియజేస్తూ వుంటాము. – ఎడిటర్

వాట్స్ యాప్ నంబర్లు : బ్రిగేడియర్ గణేశం, 9866001678, సుభాష్ చందర్, 9652801700

# చేనేత కార్మికులకు మోకాలి నొప్పులు లేకుండా చేసిన 'మోధా ఫెడల్ ఆపరేటింగ్ యంత్రం'




- వీరరాఘవ రెడ్డి

చేనేత రంగంలో రెండువందల సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన 'జాకార్డ్' పద్ధతిని ఎలక్ట్రానిక్ గా రూపాంతరం చేయటంతో పాటు, ఒక్కో చేనేత కార్మికునికి వేలాది రూపాయల ఖర్చు తగ్గించే యంత్రాన్ని కనుగొన్న ప్రస్తుత హైదరాబాద్ నివాసి 'మోధా శివకుమార్' అనే యువకుడు 'పల్లెసృజన' పాఠకులకు గుర్తుండే ఉంటారు. అతను కనుగొన్న 'మోధా జాకార్డ్' యంత్రం అంతర్జాతీయ స్థాయి కీర్తిని ఆపాదించి పెట్టిన విషయం కూడా పాఠకులకు విదితమే. చేనేత కార్మికుడు కాకపోయినా, వారి కష్ట నష్టాల నివారణకు చిత్తశుద్ధితో పని చేసిన శివకుమార్ మరో విప్లవాత్మక మైన యంత్రాన్ని చేనేత కార్మికుల కోసం తయారు చేసి ఆ కార్మికుల కష్టాలకు చరమగీతం పాడటం జరిగింది.

భారతదేశంలో చేనేత కార్మికులు వారి కాళ్ళను ఉపయోగించి దాదాపు 24 లక్షల మగ్గాలపై రోజూ నేస్తారు. మగ్గంపైన చీర నేసే దారాలు పైకి, క్రిందకు లేపాలంటే కాళ్ళవద్ద ఏర్పాటు చేయబడ్డ 'పెడల్' ను ఎంతో బలంగా నొక్కితే తప్ప వేలాది దారాలు పైకి క్రిందకు లేపడం చాలా కష్టం. ప్రతిసారి 25 నుండి 40 కిలోల బరువు కాళ్ళపై పడుతుంది కాబట్టి ఇది చాలా శ్రమతో కూడుకున్న పని. జాకార్డ్ మగ్గం మత్రమే కాకుండా అన్ని రకాల మగ్గాలపై కూడా కాలితో తొక్కే పెడల్ వల్ల భారం ఎక్కువ అవతోంది. అందుకే చేనేత కార్మికులు 45–50 సంవత్సరాల తర్వాత కాళ్ళ నొప్పులతో మగ్గం నేయలేక ఇతర పనులు చేస్తారు. అలా చేయటం వల్ల ఎన్నో సంవత్సరాల వారి అనుభవం, నాణ్యత మరుగున పడిపోయే అవకాశం ఉంది. వారి తరువాత తరం యువకులు మళ్ళీ అనుభవం సంపాదించుకోవటానికి కొంత కాలం పడుతుంది. పెద్దలు చెప్పే సూచనలు వారికి అందకపోవచ్చు. అందువల్ల కొత్తరకం పోకడలకు అనుగుణంగా నాణ్యత కొరవడే అవకాశం ఉంది. మగ్గం నేసే వారిలో మహిళల శాతం కూడా ఎక్కువే. వారు ఇంట్లో పనులతో పాటు మగ్గం నేసే పని కూడా చేయటం వల్ల ఇంకా ఎక్కువగా అలసిపోవటం, త్వరగా వయను మీద పడినట్టుగా తయారు కావటం జరుగుతోంది.

> నేత కార్మికుల కష్టాన్ని తగ్గించేలా వృద్ధులు, మహిళలు సైతం సులభంగా, శ్రమ లేకుండా సాంప్రదాయ పద్ధతిలాగానే మగ్గం పై పని చేసేలా ఇప్పుడు పడుతున్న శ్రమను కేవలం ఒక్క శాతానికి తగ్గించేదే "మోధా లూమ్ లిఫ్టింగ్" యంత్రం.

పైన వివరించిన నేత కార్మికుల కష్టాన్ని తగ్గించేలా మోధా శివకుమార్ వృద్ధులు, మహిళలు సైతం సులభంగా, శ్రమ లేకుండా సాంప్రదాయ పద్ధతి లాగానే మగ్గం పై పని చేసేలా ఒక మిషన్ తయారు చేశాడు. ఇప్పుడు పడుతున్న శ్రమను కేవలం ఒక్క శాతానికి తగ్గించేదే ఈ "మోధా పెడల్ ఆపరేటింగ్ యంత్రం".

ఈ యంత్రం రూపకల్పనతో వయసు మీరిన చేనేత కార్మికులు తమ అనుభవం మరుగున పడకుండా ఇంకా ఎన్నో రకాల చీరలను సులభంగా నేసేలా



70 సంవత్సరాల వృద్ధుడు సునాయాసంగా నేత నేస్తున్న చిత్రం

చేశాడు. మహిళలలు ఈ యంత్రం పైన పని చేయ టం ఎంతో సులభంగా ఉందని, తమ కష్టాలను గట్టెక్కించేలా ఈ యంత్రం కనుగొన్నందుకు శివ కుమార్‌ను ప్రశంసల తో ముంచెత్తుతున్నారు.

'మోధా పెడల్ ఆపరేటింగ్ యంత్రం' ప్రస్తుతం పని చేస్తున్న 'జాకార్డ్' పద్ధతి మగ్గాలకు ఎటువంటి మార్పు చేయాల్సిన అవసరం లేకుండా, ప్రస్తుతం సాంప్రదాయంగా నేత నేస్తున్న విధంగానే ఉండేలా తయారు చేయడం గొప్ప విషయం. గుంత మగ్గాలకైనా, పైన వున్న మగ్గాలకైనా సరే దీన్ని ఎంతో సులభంగా కార్మికులే స్వయంగా అమర్చుకునేలా యంత్రాన్ని రూపొందించాడు శివకుమార్. ఈ యంత్రం రెండు మోడళ్లలో లభిస్తుంది. మొదటిది 'జాకార్డ్ పద్ధతి' నేత మగ్గాలకు, రెండోది టై & డై ఇతర మగ్గాలకు పనికి వచ్చేలా తయారు చేశాడు. దీన్ని ఏర్పాటు చేసుకునేందుకు ప్రత్యేకమైన మెకానిక్ అవసరం లేదు, ఇందులో ఉపయోగించిన మోటార్ కూడా మగ్గం అవసరాన్ని బట్టి 0.12 నుండి 0.25 హార్స్‌పవర్‌ల శక్తిగల మోటార్ మాత్రమే ఉపయోగించబడింది. అందువల్ల యంత్రం పని చేయటానికి విద్యుత్ ఖర్చు కూడా ఎక్కువగా లేకుండా చేశాడు.

ఇప్పటి వరకు మగ్గం యొక్క పాదాల వద్ద వున్న పెడల్‌లను ఎంతో బలంగా నొక్కితే తప్ప దారాలు కదలే అవకాశం ఉండదు. కానీ ఈ యంత్రం ఏర్పాటు చేసుకుంటే కేవలం కాలి బొటన వేలితో నొక్కినా సరే మగ్గం దారాలు సులభంగా పైకి లేస్తాయి.

**మోధా పెడల్ ఆపరేటింగ్ యంత్రం ప్రత్యేకతలు:**

1. ఈ యంత్రం అన్ని రకాల చేనేత మగ్గాలకు ఎంతో అవసరమైనది. ముఖ్యంగా గుంత మగ్గాలకు ఎలాంటి మార్పులు, చేర్పులు లేకుండా ఈ యంత్రాన్ని అమర్చి సునాయాసంగా వాడుకోవచ్చు.
2. ఈ యంత్రాన్ని వాడటం వలన చేనేత కార్మికులకు ఎటువంటి శారీరక శ్రమ, అలసట ఉండదు.
3. ముఖ్యంగా వృద్ధులైన చేనేత కార్మికులకు, మహిళా కార్మికులకు ఈ యంత్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. వీరు రోజంతా ఎలాంటి అలసట, శ్రమ లేకుండా, ఎలాంటి నేత మగ్గాన్ని అయినా అలవోకగా నేయవచ్చు.
4. యువకులకు భవిష్యత్తులో కాళ్ళనొప్పులు వస్తాయన్న భయం అవసరం లేదు. చేనేత పనినే జీవనోపాధిగా వృద్ధాప్యం వరకు కొనసాగించవచ్చు.
5. కాళ్ళ నొప్పులతో చేనేత పని మానేసిన వృద్ధ మహిళలు, పురుషులు నేత పనిని తిరిగి ప్రారంభించి, ఆదాయాన్ని పెంచుకోవచ్చు.
6. ఈవిధంగా వీరి విలువైన అనుభవం, కళాత్మకతను సమాజానికి పంచవచ్చు.
7. కాళ్ళ నొప్పులు ఉండవు కాబట్టి మగ్గంపై ఎక్కువ సమయం గడిపే అవకాశం వుంటుంది. అంటే నెలకు 10 చీరలు నేసేవారు కనీసం 13 చీరలు నేయగలరు.
8. తమకు తగ్గట్టుగా పెడల్ ఆపరేషన్ వేగాన్ని నియంత్రించుకోవచ్చు.
9. పెడల్ ఆపరేషన్ మిషన్ చేస్తుంది కాబట్టి చీర నాణ్యత పెరిగిందని ఈ యంత్రం వాడిన నేతన్నలు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు.
10. ఈ యంత్రం రెండు మోడల్స్‌లో ఉంటుంది. చిన్న యంత్రం – దాబి/ పేటి/ పింజర మగ్గాలకు వాడవచ్చు. ధర రూ. 11 వేలు.
11. రెండవ మాడల్ జాకార్డ్ మగ్గాల కొరకు తయారు చేయబడింది. దీని ధర రూ. 19 వేలు.
12. దేశంలో మొత్తం 24 లక్షల మగ్గాలుంటే, అందులో 11 లక్షలు జాకార్డ్ మగ్గాలు ఉన్నాయి. మిగతావి 13 లక్షలు.
13. ప్రభుత్వ గణాంకాల (2019–20) ప్రకారం 19 లక్షల మంది స్త్రీలు, 7.6 లక్షల మంది పురుషులు, 10 లక్షల మందికి పైగా 45 సంవత్సరాల పైబడిన వయస్సు వారు మగ్గాలపై పని చేస్తున్నారు.
14. ఈ యంత్రం అచ్చు మగ్గాలకు ఎంతో ఉపయోగం. సింగిల్ నేత, వరుస నేతలలో కూడా అచ్చులను, జాకార్డ్‌లను రెండింటినీ ఒకే సారి లాగగలదు/ లేపగలదు.



15. రెండు జాకార్డ్‌లను వేరువేరుగా కానీ, ఒకేసారి కానీ లేపగలదు.
16. ఈ యంత్రం ఉపయోగించడం చాలా సులువు. సాధారణ సాంప్రదాయ చేనేత మగ్గం పనితనాన్ని పోలి ఉంటుంది.
17. బరువును ఎత్తడంలో గానీ, నేత నేసే వేగంలో కానీ ఎలాంటి చేనేత మగ్గాలకైనా ఉపయోగ పడేవిధంగా డిజైన్ చేయబడింది.
18. మామూలుగా ఈ యంత్రం చెడిపోదు. ఒక సంవత్సరం వారంటీ ఇస్తారు.

'మోధా పెడల్ ఆపరేటింగ్' యంత్రం అన్ని రకాల మగ్గాలపై, చాలా మంది చేనేత కార్మికులచేత ప్రయోగాత్మకంగా పరీక్షించబడి, వారు సూచించిన చిన్న చిన్న మార్పులు కూడా సరిచేయబడి ప్రస్తుతం అమ్మకానికి సిద్ధంగా ఉంది. ఈ యంత్రం ప్రతి చేనేత కార్మికుడు తమ మగ్గానికి ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం తప్పక ఉంది.

ఈ మోధా పెడల్ ఆపరేటింగ్ యంత్రం ప్రతి చేనేత కార్మికుడికి చేరుకునేలా చేసేందుకు 'పల్లెసృజన' అన్ని రకాలుగా కృషి చేస్తోంది. ఈ సందర్భంలో 'పోచంపల్లి బ్యాంకు' ఛైర్మన్ సీతా దామోదర్ గారు మరియు డైరెక్టర్ల సహకారం ఈ కార్యక్రమాన్ని వేగవంతం అయ్యేలా చేసింది. యంత్రాన్ని వాడిన చేనేత కార్మికుల ఆనందం, వారి కష్టాల నివారణ ప్రత్యక్షంగా చూసి, మురిసిపోయిన పోచంపల్లి బ్యాంకు యాజమాన్యం ఈ యంత్రాలని పోచంపల్లిలో వున్న ప్రతి చేనేత కార్మికుడికి అందించాలని నిర్ణయించుకుంది. ఈ యంత్రం కొనడానికి కావలసిన రుణాలను అతి సులభమైన పద్ధతిలో, తక్కువ వడ్డీతో, తక్కువ సమయంలో తీర్చుకునే వెసులుబాటు కల్పించారు. అంతే కాకుండా మోధా శివ కుమార్‌కు యంత్రాల ఉత్పత్తిలో కష్టం కాకుండా, తగినంత ఆర్థిక సహాయం అందించడానికి కూడా ముందుకు వచ్చింది. అనూహ్య రీతిలో బ్యాంకు యాజమాన్యం (అందరూ చేనేత కుటుంబాలకు చెందిన వారే) తమ చేనేత కుటుంబాల పైన సంవేదనతో కాళ్ళ నొప్పులు అంటే ఏమిటో తెలిసిన వాళ్ళు కాబట్టి, వాటిని నిర్మూలించడానికి వచ్చిన పరిష్కారాన్ని పోచంపల్లి చేనేత ప్రజలు అనుభవిస్తున్న ఈ నొప్పుల నుంచి విముక్తులను చేస్తున్నారు.

ఈ పెడల్ లిఫ్టింగ్ యంత్రాన్ని ఉపయోగిస్తున్న పోచంపల్లి చేనేత కార్మికులు పొందుతున్న ఆనందం, వారి కష్టం తీరిపోవటం చూసి మురిసిపోయిన బ్యాంకు యాజమాన్యం తన ఏడు శాఖలలో ఏ కార్మికుడు ఈ యంత్రం తీసుకోవాలన్నా సరే కేవలం ఒక్క వెయ్యి రూపాయలు చెల్లిస్తే చాలు యంత్రాన్ని వారికి అందివ్వాలని, మిగతా ఋణం 10 వేల రూపాయలను నెలకు వెయ్యి చొప్పున చెల్లించేలా ఆదేశాలు జారీ చేయటంతో అనూహ్య రీతిలో ఈ యంత్రానికి ఇబ్బడి ముబ్బడిగా ఆర్డర్లు వస్తున్నాయి. బ్యాంకు యాజమాన్యం మరో అడుగు ముందుకు వేసి ఈ వ్యవహారంలో. సాధారణంగా ఏ బ్యాంకు అయినా సరే ఒక యంత్రం కొనుగోలు చేసి వినియోగ దారుడికి ఇవ్వాలంటే కొంత మొత్తాన్ని అడ్వాన్సుగా తయారీదారునికి చెల్లించి, యంత్రం వినియోగ దారుడికి అందిన తర్వాత మిగతా మొత్తాన్ని యంత్రం సరఫరా చేసిన వారికి అందజేస్తుంది. కానీ, పల్లెసృజన ఈ యంత్రం తయారు చేసిన ఇన్నోవేటర్ శివకుమార్ ఆర్థిక పరిస్థితి చాలా దయనీయమని, మీరు ఆర్డరు ఇచ్చినా వాటిని తయారు చేసే ఆర్థిక స్థోమత అతనికి లేదని అభ్యర్థన చేయడంతో, బ్యాంకు వారు యంత్రం మొత్తం ఖరీదును ముందుగానే ఇన్నోవేటర్‌కు చెల్లించి, వారం నుండి 10 రోజుల్లో యంత్రాలను లబ్దిదారునికి అందించాలని నిర్ణయించడం హర్షణీయమైన విషయం.




చేనేత కార్మికుల కష్టాన్ని తగ్గించే యంత్రం తయారు చేసిన శివకుమార్‌ను మనస్ఫూర్తిగా అభినందించింది బ్యాంకు యాజమాన్యం. 'పల్లెసృజన' శివకుమార్ మొదటి ఇన్నోవేషన్ తయారు చేసినపుడు ప్రచురించిన కథనంలో చెప్పినట్లు 'శివ కుమార్ చేసిన యజ్ఞానికి ఫలితం లభించింది'. ఈ ఫలితం యావత్ భారత దేశ చేనేత కార్మికులు అందుకునేందుకు 'పల్లెసృజన' ముమ్మరంగా కృషి సలుపుతోంది.

ఇప్పటికే 'మోధా ఎలక్ట్రానిక్ జాకార్డ్' యంత్రం ద్వారా అంతర్జాతీయ ఖ్యాతిని గడించిన శివకుమార్ ఇప్పుడు ఈ 'మోధా పెడల్ లిఫ్టింగ్' యంత్రం ద్వారా అదే చేనేత కుటుంబాలకు ఆరాధ్యుడు అయ్యాడు. ఇతను కనిపెట్టిన ఈ రెండు ఇన్నోవేషన్లను యావత్ భారతావనిలోని ప్రతి చేనేత కుటుంబం వినియోగించేలా చేయటానికి శాయశక్తులా కృషి చేస్తోంది 'పల్లెసృజన'. శివకుమార్ చేనేత కార్మికుల కష్టాలను గట్టెక్కించే ఇన్నోవేషన్‌లను ప్రతి చేనేత కార్మికుడు వినియోగించుకుని, తమ జీవితాలలో వెలుగులు నింపుకోవాలని కోరుకుంటోంది 'పల్లెసృజన'. ●

**ఇన్నోవేటర్ శివకుమార్, ఫోన్ : 7095810510**

**పునాది స్థాయి ఆవిష్కరణలు (గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్) పై 'వెబినార్‌లు'**

అక్టోబర్ 2020 నుండి ప్రతి వారం నిర్వహించ బడుతున్నవి. ఇప్పటి వరకు

* 56 వెబినార్లు నిర్వహించడం జరిగింది * 170 ఇన్నోవేషన్లు పరిచయం చేయబడినవి
* 95 మంది ఇన్నోవేటర్లు, * 50 మంది అతిథులు పాల్గొనటం జరిగింది.

ఇన్నోవేటర్లు తమ ఆవిష్కరణలు (ఇన్నోవేషన్) వీడియోల ద్వారా ప్రదర్శిస్తారు.

ప్రతి బుధవారం రాత్రి 7 గం.ల నుండి 8-15 ని.ల వరకు నిర్వహించ బడుతుంది.


పాల్గొనాలి అనుకునేవారు ఈ క్రింది లింకుల ద్వారా మీ మొబైల్ లేదా కంప్యూటర్ లో పాల్గొనవచ్చు.

**అందరూ ఆహ్వానితులే.**

Google meet link : https://meet.google.com/mrj-seot-ntq
outube live : https://youtu.be/NVgUnpmUdK8

# వికలాంగుడి కుటుంబంలో వెలుగులు నింపిన 'మోధా శివకుమార్'

మన తెలుగు రాష్ట్రాల్లో అత్యంత దయనీయ పరిస్థితుల్లో బ్రతుకు బండిని నడుపుతున్న వారిలో 'చేనేత కార్మికులు' కూడా ఒకరు. మనిషికి కూడు, గూడుతో పాటు అత్యంత ఆవశ్యక మైనది 'గుడ్డ'. ఈ బట్టలను నేసే వారు తప్ప మిగతా బట్టలమీద, వాటికి సంబం ధించిన ముడి సరుకు సరపరా మీద వ్యాపారం చేసే వారు అంతా దాదా పు ఉన్నతమైన స్థితిలోనే ఉంటారు. మరో ముఖ్య విషయం ఏమిటంటే బట్టలు నేయటానికి ప్రదాన ముడి సరుకు అయిన ప్రత్తి, పట్టు పండించే రైతుల పరిస్థితి కూడా దయనీయమే. మనిషికి గుడ్డలు కావాలంటే ప్రత్తి, పట్టు పండించాల్సిన రైతు, బట్టలు నేయాల్సిన నేత కార్మికులు మాత్రమే దుర్భర జీవనాన్ని వెళ్ళబుచ్చుతున్నారు. అంత దయనీయంగా ఉంటాయి వారి పరిస్థితులు.



ఒక కుటుంబం..... భర్త, భార్య, ఒక్క కొడుకు, ఇద్దరు కూతుళ్ళు ఒక కోడలు ..... భర్త వయసు పైన పడటంతో చేనేత పని చెయ్యలేని పరిస్థితి. కొడుకు, కోడలు మగ్గం నేస్తేనే కుటుంబం గడుస్తుంది. మరి అలాంటి పరిస్థితుల్లో ప్రమాదవశాత్తు ఆ కొడుకు (గొట్టిముక్కల రవేష్) ఒక రైలు ప్రమాదంలో రెండు కాళ్ళు పోగొట్టుకున్నాడు. ఒక కాలు వెూకాలు పై వరకు, మరో కాలు వెూకాలు క్రింద భాగం వరకు తీసివేయాల్సి వచ్చింది. ఉన్న ఒక్క కొడుకు కాలు కదపలేని పరిస్థితి ఉండటంతో ఆ కుటుంబం అతని రెండు కాళ్ళకు కృత్రిమ కాళ్ళను అమర్చడం జరిగింది కానీ, ఆ కాళ్ళతో మగ్గం నేయటం కుదరదు. ఇప్పుడా కుటుంబం పరిస్థితి ఏమిటి? తీవ్ర నిరాశ, అంధకార భవిష్యత్తు, కళ్లెదురుగా ఇద్దరు కూతుళ్ళ వివాహం, కొత్తగా పెళ్ళయిన కొడుకు కోడలు... వారి పరిస్థితి ఊహించుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. రెండు కాళ్ళు పోగొట్టుకున్న కొడుకు మగ్గం నెయ్యలేక, చిన్న పాక లాంటి ఇంటిముందు వున్న అరుగుపై కూర్చుని శూన్యంలోకి చూస్తూ, తన భవిష్యత్తును వెతుక్కుంటున్న గొట్టిముక్కల రమేష్ అనే నేత కార్మికుడు. అతని దయనీయ స్థితిని యూట్యూబ్ ద్వారా తెలుసుకు న్నాడు మన ఇన్నోవేటర్ వెూధా శివకుమార్. ఇలాంటి దయనీయ స్థితిలో వున్న నేత కార్మికుడికి తానే పరిష్కారాన్ని కనుగొనాలని నిర్ణయించుకున్నాడు. ఈ సంవేదనతో తయారు చేసిన 'పెడల్ ఆపరేటింగ్' యంత్రాన్ని తీసుకు వెళ్ళి అతని మగ్గానికి అమర్చి, "ఇప్పుడు నువ్వు నీ కాళ్ళు ఉన్నప్పటి కంటే సులభంగా, ఆనందంగా చీరలు నెయ్యగలవు చూడు" అని అతన్ని చీర నేసేలా చేశాడు శివ కుమార్.



శివకుమార్ దేశంలోని చేనేత కార్మికులు పడుతున్న కష్టాలు, శ్రమ నుండి విముక్తి చెయ్యడానికి తయారు చేసిన 'మోధా పెడల్ ఆపరేటింగ్' యంత్రానికి వికలాంగుడైన రమేష్ చేత నేత నేయించడమే కాదు, అతని 70 సంవత్సరాల వయసున్న తండ్రి కూడా సునాయాసంగా మగ్గం నేసేలా ఈ యంత్రం ఉంటుందని చూపించాడు. తండ్రి కాళ్ళతో పెడల్ ఆపరేషన్ చేసేలా, కొడుకుకు కాళ్ళు లేవు కాబట్టి అదే పనిని చేతులతో చేసేలా కేవలం ఒక స్విచ్ ఏర్పాటు చేసి, రమేష్‌కు ఈ యంత్రాన్ని అందించటంతో ఆ కుటుంబంలోని అందరి కళ్ళు ఆనందంతో మెరిసి పోవటం చూసింది 'పల్లెసృజన'. ముఖ్యంగా గొట్టిముక్కల రమేష్ తల్లి కళ్లలో అద్భుతమైన కాంతిని చూసింది. భవిష్యత్ ఎలా అనుకున్న సమయంలో తన కొడుకు గతం కన్నా మిన్నగా నాణ్యమైన చీరలు నేసేలా తయారు కావటానికి కారణమైన 'మోధా శివకుమార్' మా కుటుంబంలో ఒక సభ్యుడు అని సగర్వంగా చెపుకపొంది. జీవం లేకుండా నిశీధిలోకి ధీనంగా చూసే డజను కళ్ళల్లో ఇప్పుడు ఆనందంతో కూడిన వెలుగుల్ని చూసింది 'పల్లెసృజన'. చీకట్లు అలుముకున్న ఆ చిన్న పాకలాంటి ఇల్లు ఇప్పుడు ఆ కళ్ళ వెలుగుతో కళకళలాడుతోంది. ఆ కుటుంబంలో ఇంతటి ఆనందాన్ని నింపడంతో తన జీవితం ధన్యమై పోయిందని అంటున్నాడు 'మోధా శివకుమార్'.

**గొట్టిముక్కల రమేష్, పోచంపల్లి. ఫోన్ : 9030982030**






# కోవిడ్ సమయంలో జాతీయ స్థాయి లో 'పల్లెసృజన' వెబినార్ల ప్రథమ వసంతం

**- జమ్మలమడక శశిమోహన్**

'పల్లెసృజన' ప్రతి బుధవారం సాయంత్రం 7-30 గంటలకు క్రమం తప్పకుండా ఇన్నోవేటర్లు, రైతులు, ప్రజలు, శ్రేయోభిలాషులను కలుపుతూ నిర్వహించే వెబ్‌నార్‌ల శృంఖలో 8 డిసెంబర్, 2021నాడు నిర్వహించిన 52వ వెబ్‌నార్‌లో నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) ఛైర్మన్ డా. గోయెల్, హనీబీ నెట్‌వర్క్ స్థాపకులు, విశ్రాంత ప్రొఫెసర్ అనిల్ గుప్తా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఐ.టి. ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, ఐ.ఎ.ఎస్., ఐఐటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి, పల్లెసృజన వ్యవస్థాపక అధ్యక్షులు బ్రిగేడియర్ పి. గణేశం, పల్లెసృజన ముఖ్య సభ్యులు, భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐ.సి.ఎ.ఆర్). విశ్రాంత అధికారి కల్పనా శాస్త్రి, వాలంటీర్లు, ఇన్నోవేటర్లు, రైతులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

వెబ్‌నార్ ప్రారంభంలో పల్లెసృజన అధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం ప్రవేశ పెట్టిన తీర్మానం ప్రకారం భారతదేశ ప్రథమ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ విపిన్ రావత్ గారి ఆకస్మిక దుర్మరణం దృష్ట్యా ఆయన ఆత్మకి శాంతి చేకూరటానికి రెండు నిమిషాల పాటు మౌనం పాటిం చటం జరిగింది. తదనంతరం బ్రిగేడియర్ గారు పిపిటి ఆధారంగా 'పల్లెసృజన' ప్రారంభించినప్పటి నుండి ఇంత వరకు దాని ప్రయాణాన్ని వివరిస్తూ, పల్లెసృజనకు అసంతృప్తి అంటూ ఉండదని, దానికి కారణం మేము ఇంత పని చెయ్యాలి అని లక్ష్యం ఏదీ పెట్టుకోము అని, సాధించిందే విజయమని భావిస్తాం కనుక ఈ సిద్ధాంతం ప్రకారం 'పల్లెసృజన'కు అన్నీ విజయాలే అని వివరించారు.

'పల్లెసృజన' వాలంటీర్ మహేష్ మాట్లాడుతూ "ఇంత వరకు పల్లెసృజన 51 వెబ్‌నార్‌లు నిర్వహించిందని, కోవిడ్-19 కారణం గా సామాజిక కలయికలు దాదాపు ఆగిపోయిన సందర్భంలో కూడా ప్రజలకు - ఇన్నోవేటర్లకు వారధిగా ఈ వెబ్‌నార్‌లు సహాయ పడ్డాయని విషయ గ్రాహణకు, సమాచార మార్పిడికి, కొంత వరకు వ్యాపారానికి ఇవి చాలా ఉపయోగ పడ్డాయని" చెప్పారు.

ఈ సందర్భంలో ఇన్నోవేటర్లు రూపొందించిన 15 నిమిషాల నిడివి గల సృజనల వీడియోను ప్రదర్శించడం జరిగింది. తర్వాత రైతులు దాసరి వెంకట్ రెడ్డి, దుర్గా ప్రసాద్ మొదలైన వారు 'పల్లెసృజన' వలన వారు నిర్వహించిన వెబ్‌నార్‌ల వలన తామెంత లబ్ధి పొందామో వివరించారు.

> చట్టాల చట్రంలో బంధింపబడిన ప్రభుత్వ ఉద్యోగుల వలన కాదని, అవసరమైతే హాని లేకపోతే, నిబంధనలను పట్టించుకోకుండా, సహాయం చేయ గలిగినపుడే గ్రామీణ స్థాయి జ్ఞానాన్ని, ఇన్నోవేటర్లను, వారికి చేయూతనిస్తున్న 'పల్లెసృజన' లాంటి సంస్థలకు సహాయం చేసిన వాళ్ళమవుతాము. **- అనిల్ గుప్తా**

కల్పనా శాస్త్రి గారు మాట్లాడుతూ తాను చాలా కాలం ప్రభుత్వ సంస్థల్లోనే పని చేశానని, పల్లెసృజన పరిచయం అయిన తర్వాత గ్రామీణ స్థాయి ఇన్నోవేషన్‌లకు మనము తప్పనిసరిగా సహాయం చేయాలని ధృవీకరించు కున్నానని, ఇప్పటికీ అవకాశం ఉన్నచోటల్లా గ్రామీణ స్థాయి ఇన్నోవేషన్లకు ప్రత్యేక బడ్జెట్‌ల ద్వారా ఆర్థిక సహాయం అందించ వలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఒకవిధంగా ఇది తప్పనిసరిగా చేయ వలసిందని, ఈవిధంగా చేస్తే చిన్న



గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్లు కూడా పెద్ద వ్యాపార స్థాయి పోటీని ఎదుర్కొనటానికి సహాయం చేసిన వాళ్ళం అవుతామని, ఇది ఎంతో ఆవశ్యనీయమైన చర్య అని చెప్పారు.

ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారు మాట్లాడుతూ తనకు 'పల్లెసృజన' చాలా సంవత్సరాలుగా తెలుసు అని, సమాజానికి ప్రత్యేకించి గ్రామీణ స్థాయి ఇన్నోవే టర్లకు ఎనలేని సేవ చేస్తోందని చెవుతూ, తాను స్థాపించిన 'హనీబీ నెట్‌వర్క్' ఇప్పుడు 113 దేశాలకు విస్తరించిందని, ఆ విదేశాలలో జరుగుతున్న ఇన్నోవేషన్ల వివరాలు, జ్ఞానాన్ని కూడా మనం మన దేశ ఇన్నోవేటర్లకు అందించాలని చెప్పారు. గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్లకు సహాయం చేయాలంటే నిబంధ నలు, చట్టాల చట్రంలో బంధింప బడిన ప్రభుత్వ ఉద్యోగుల వలన కాదని, అవసరమైతే హాని లేకపోతే, నిబంధనలను పట్టించుకోకుండా, సహాయం చేయ గలిగి నపుడే గ్రామీణ స్థాయి జ్ఞానాన్ని, ఇన్నోవేటర్లను, వారికి చేయూతనిస్తున్న 'పల్లెసృజన' లాంటి సంస్థలకు సహాయం చేసిన వాళ్ళం అవుతాము అన్నారు.

ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్. మూర్తి మాట్లాడుతూ... తనకు పల్లెసృజన కొత్త అని గత గంట కాలం నుంచి పల్లెసృజన గురించి వింటూంటే తనకు అద్భుతమైన సినిమా చూస్తున్నట్లు ఉందని, ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నానని, ప్రపంచం లో గ్రామీణ స్థాయిలో ఇన్ని ఇన్నోవేషన్లు ఉన్నాయా అని, దీంతో పోల్చుకుంటే తాము, తమ ఐఐటిలు చేసేది చాలా తక్కువ అనిపిస్తోంది అని 'పల్లెసృజన' స్వచ్ఛందంగా ఏలాంటి ఆర్థిక సహాయం లేకుండా నడపటంలో దాని సంబంధించిన వారి దీక్షా, పట్టుదల తనని అబ్బుర పరిచిందని అన్నారు. తమ ఐఐటిలలో ఆంగ్ల భాషకి ప్రాధాన్యత ఎక్కువ అని, ఈమధ్యనే ఐఐటి స్థాయి జ్ఞానాన్ని గ్రామ స్థాయికి తీసుకు వెళ్ళటానికి, అక్కడి జ్ఞానాన్ని క్రింది స్థాయి వరకు స్థానిక భాషల్లోకి తీసుకు వెళ్ళటానికి ప్రయత్నం జరుగుతోంది అన్నారు. ఒకవిధంగా ఐఐటిలలో స్వల్పకాలిక నైపుణ్యం పెంచే కోర్సులు నిర్వహిస్తున్నామని, దానిలో గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్లకు అవకాశం కల్పిస్తే, అటు ఐఐటిలకు సార్థకత ఏర్పడుతుంది, ఇటు ఇన్నోవేటర్లకి మేలు జరుగుతుంది అని అన్నారు. ఈ రోజు నుండి 'పల్లెసృజన'కు, తనకు ప్రత్యేక బంధం ఏర్పడిందని, తన పరిధిలో ఎటువంటి సహాయం కావాలన్నా చేయటానికి పూర్తి ప్రయత్నం చేస్తానని అన్నారు. మావద్ద అన్ని వసతులు కల ప్రయోగ శాలలు అన్ని శాఖలలో ఉన్నాయి అని, వాటిని 'పల్లెసృజన'కు చెందిన గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్లు వాడుకునే సదుపా యం కలగజేయ గలనని చెప్పారు. పల్లెసృజనకై ఐచ్ఛికంగా పని చేసే ఇంతమందిని చూస్తూ వుంటే తనకూ ఉత్సాహంగా ఉందని, తానూ చేతనైన సహాయం చేసి, తానూ పల్లెసృజనలో భాగం పంచుకున్న సంతృప్తి పొందాలని నిర్ణయించు కున్నాను అన్నారు.




> ఈ రోజు నుండి 'పల్లెసృజన'కు, తనకు ప్రత్యేక బంధం ఏర్పడింది, తన పరిధిలో ఎటువంటి సహాయం కావాలన్నా చేయటానికి పూర్తి ప్రయత్నం చేస్తానను. మావద్ద అన్ని వసతులు కల ప్రయోగ శాలలు అన్ని శాఖలలో ఉన్నాయి అని, వాటిని 'పల్లె సృజన'కు చెందిన గ్రామీణ స్థాయి ఇన్నోవే టర్లు వాడుకునే సదుపా యం కలగజేయ గలనని చెప్పారు.
>
> -ప్రొ. బి.ఎస్.ఎన్. మూర్తి




ఎన్ఐఎఫ్. ఛైర్మన్ డా. పి.ఎస్. గోయెల్ గారు మాట్లాడుతూ, తాను గత ఒకటిన్నర గంటల నుంచి 'పల్లెసృజన' చేస్తున్న పనుల గురించి అర్థం చేసుకున్నది ఏమిటంటే, దేశ వ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలో 'పల్లెసృజన' లాంటి సంస్థలు ఉండి, కేవలం ఉండటమే కాదు, పల్లెసృజన చేస్తున్నంత ఉధృతంగా పని చేస్తే దేశం మొత్తం గ్రామీణ జ్ఞానము, గ్రామీణ ఇన్నోవేన్ల ఫలంగా సుసంపన్నం అవుతుంది. ఎన్.ఐ.ఎఫ్.లో లక్షన్నర ఇన్నోవేషన్ల వివరాలు (డాటాబేస్) ఉందని, దాని ఫలితం ఎవరైనా పొందవచ్చునని, అంటూ ఉండగా, దాన్ని తెలుగులోకి తర్జుమా చేసే ప్రయత్నం చేస్తున్నామని, దానికి అవసరమైన సహాయ సహకారాలు అందించాల్సిందిగా గణేశం గారు కోరినప్పుడు, అనిల్ గుప్తా గారు ఇప్పటికే ఇంగ్లీషు కాక, నాలుగు భాషలలో సమాచారం తర్జుమా చేయబడి ఉందని, దీని ఫలితం కావలసిన వారు వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునని చెప్పారు. గోయెల్ గారు తన సలహాలను కొనసాగిస్తూ, ఎన్.ఐ.ఎఫ్.కు ఇతర దేశాలతో కూడా కలిసి పనిచేసే ఒప్పందం ఉందని, ఆయా దేశాలలో జరుగుతున్న ఇన్నోవేషన్ల వివరాలు కూడా నెట్ నుండి పొందవచ్చునని చెప్పారు. ఇన్నోవేటర్ల గొప్పతనం గురించి చెబుతూ ఇన్నోవేషన్ చెయ్యాలంటే చాలా ఓర్పు కావాలని, 95 శాతం సమస్యను అర్థం చేసుకోవటంతోనే సరిపోతుం దని, కేవలం 5 శాతం సమస్య పరిష్కరించడంలో వెచ్చించబడుతుంది అని చమత్కరించారు.

దేశంలోని వివిధ ప్రాంతాలలో జరిగే అనేక ఇన్నోవేషన్లను చూస్తూవుంటే ఒకరు చేసిన ఇన్నోవేషన్లే చాలాసార్లు యథాతథంగా, కొన్నిసార్లు కొద్ది మార్పులతో మళ్ళీ మళ్ళీ చేస్తున్న ట్లు ఎన్.ఐ.ఎఫ్. దృష్టికి వచ్చింది. ఇది జరగకుం డా చూసుకుంటే (ఎన్.ఐ.ఎఫ్. డాటాబేస్ సహాయంతో) ఇన్నోవేటర్లు చేసిందే చెయ్యకుండా, కొత్త ఇన్నోవషన్లను చెయ్యటంపై తమ దృష్టి సారించ వచ్చును అని సలహా ఇచ్చారు.

మనం మన సమయమంతా గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్లను వెతకడము, వాళ్ళ జ్ఞానాన్ని, ఇన్నోవేషన్ వివరాలను గ్రంథస్తం చేసి, అవకాశమున్న చోటల్లా వివిధ స్థాయిలలో వారికి సన్మానాలు, సత్కారాలు, బిరుదులు ఇచ్చేంత వరకు చేస్తున్నాము. కానీ, వాళ్ళు తయారు చేసిన వస్తువు మార్కెటింగ్ చేసే స్థాయికి తీసుకు వెళ్ళి, స్వేచ్ఛా విఫణిలో మార్కెటింగ్ చేసే స్థాయికి వాళ్ళ ఇన్నోవేషన్‌ను తీసుకు వెళ్ళటానికి కానీ, వారికి ఆ అర్థబలము, అంగ బలము ఇవ్వటంలో తగ్గ న్యాయం చేయటం లేదని అనిపిస్తోంది. క్లుప్తంగా చెప్పాలంటే, మన ఇన్నోవేటర్లు




> దేశం మొత్తంలో ఐటి హబ్ లని స్థాపించి, వీటిని అనుసంధానం చేయడానికి 'టి.ఎస్.ఐ.సి.'ని ఏర్పాటు చేశాం. దానికొక ప్రత్యేక అధికారిని నియమించాం. ప్రభుత్వ అధికారుల ద్వారా పూర్తి న్యాయం జరగదేమో అన్న (నిజం కాదు) భావనతో వృత్తి నిర్వాహకులని కన్సల్టెంట్‌లుగా, వృత్తి నిర్వాహకులుగా నియమించాం. ప్రభుత్వ పరంగా చేస్తున్న సహాయంతో పాటు, అనేక వాణిజ్య సంస్థలు, కొన్ని విదేశీ సంస్థల సహకారం తో, సిఎస్ఆర్ పథకం ద్వారా ఎంతో మంది గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్లకు సహాయం అందించాం
>
> **- జయేష్ రంజన్, ఐ.ఎ.ఎస్.**

చేసిన ఇన్నోవేషన్లను మార్కెట్‌లో అమ్మే స్థాయిలోకి తీసుకు వెళ్ళ వలసిన బాధ్యత కూడా మనదే. దానికి ఎవరి సహాయాన్నైనా స్వాగతిద్దాం అన్నారు ఎన్ఐఎఫ్ ఛైర్మన్ గోయెల్.

తెలంగాణ రాష్ట్ర ఐ.టి. శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ వెబ్‌నార్‌లో తన అభిప్రాయాన్ని చెబుతూ.... 'పల్లెసృజన' బృందం గ్రామీణ స్థాయి ఇన్నోవేటర్లను, జ్ఞానాన్ని వెలుగులోకి తెచ్చి, ప్రాచుర్యం లోకి తీసుకు రావటానికి చేస్తున్న కృషికి మా అభినందనలు తెలియ జేస్తున్నాను. 'పల్లెసృజన' ద్వారా గ్రామీణ జ్ఞానం గురించి, ఇన్నోవేషన్ల గురించి వారివద్ద నిబిడీకృతమైన శక్తిని గురించి చాలా తెలుసు కున్నాను. 2014లో తెలంగాణ రాష్ట్రం అవతరించిన తదనంతరం ప్రభుత్వ పరంగా గ్రామీణ జ్ఞానానికి పెద్దపీట వెయ్యాలని సంకల్పించాము. అధికారుల అలసత్వం అనండి, నిబంధనల చట్రం అనండి అనుకున్న మేరకు, ఉత్సాహం మేరకు చేయలేక పోయినా, దేశం మొత్తంలో ఐటి హబ్ లని స్థాపించి, వీటిని అనుసం ధానం చేయడానికి 'టి.ఎస్.ఐ.సి.'ని ఏర్పాటు చేశాం. దానికొక ప్రత్యేక అధికారిని నియమించాం. ప్రభుత్వ అధికారుల ద్వారా పూర్తి న్యాయం జరగదేమో అన్న (నిజం కాదు) భావనతో వృత్తి నిర్వాహకులని కన్సల్టెంట్‌లుగా నియమించాం. ప్రభుత్వ పరంగా చేస్తున్న సహాయంతో పాటు, అనేక వాణిజ్య సంస్థలు, కొన్ని విదేశీ సంస్థల సహకారంతో, సి.ఎస్.ఆర్. పథకం ద్వారా ఎంతోమంది




అవగాహన మనకి తెలియటం లేదు. మన తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ఈ బృహత్ కార్యక్రమానికి చేయూతనివ్వటానికి సహాయంగా జపాన్ ప్రభుత్వం 'జికా' పథకం క్రింద గ్రామీణ ఇన్నోవే షన్లకు సహాయం చేయడానికి తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా ఎన్నుకొని పెద్ద మొత్తాన్ని రుణము/ గ్రాంటు రూపంలో ఇవ్వటానికి ముందుకు వచ్చింది అనటంలోనే తెలుస్తోంది గ్రామీణ ఇన్నోవేషన్లకి మన రాష్ట్రం ఎంతటి ప్రాముఖ్యతను ఇస్తోందో. గ్రామీణ ఇన్నోవేటర్లకు త్రికరణశుద్ధిగా సహాయం చేయడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. దానికి 'పల్లెసృజన' చేయూత కూడా తోడైతే మంచి ఫలితాలు సాధించగలము అన్న నమ్మకం నాకుంది అన్నా జయేష్ రంజన్.

ఇంతమంది జాతీయ, రాష్ట్రానికి చెందిన పెద్దలు 'పల్లెసృజన' కు చేయూతనివ్వటానికి తమ సంసిద్ధతను వ్యక్తం చేసిన ఈ 52వ వెబినార్‌లో ముఖ్య అతిథులకి, వెబ్‌నార్ నిర్వహణలో తోడ్పడ్డ అఖిల, మహేష్, సుభాష్, శ్రీకాంత్, సాయి, ఓంకార్, శ్రీధర్, మానస మొదలైన వారికి వాలంటీర్ లక్ష్మి రెడ్డి ధన్యవాదాలు అర్పించడంతో శుభప్రదంగా ఆనందదాయకంగా కార్యక్రమం ముగిసింది.

ఈ వెబినార్‌లో అతిథుల సలహాలు, సూచనలను 'పల్లెసృజన' గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్ల విస్తరణకై పూర్తి కృషి చేస్తున్నది.

## 'పల్లెసృజన' శ్రేయోభిలాషులకు, ఇన్నోవేటర్లకు విజ్ఞప్తి

'పల్లెసృజన' పత్రిక అప్రతిహతంగా 16 సంవత్సరాలుగా కుంటుపడకుండా మీ ముందుకు వస్తున్న విషయం మీకందరికీ విదితమే. స్వచ్ఛందంగా వాలంటరీ వ్యవస్థమీద ఆధారపడి, ఎటువంటి వ్యాపార ప్రకటనలు, డొనేషన్‌లు లేకుండా ఇప్పటి వరకు ఈ పత్రికను తద్వారా నూతన ఇన్నోవేషన్లను, ఇన్నోవేటర్లను మీకు పరిచయం చేస్తూ వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకు వస్తున్న విషయం కూడా మీకు తెలుసు.

కోవిడ్ మహమ్మారి ప్రపంచ వ్యాప్తంగా సృష్టించిన అలజడిలో కూడా నిరాఘాటంగా పత్రిక నడిపే ప్రయత్నంలో సఫలీకృతులం అయ్యాము. కానీ, రోజురోజుకూ పెరిగి పోతున్న పేపర్ ధరలు, ముద్రణా ఖర్చులను తట్టుకోవటం కొద్దిగా కష్టంగా మారుతోంది. కావున దయచేసి ఇన్నోవేటర్లు ఒక విషయం గమనించాలి. ఇప్పటి నుంచి మీకు చేరుతున్న పత్రిక ఉచితంగా పంపడం కొంత భారంగా అనిపిస్తోంది. కావున మీ పత్రికకు మీరు కూడా చందాదారులు కావలసిందిగా కోరుతున్నాము.

అలాగే శ్రేయోభిలాషులూ.... మీరు పత్రికకు అందిస్తున్న సహకారం మమ్మల్ని ఎప్పటికప్పుడు కార్యోన్ముఖులను చేస్తూ ఆనందంగా ముందుకు సాగేలా చేస్తోంది. కావున మీకు తెలిసిన వారికి, మీ మిత్రులకు ఈ పత్రికను గురించి తెలియజేసి, కొత్త చందాదారులను చేరేలా మీవంతు ప్రయత్నం చేయగలరు. వీలైనంత వరకు పత్రిక ధర పెంచకుండా, చందదారులను అధికం చేసినట్లయితే ముద్రణా ఖర్చు కొంత వరకు తగ్గుతుందని భావిస్తున్నాము. 'పల్లెసృజన' ప్రతి పల్లెకు చేరాలన్నదే మా ఆకాంక్ష. శుభ కార్యాలలో ఈ పత్రిక చందానే మీరిచ్చే బహుమతిగా చేసుకుని పత్రిక ఎక్కువ మందికి చేరేలా సహకరిస్తారని ఆశిస్తున్నాము.

**- ఎడిటర్.**

# అబ్బోజు వెంకటేష్ సృష్టి
# అనేక విధాల పనులు చేసే 'ఏకచక్ర వీడర్'



- వీరరాఘవ రెడ్డి

మారుతున్న కాలంలో రైతులు ఎద్దులను ఎలాగోలా అప్పు చేసి కొన్నా, వాటిని పోషించే స్థోమత, అందుకు తగిన సమయం కేటాయించే సమయం లేదు. ఉరుకులు పరుగుల లోకంలో అన్నీ ఇన్‌స్టంట్‌గా మారుతున్నాయి. వ్యవసాయంలో కూడా ఈ పద్ధతి పెరిగి పోయింది. ఎద్దులను కొని, వాటిని పోషించే సమయం లేక, తాహతు వున్న రైతులు ట్రాక్టర్లు కొనుగోలు చేస్తుంటే, స్థోమత లేని రైతులు వాటిని కిరాయికి తీసుకుని తమ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. ఇలా పెద్ద పెద్ద ట్రాక్టర్లతో వ్యవసాయం చేయటం వల్ల భూమిపైన బరువు పెరిగి, భూమి పొరలు కుచించుకుపోయి, దిగుబడి తగ్గుముఖం పడుతోందని, పైగా భూమిపై మోపుతున్న అధిక బరువున్న ట్రాక్టర్ల వల్ల భూమి పొరలపై వత్తిడి పెరిగి గట్టిబారిపోయి, వర్షపు నీటిని భూమిలోపలికి ఇంకించుకోలేక, పైపైనే పారిపోవటం వల్ల పంటలు త్వరగా ఎండిపోవటం, వర్షం పడినప్పుడు భూమిలోకి ఇంకని నీరు నేరుగా నదులలోకి పోవటం వల్ల వరదలు కూడా పెరిగి పోవటం మనం గమనించాలని గత సంచికలో ఒక అనుభవమున్న రైతు తెలియజేసిన విషయం విదితమే.

ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం, సామాన్య రైతులు కూడా కొనుగోలు చేసుకుని, ఒకరిమీద ఆధారపడకుండా తన పొలాన్ని దున్నుకోవడంతో పాటు, విత్తనం వేయటం, అంతర సేద్యాలు, పురుగు మందు పిచికారి, ఎరువులు, పంట దిగుబడుల రవాణా వరకు అన్నీ ఒకటే చిన్న యంత్రంతో పని చేసుకోవచ్చని నిరూపిస్తున్నారు రైతు ఇన్నోవేటర్లు.

ఇలా తయారైన ఎన్నో రకాల వీడర్లలో ఇప్పుడు మీకు పరిచయం చేస్తున్న ఈ వీడర్‌ను హన్మకొండ జిల్లా, శాయంపేట మండలం, గట్లకానిపర్తి గ్రామానికి చెందిన 30 సంవత్సరాల "అబ్బోజు వెంకటేష్" అనే ఇన్నోవేటర్ తయారు చేసిన 'ఏకచక్ర వీడర్' అనతి కాలంలోనే ఎంతోమంది రైతుల మన్ననలు అందుకుంది.

వెంకటేష్ కుటుంబ వృత్తి కమ్మరిపని. వ్యవసాయ దారులకు నిత్యం అందుబాటులో ఉండి వ్యవసాయ పనిముట్లను తయారు చేయడం, వాటిని రిపేర్లు చేయడం అన్నది 'గతం' క్రిందకు మారిపోయింది. ఇప్పుడు ప్రతి వ్యవసాయ పనిముట్టు ఇనుముతో తయారు చేయడం, వాటికి తక్కువగా రిపేర్లు రావటంతో గ్రామాల్లో కమ్మరి వృత్తి చేసుకునే వారికి కూడా పని లేకుండా పోయింది. దాంతో భుక్తి జరగటం కూడా కష్టమైంది.

పాత తరం కమ్మరి వృత్తి వారు వేరే పని చెయ్యలేక, కొత్తపని నేర్చుకోలేక తమ పాత వృత్తినే అప్పుడప్పుడూ అవసరమైన వారికి చేసుకుంటూ జీవనాన్ని భారంగా గడుపుతున్నారు. వారి పిల్లలు మాత్రం తమ వృత్తి ఆధారంగా గల పనులను నేర్చుకుంటూ నవ జీవనం వైపు పరుగులు పెడుతున్నారు. ఎక్కువ మంది కమ్మరి వారు 'కార్పెంటర్' వృత్తి వైపు అడుగులు వేశారు. మరి కొంతమంది తమ మేథస్సుకు పదును పెట్టి, వీడర్లు, కొత్త కొత్త వ్యవసాయ పరికరాలను తయారు చేస్తూ తిరిగి రైతుల పట్ల తామెప్పుడూ ఉన్నమని నిరూపిస్తున్నారు. ఇలాంటి కోవకు చెందినవాడే వెంకటేశ్వరాచారి.

మార్కెట్లో లభిస్తున్న, కొందరు ఇన్నోవేటర్లు తయారు చేసిన వీడర్లను గమనించి, వాటి పనితీరులో గల లోటుపాట్లను గమనించి ఈ సమస్యలన్నిటికి పరిష్కారంగా తానో వీడర్‌ను తయారు చేశాడు. రెండు



మూడు సంవత్సరాల ప్రయోగాలతో 'ఏకచక్ర వీడర్' తయారు చేసి, ఇప్పటి వరకు లభిస్తున్న రెండు చక్రాల వీడర్ల వల్ల ఎదురయ్యే సమస్యలు అన్నింటిని అధిగమించాడు.

ఈ 'ఏకచక్ర వీడర్' వెడల్పు కేవలం ఒక్క అడుగు (12 అంగుళాలు) మాత్రమే ఉంటుంది. రైతులు ఏ పంటనైనా సరే విత్తే దూరం కనీసం ఒక అడుగుకు పైగానే ఉంటుంది. అంటే ఈ వీడర్ మొక్కజొన్న లాంటి పంటలలో ఒకే సాలులో పయనిస్తుంది. ఇందులో 6.5 హార్స్‌పవర్‌ల శక్తిగల పెట్రోల్ ఇంజన్‌ను ఉపయోగించాడు. ఈ వీడర్‌కు ఒకే చక్రం ఉండటం వల్ల పొలం దున్నటంలో గట్టు వద్ద మరో సాలులోకి తిప్పుకోవటం చాలా సులభం. కేవలం ఒకటి రెండు రోజులు రైతు తర్ఫీదు తీసుకుంటే చాలు ఇక సులభంగా తన పొలాన్ని దున్నుకోవచ్చు. ఎటువంటి కుదుపులు (వైబ్రేషన్స్) ఉండవు కాబట్టి పొలం దున్నేటపుడు రైతు అలసటకు గురి కాకుండా ఎక్కువసేపు పని చేసుకోవచ్చు. ఈ వీడర్‌తో మహిళలు కూడా చాలా సులభంగా పని చేసుకోవచ్చు.

ఈ వీడర్‌కు వెనకవైపున 24 నుండి 30 అంగుళాల వరకు కూడా అవసరమైన పనిముట్లను ఏర్పాటు చేసుకోవచ్చు. అంటే ఒక పంట సాలులో వీడర్ నడుస్తూ ఉండగా దాని పక్కనున్న సాళ్లలో కూడా కలుపు తీసేందుకు అవసరమైన సామాగ్రిని బిగించుకుని సులభంగా పని చేసుకోవచ్చు. భూమి అన్నిచోట్ల ఒకేలాగా ఉండదు. కొన్నిచోట్ల గట్టిగాను, కొన్నిచోట్ల ఇసుకతో కూడి తేలికగాను, మరికొన్నిచోట్ల వదులుగాను ఉంటుంది. గట్టిగా వున్న నేలల్లో కాస్త బరువు అధికంగా వేయాల్సి వస్తుంది. అలాంటప్పుడు వెనకవైపు వాహనం నడుపుతున్న వ్యక్తి కాస్త గట్టిగా వత్తిడి చేసినట్లయితే మనిషి త్వరగా అలసట చెందుతాడు. పైగా ముందువైపు వీడర్ పైకి లేచే అవకాశం ఉంటుంది కాబట్టి వాహనానికి ముందు వైపున ఒక ఫ్రేమ్ ఏర్పాటు చేశాడు. ఆ ఫ్రేమ్ పైన ఇసుక లేదా మట్టి లేదా బరువైన ఒక రాయిని ఉంచుకుని సేద్యం చేసుకోవచ్చు. అలా బరువు పెట్టడం వల్ల దాన్ని నడిపే వ్యక్తికి ఎటువంటి అదనపు భారం ఉండదు.

ఇదే ఫ్రేముపైన పంటలపై పురుగు మందు పిచికారి చెయ్యాలి అనుకుంటే అవసరమైన 25 లీటర్ల నీటి డ్రమ్మును ఏర్పాటు చేసుకుని, పిచికారి చేసుకోవచ్చు. అవసరమైన సామాగ్రిని తగిలించుకుని, ఒకే రైతు రెండు నుండి నాలుగు సాళ్ళ వరకు పురుగు మందు పిచికారి చేసుకో వచ్చు. ఇదే యంత్రానికి వున్న చక్రానికి ఇరువైపుల రెండు సైకిల్ చక్రాలను, వెనకవైపున ట్రాలీని తగిలించుకున్నట్లయితే ఇంటినుండి





పొలానికి, పొలం నుండి ఇంటికి సామాగ్రిని, పంట దిగుబడులను చేరవేసుకునేలా రవాణా వాహనంగా కూడా వినియోగించుకోవచ్చు. ఇదే వీడర్‌తో పొలానికి అవసరమైన ఎరువులు వేసుకోవచ్చు, విత్తనాలు కూడా దీనితోనే ఒకే వ్యక్తి విత్తుకోవచ్చు.

ఈ ఏకచక్ర వీడర్‌తో ఎకరాకు ఒక లీటర్ పెట్రోలు (పొలాన్ని బట్టి కాస్త అటూ ఇటుగా) ఖర్చుతో పనులు చేసుకోవచ్చు. ఈ వీడర్ వల్ల చేతకాని పని ఒక్కటే వుంది. అదేమిటంటే లోతు దుక్కులు చెయ్యలేదు. దీని సామర్థ్యం తక్కువ కాబట్టి రైతులు ఎండా కాలంలో చేసుకునే లోతు దుక్కులను ఈ వీడర్‌తో చెయ్యటం సాధ్యం కాదు. కేవలం ఈ ఒక్క పనిని ట్రాక్టర్లు లేదా ఎద్దులతో కిరాయికి పని చేయించుకుంటే చాలు, మిగతా అన్ని పనులను ఈ వీడర్‌తోనే చేసుకోవచ్చు.

ఈ వీడర్లను ఇన్నోవేటర్ తన గ్రామంలోని ఇంటివద్దనే నలుగురు సహాయకుల ఆసరాతో తయారు చేస్తూ గ్రామీణ యువతకు ఉపాధి కూడా కల్పిస్తున్నాడు. కేవలం ఆరు నెలల్లోనే వందకు పైగా వీడర్లను రైతులకు అందించాడు. ఉపయోగిస్తున్న రైతులందరూ తమకు ఈ వీడర్ ఎంతో సహాయకారిగా మారిందని, దీని కరీదు ఒక్క పంట కాలంలోనే తీరిపోతుందని తమ సంతోషాన్ని వ్యక్తం చేశాడు.

ఇటీవల గుంటూరు ల్యాంఫాంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ఈ వీడర్ పనితీరు, సామర్థ్యం చూసిన భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు వెంకటేశ్వరాచారిని అభినందించారు. ఆ ప్రదర్శన చూసిన రైతులు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఈ వీడర్ పనితీరును, ఇన్నోవేటర్‌ను అభినందించారు.

రాబోయే సీజన్ నాటికి ఈ వీడర్‌కు ఎక్కువ కొనుగోలు దారులు లభిస్తారన్న అభిప్రాయంతో వెంకటేశ్వరాచారి అందుకు అవసరమైన వీడర్ ఫ్రేములను ముందుగానే తయారు చేసే ప్రయత్నంలో ఉన్నాడు. ఇందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందించే ఏర్పాట్లు చేయటానికి ప్రయత్నిస్తోంది 'పల్లెసృజన'. ఈ వీడర్ ఖరీదు కేవలం రూ. 30 వేలు. వీడర్‌తో పాటు గొర్రు/ నాగలి పలుగులు, గుంటక బ్లేడ్లు అందజేస్తాడు. పురుగు మందు పిచికారి, ట్రాలీ, విత్తనాలు వేసేందుకు అవసరమైన జడిగం, రోడ్డుపై నడిచేందుకు అవసరమైన సైకిల్ చక్రాల లాంటి ఇతర పరికరాల ఖరీదు అదనంగా పెట్టుకోవాల్సి ఉంటుంది.

ఈ వీడర్ ఎక్కువ మంది రైతులను చేరుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలను ఇన్నోవేటర్ వెంకటేశ్వరాచారికి అందించే ప్రయత్నాలు చేస్తోంది 'పల్లెసృజన'. ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాల్లోని యావత్ రైతాంగం ఈ యంత్రాన్ని కొనుగోలు చేసుకున్నట్లయితే, వ్యవసాయ ఖర్చులను 30–40 శాతం వరకు తగ్గించుకోవచ్చు. ●

**ఇన్నోవేటర్ అబ్బోజు వెంకటేష్, ఫోన్ : 91005 43607**

## సమస్య పరిష్కారం

### సరియైన యాంత్రీకరణం లేక

# అంతరించిపోతున్న 'సాంప్రదాయ నార తాళ్ళు'

### పరిష్కారం కొరకు రైతుల ఎదురు చూపులు



- పల్లె వీరరాఘవ రెడ్డి

పూర్వం ప్రతి రైతు ఇంట్లో 'కలబంద, కొబ్బరి, ఈత' తాళ్ళు ఉండేవి. వేసవి కాలం వచ్చిందంటే చాలు తాళ్ళు పేనుకోవటమనే ఒక వేడుకతో ప్రతి రైతు కళ్ళం కళకళలాడుతూ ఉండేది. ఆ సమయంలో వారు చెప్పుకునే లోకాభి రామాణం, గ్రామ ముచ్చట్లు వింటూ ఎంతో మంది తమకు తెలియకుండానే తాను పేడే వారికి తమ సహకారం అందిస్తూ ఉండేవారు. ఇప్పుడా ముచ్చట కనుమరుగై పోయింది. అందుకు కారణం గ్రామాలను ముంచెత్తిన 'ప్లాస్టిక్'. రైతు వ్యవసాయ పనుల్లో, లారీలలో సరుకు రవాణాకు వినియోగించే కొబ్బరి తాళ్ళ స్థానంలో, రైతు లేగదూళ్ళను కట్టివుంచే ఈత తాళ్ళ స్థానంలో.... ఇలా ప్రతి తాడు స్థానాన్ని 'ప్లాస్టిక్ తాళ్ళు' ఆక్రమించేశాయి.

గ్రామాల్లో రైతులు ఈ ప్లాస్టిక్ తాళ్ళ పగ్గాలను ఉపయోగిస్తే చేతులు ఒరుసుకు పోతున్నాయి తప్ప ఎద్దులు ఆగటం లేదని, ఎద్దుల బండ్లపై పొలం నుండి వ్యవసాయ వ్యర్థాలైన గడ్డి, వేరుశనగ పొట్టు లాంటి వాటిని వేసుకుని ఎంత గట్టిగా కట్టినా నార తాళ్ళలా బిగుతు రాక ఎక్కడ గడ్డి పడిపోతుందో అన్న భయంతో ఇల్లు చేరాల్సి వస్తోందని వాపోతున్నారు. ఎన్నో సాంప్రదాయ పనులకు ప్రత్యామ్నాయ యంత్రాలను తయారు చేసిన ఇన్నోవేటర్లు ఈ నార తాళ్ళను కూడా సులభంగా తయారు చేసేలా ఏవైనా చిన్న చిన్న యంత్రాలు లేదా పరికరాలు తయారు చేయ గలిగితే మళ్ళీ మంచి తాళ్ళు వస్తాయని ఎదురు చూస్తూ ఉన్నారు. ప్రస్తుతం 40-50 సంవత్సరాల పైబడిన వయసున్న రైతులు కలబంద నారతో పేనిన తాళ్లకు, ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న 'ప్లాస్టిక్' తాళ్ళకు మధ్య వ్యత్యాసాన్ని గమనించి, ఏమీ చేయలేని అసహాయ పరిస్థితుల్లో, 'గతిలేని పరిస్థితుల్లో' కలబంద నారతో పేనిన తాళ్ళకు బదులు "ప్లాస్టిక్" తాళ్ళను ఉపయోగిస్తున్నారు. సాధారణంగా వర్షాకాలం, చలి కాలాల్లో ఉదయం 8-9 గంటల మధ్య తమ ఎద్దుల మెడలపై కాడి పెట్టి, ఎద్దుల మెడలకు 'జతిక'లతో కాడికి బిగించి, ఆ కాడిపై తాను వ్యవసాయ పనులు చేయాలనుకున్న పొలానికి అనువైన వ్యవసాయ పరికరాలను (గొర్రు, గుంటక, నాగలి) వేసి 'మోకు' (కలబంద నారతో పేనిన ఓ మోస్తరు పెద్ద తాడు)తో వాటిని బిగించి, పొలానికి వెళ్ళేవారు.

ప్లాస్టిక్‌తో తయారైన తాళ్ళకు, కలబంద నారతో తయారైన తాళ్ళకు ఎంతో వ్యత్యాసం వుంటుంది. కలబంద తాళ్ళు ఉపయోగించే కొద్దీ సున్నితంగా తయారవుతాయి కాబట్టి చేతులు, పశువుల మెడలు ఒరుసుకుని పోవు. అవే ప్లాస్టిక్ తాళ్ళయితే ఉపయోగించే కొద్దీ వాటిలో గట్టిదనం పెరిగి పశువులు, మనుషుల శరీరం ఒరుసుకు పోతుంది.

ఎద్దుల గమనాన్ని అదుపు చేయటానికి ఉపయోగించే 'పగ్గాలు' నారతో చేసినవి అయితే చేతికి పటుత్వం వుంటుంది, కాబట్టి ఎంత గట్టిగా గుంజి పట్టుకున్నా చేతికి ఏమీ కాదు. అదే ప్లాస్టిక్ తాడు అయితే చేతినుండి జారిపోతాయి, పటుత్వం ఉండదు.

అరటి దుంగలను నలిపి నార తీస్తున్నపుడు కలబంద పట్టలను కూడా నలిపి నార తీసేలా ఒక యంత్రం తయారైతే రైతులు మళ్ళీ సాంప్రదాయపు నార తాళ్ళను వినియోగించడానికి సిద్ధంగా ఉన్నారు. అందుకే పల్లెసృజన ఎప్పటినుంచో చెబుతున్న విషయం 'సాంప్రదాయ పద్ధతికి సాంకేతికతను తోడు చేస్తే' గ్రామాలకు పూర్వ వైభవం వచ్చే అవకాశాలు చాలానే ఉన్నాయి.

నార తీసే యంత్రాలను తయారు చేయాల్సిన అవసరం ఇన్నోవేటర్లు, ఇంజనీర్లపైన ఉంది. కలబంద, ఈత, కొబ్బరి నారను సులభంగా తయారు చేసి, తాను పేడే యంత్రాల ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఈ రెండు పనులు చేసినట్లయితే గ్రామాల్లో మళ్ళీ సాంప్రదాయ నార తాళ్ళు పునరుద్ధరింపబడి, వాతావరణాన్ని కొంత వరకు కాపాడే అవకాశం కూడా ఉంటుందని విశ్వసిస్తోంది 'పల్లెసృజన'.

## ఎండిపోతున్న వేపచెట్లను కాపాడే పరిష్కారం కావాలి!

సాధారణంగా సేంద్రియ రైతులు పురుగు మందుల నివారణకు తయారు చేసే 'కషాయాల'లో వేపచెట్టు ప్రముఖ పాత్ర వహిస్తున్నది. అంతే కాకుండా మానవాళికి కూడా ఎన్నో రోగాల నివారణకు వేపచెట్టు, పంటలకు వేప చెక్క, వేప పిండి, వేప నూనె ఇలా ఎన్నో రకాల ఔషధ గుణాలు కలిగిన చెట్టు. ఈ చెట్లే అనారోగ్యానికి గురై ఎండిపోతున్నాయి. వాటిని రక్షించేందుకు ఏదైనా ద్రావకం తయా రు చేసి అందించిన ట్లయితే తమ మిత్రులతో కలిసి ఒక ట్రస్టుగా ఏర్పడి మా చుట్టు ప్రక్కల వీలైనంత ఎక్కువ ప్రాంతాలలో ఆ ద్రావకాన్ని చెట్లపై పెద్దయెత్తున పిచికారి చేయించి, వేప చెట్టును కాపాడాలన్నది హైదరాబాద్ లోని రాంనగర్ ప్రాంతానికి చెందిన **మధు యాదవ్**, (ఫోన్ : 9849478884) ప్రయ త్నం. వీలైనంత త్వరలో ఈ సమస్యకు పరిష్కారం చూపించ వలసిందిగా కోరుతున్నారు.

**చిన్నశోధయాత్రలో ఎన్నో ఎండిన వేపచెట్లు చిగురించటం చూశాం ఇదొక శుభసూచకం.**

# 'పునాది స్థాయి ఇన్నోవేషన్ల'తో గ్రామీణ యువతకు స్వయం ఉపాధి



- జమ్మలమడక శశిమోహన్

గ్రామల్లో యువతీ యువకులు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాల రీత్యా ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే మన దేశంలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత స్థాయి చదువులకు వెళ్తున్న యువత కేవలం 23 శాతం. అంటే 73 శాతం యువత ఉన్నత చదువులు చదవలేక పోతున్నారు. ఎంతోమంది ఉపాధి కోసం ఎదురు చూపులు చూస్తున్న సంగతి అందరికీ విదితమే. తమ చదువుకు తగిన ఉపాధి లభించటం లేదని కొందరు, ఏదైనా ఉద్యోగం సాధిద్దామంటే తగినంత చదువు చదవలేక పోయామే అని కొందరు, ఏదైనా వ్యాపారం చేసుకుందామంటే బ్యాంకులు ఎలాంటి తనఖా లేకుండా తమకు రుణం ఇవ్వటం లేదని కొందరు..... ఇలా ఎన్నో రకాలుగా ఆలోచిస్తూ, ఏమి చెయ్యాలో తెలీక నిస్సహాయంగా గ్రామ యువత కాలం గడుపుతున్నారు.

ఇలాంటి యువత కొరకు తమ గ్రామంలోనే వుండి, తాము తల్లిదండ్రులపైన ఆధార పడకుండా తమ ఖర్చులకు అవసరమైన ధనాన్ని తామే సంపాదించుకోవటంతో పాటు తామే కుటుంబానికి కాస్త చేదోడుగా తయారవుతూ, తమను తిట్టిన నోళ్ళే పొగిడేలా తయారు కావడానికి అవసరమైన ఎన్నో పునాది స్థాయి ఇన్నోవేషన్లను 'పల్లెసృజన' వెలుగులోకి తెచ్చింది. ఏ పని చేస్తున్నామన్నది ముఖ్యం కాదు, తాము చేస్తున్న పని ఎంత మందికి ఉపయోగ పడుతున్నది, దానివల్ల తాము ఎంత సంపాదిస్తున్నాము, గతంకన్నా ఇప్పుడు మనపైన ఎంత గౌరవం పెరిగింది అన్నది ఆలోచిస్తే చాలు మీ భవిష్యత్తును మీరే తీర్చి దిద్దుకున్నవారు అవుతారు. ఈ పరంపరలో 2021 జులై–ఆగస్టు సంచిక నుండి యువత ఉపాధి కొరకు వెలుగులోకి వచ్చిన ఇన్నోవేషన్లను గురించి తెలియజేస్తోంది 'పల్లెసృజన'.

– ఎడిటర్.

## సేంద్రియ పురుగు మందులు, ఎరువుల తయారీతో గ్రామీణ యువతకు ఉపాధి

ప్రస్తుతం సమాజంలో ముఖ్యంగా గ్రామీణ సమాజంలో వస్తున్న గణనీయమైన, ఆరోగ్యకరమైన మార్పు 'ప్రకృతి వ్యవసాయం' వైపు రైతులు అడుగులు వేయటం. అందువల్ల వాతావరణ కాలుష్యం తగ్గటంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి జరుగుతోంది, అదే సమయంలో సేంద్రియ పంటల కొనుగోలు పెరిగి రైతుకు కూడా అధిక ఆదాయం లభిస్తోంది.

ఇక్కడ ఒక్క విషయం గమనించాలి. రోజురోజుకూ పెరిగి పోతున్న రసాయన పురుగు మందుల భారం భరించలేక, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంటలు కూడా రసాయన పద్ధతితో సమానంగా కొన్నిచోట్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి, ఆదాయం రావటం గమనిస్తున్న రైతులు ఆవైపు మొగ్గు చూపాలని ప్రయత్నిస్తున్నా, అనుకున్నంత విప్లవాత్మక మార్పు రాకపోవటానికి కారణాల్లో ప్రధానమైనది కషాయాలను తయారు చేసుకునే సమయం, ఓపిక లేకపోవటం ఒక ఎత్తయితే, వాటిని రసాయన పురుగు మందుల్లా నేరుగా కొనుగోలు చేయటానికి అవి అందుబాటులో లేకపోవటం కూడా ఒక కారణం.

అందుకే గ్రామాల్లోని యువకులు సరియైన శిక్షణ తీసుకుని, ఈ కషాయాలను తయారు చేసి వారి గ్రామంలోనే రైతుకు అందుబాటులో లభించేలా చేయగలిగితే ప్రకృతి వ్యవసాయ పద్ధతి గణనీయంగా పెరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

ప్రతి గ్రామం ముందు తెలంగాణ లోని 'ఎనబావి' అనే గ్రామం దారిలో ఉన్నట్లు 'రసాయన రహిత గ్రామం' అనే బోర్డులు







దర్శనం ఇవ్వగలవని 'పల్లెసృజన' విశ్వశిస్తున్నది.

ఆకులను, కషాయాల్లో కలిపే కొన్ని రకాల పదార్థాలను సేకరిండం, వాటిని దంచడం లేదా రుబ్బడం లాంటి పనులు, వాటిని వడకట్టి పిచికారికి అనువుగా తయారు చేయుటం, తగిన సీసాల్లో సిద్ధంగా ఉంచటం, సీసాలపైన అవసరమైన స్టిక్కర్లు అతికించడం, ఈ పురుగు మందులను గ్రామీణులకు తెలియజేసే మార్కెటింగ్ పద్ధతి, కషాయాలు తయారు చేయటానికి అవసరమైన మిక్సీ, గ్రైండర్ తదితర సామాగ్రిని సమకూర్చుకోవటం లాంటి వాటిలో సరియైన శిక్షణ ఇచ్చే ఏర్పాట్లను స్వచ్ఛంద సంస్థలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది.

ఉదాహరణకు 'దశపత్ర కషాయం' తయారు చెయ్యాలి అనుకుంటే, పది రకాల ఏయే ఆకులను ఎలా సేకరించాల్లి, వాటిని మెత్తగా రుబ్బి, వాటిని తగు పాళ్ళలో కలిపి సరైన మోతాదును ఎలా ధృవీకరించి తయారు చేయాలి. అలా తయారైన కషాయాన్ని తగిన ఆకర్షణీయమైన సీసాల్లో నింపి, వాటికి అవసరమైన అందమైన స్టిక్కర్లను అతికించి కావలసిన రైతును ఆకర్షించేలా ప్రదర్శించి, అమ్మడం లాంటి వాటిలో సరియైన శిక్షణ చాలా అవసరం.

ఈ పనులు చేయాలనుకున్న యువకులు తమ గ్రామం మరియు చుట్టుపట్ల గ్రామాలకు వెళ్ళి రైతులకు ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించి, అలా చేయటం వల్ల ఆరోగ్యకరమైన ఆహారం సమాజానికి అందించటమే కాదు, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వస్తుందని ప్రచారం చెయ్యటం బాధ్యతగా చెయ్యాలి. ఎలాంటి కషాయాలు ఏయే పురుగులను సమర్థవంతంగా ఎదుర్కొంటాయి, వాటి తయారీకి అవసరమైన ముడిసరుకులు ఏవి, ఎంత మోతాదులో కలపాలి లాంటి సాంకేతిక సలహాలను ఎప్పటికప్పుడు సేకరిస్తూ ఉండాలి. అవి తయారు చేసేలా అవగాహన పెంచే సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాలి.

ఇలా చేసినట్లయితే ఈ వ్యాపారం చేసుకోవటానికి అవసరమైన ఖర్చును గ్రామంలోని యువకులు ఒక సమూహంలా ఏర్పాడి, తలా కొంత మొత్తం మాత్రమే అవుతుంది కాబట్టి ఎవ్వరికీ భారంగా ఉండదు. సమూహంగా చేసుకోవటం వల్ల వ్యాపారం బాగా విస్తరించే అవకాశం వుండి, ఎక్కువ లాభాలు ఆర్జించటం జరుగుతుంది. అదే సమయంలో ఎక్కువ మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపుకు మరల్చటం ద్వారా గిరాకీ పెరిగి వ్యాపారం సజావుగా సాగేలా చేసుకో వచ్చు.



ఇలా చేయటం వల్ల తాము లాభపడటమే కాక, ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య పెంచటం ద్వారా వారి ఖర్చులను విపరీతంగా తగ్గించి, ఎక్కువ దిగుబడి, ఆదాయం వచ్చేలా చేయటంతో పాటు, సమాజానికి ఆరోగ్యకరమైన ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేశామన్న తృప్తి ఉంటుంది.

సామూహిక పద్ధతి వల్ల మరో లాభం కూడా ఉండే అవకాశం ఉంది. దాదాపు ప్రతి రైతు పంట గురించిన పూర్తి వివరాలు మీవద్ద ఉంటాయి కాబట్టి వచ్చిన వ్యవసాయ దిగుబడిని కూడా తావే మార్కెటింగ్ చేసే అవకాశాలు కూడా మెరుగవుతాయి. అప్పుడు రైతు ఎక్కువ దూరం వెళ్ళి, దళారుల మోసాలకు గురి కాకుండా చేయటంతో పాటు, మీరూ అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చు. ఈ విధానం విజయవంతంగా అమలు చేయగలిగితే మార్కెట్‌లో కూడా త్వరలో మీవల్ల మంచి నాణ్యమైన ఆహార ఉత్పత్తులు లభిస్తాయి అన్న పేరు తెచ్చుకో గలిగితే, సమీప భవిష్యత్తులో మీ వ్యాపారం ఎదిగుతుంది. ఈ పద్ధతి వల్ల గ్రామాల నుంచి అనవసరంగా బైటకు వెళ్ళే ఖర్చులు తగ్గి, ఏ గ్రామ సంపద గ్రామంలోనే నిలబడేలా చేయవచ్చు.

అంటే చిన్న చిన్న మిల్లులు ఏర్పాటు చేసి, మీ గ్రామంలో పండిన పంటను తినటానికి సిద్ధంగా అక్కడే ప్రాసెసింగ్ చేసి, మార్కెట్‌లో విక్రయించటం ద్వారా అదనపు ఆదాయం సమకూరుతుంది. ఈ ప్రాసెసింగ్ గ్రామంలోనే చేయటం ద్వారా గ్రామంలోని పశువులకు కూడా అవసరమైన దాణా పట్టణాల నుంచి కొనుగోలు చేసుకోకుండా ఆ గ్రామంలోనే తయారవుతుంది. ఈవిధంగా ఏ గ్రామ సంపద ఆగ్రామంలోనే నిలబెట్టినట్లయితే గ్రామాలు సస్యశ్యామలం కావటం అంతా మీ చేతుల్లోనే ఉంటుంది.

అంటే మీ నిరుద్యోగ సమస్య తీరటంతో పాటు, మీ గ్రామాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత కూడా మీకే దక్కుతుంది. ఊరి డబ్బు ఊరి వాళ్ళకే లభిస్తుంది, మీ సమూహానికి గ్రామంలో విలువ కూడా పెరుగుతుంది. ఈ పనులన్నీ చేయటానికి అవసరమైన సలహాలు, సూచనలు, యంత్రాలు అందించటానికి 'పల్లెసృజన' ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. మీ అభివృద్ధికి తగిన తోడ్పాటును అందిస్తుంది. ఇలా చేయటం వల్ల మీ గ్రామంలోనే మీరు ఉపాధి పొందటంతో పాటు, మీ గ్రామాన్ని రసాయన రహిత గ్రామంగా మార్చటంలో ప్రముఖ పాత్ర పోషించినవారవుతారు. ●

# నవంబర్ - డిశంబర్ 2021 లో జరిగిన 'పల్లెసృజన' విశేషాలు








అసిస్టేటివ్ టెక్నాలజీ ప్రదర్శన కార్యక్రమంలో పాల్గొన్న 'పల్లెసృజన' ఇన్నోవేటర్లకు గుర్తింపు పత్రాలను అందజేస్తున్న జయేష్ రంజన్, ఐఎఎస్, కార్యక్రమంలో పాల్గొన్న పల్లెసృజన ఇన్నోవేటర్లు, సభ్యులు



విజయవాడలో జరిగిన 'ఆర్గానిక్ మేళా' కార్యక్రమంలో పాల్గొన్న 'పల్లెసృజన' ఇన్నోవేటర్ 'గొర్రె అశోక్'ను సత్కరిస్తున్న ఆంధ్రప్రదేశ్ బిజెపి అధ్యక్షులు సోము వీర్రాజు





విజయవాడలో జరిగిన 'ఆర్గానిక్ మేళా' కార్యక్రమంలో పాల్గొన్న 'పల్లెసృజన'కు గుర్తింపు పత్రాన్ని ఆంధ్రప్రదేశ్ నాబార్డ్ సిజిఎం సుధీర్ కుమార్ చేతులమీదుగా అందుకుంటున్న సుభాష్



పల్లెసృజన ఇన్నోవేషన్లను ఆసక్తిగా పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు









గుంటూరు లోని ల్యాం ఫాంలో జరిగిన ప్రదర్శన కార్యక్రమంలో పల్లెసృజన ఇన్నోవేషన్లను ఆసక్తిగా పరిశీలిస్తున్న సందర్శకులు



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

**విత్తనాలు నాటి ఎరువులు వేసే చేతి పరికరం :**

**సమస్య - పరిష్కారం :**

వ్యవసాయంలో విత్తనాలు వేయటమనేది చాలా ముఖ్యమైన కార్యక్రమం. సరైన సమయంలో, సరైన పద్ధతిలో విత్తనాలు నాటకపోతే మొత్తం పంట దెబ్బతినే ప్రమాదముంది. దీనికి రైతులు వివిధ రకాల పద్ధతులను వాడుతూ వుంటారు. స్థితిమంతులైన రైతులు ట్రాక్టర్లు, సీడర్లు వాడినా, ఎక్కువ సంఖ్యలో వుండే పేద రైతులు చేతితో విత్తనాలు నాటడం కష్టమైన పనిగానే వుంటుంది. సాంప్రదాయ పద్ధతిలో చేతులతో విత్తనాలు నాటడానికి మనిషి వంగి, చేతితో గుంత చేసి, విత్తనం వేసి మళ్ళీ మట్టిని పూడ్చవలసి వుంటుంది. మరలా రెండవ



విత్తనం వేయటానికి ఇదే పద్ధతి అవలంభించాలి. ఇలా కొన్ని వేలు, లక్షల్లో విత్తనాలు వేయాల్సి వుంటుంది. ఇదంతా ఎంతో శ్రమతో కూడుకున్న పని, ఖర్చు కూడా ఎక్కువే. ఇలా చేయటం వల్ల నడుం నొప్పితో చాలా ఇబ్బంది పడ్డ రైతులు, కూలీలు కూడా ఉన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మనిషి వంగి పని చేయాల్సిన అవసరం లేకుండా, నిలబడే గుంత చేసి, విత్తనం వేసి, పూడ్చేసేలా ఒక పరికరాన్ని తయారు చేశాడు గుజరాత్‌కు చెందిన 'మన్సుక్ భాయ్ డిగాని'.

**పరికరం :**

ఈ పరికరం ఒక గొట్టం రూపంలో వుండి, క్రింది భాగంలో భూమిలోకి చొచ్చుకొని పోయే విధంగా మొనదేలి వుంటుంది. పై భాగంలో విత్తనాలు, ఎరువులు వేసుకోవటానికి అనువుగా ఒక పెట్టెను ఏర్పాటు చేసి వుంటుంది. ఈ గొట్టంలో స్ప్రింగు అమర్చబడిన ఒక ఇనుప కడ్డీ వుంటుంది. అది పైన ఏర్పాటు చేసిన ఒక లివర్‌ను నొక్కినపుడు విత్తనం డబ్బా తెరుచుకుని విత్తనం నేలలోకి దిగుతుంది, దాన్ని పైకి గుంజి కాలితో మట్టిని మూసివేస్తే సరిపోతుంది. ఇదేవిధంగా ఎరువును కూడా వేసుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

- మనిషి వంగకుండా పని చేయటానికి వీలుగా ఉంటుంది.
- ఎంత లోతు అవసరమనుకుంటే అంత లోతుగా భూమిలోకి చొప్పించవచ్చు.

**ముఖ్యాంశాలు :**

- దీనితో పని చేయటం చాలా సులువు.
- సమయము, కూలీల ఖర్చులు ఆదా చేసుకోవచ్చు.





❀ శారీరక శ్రమ చాలా తక్కువ.
❀ ఒకే రకంగా విత్తనం వేయటం వలన మొలక శాతం పెరిగే అవకాశముంటుంది.
❀ విత్తనాలు, ఎరువులు వృధా కావు.
❀ తక్కువ ఖర్చులో పనైపోతుంది.

**వివిధ పంటల నూర్పిడి యంత్రం :**

**సమస్య - పరిష్కారం :**

దేశంలో ఏ మూల వున్న రైతుకైనా ధాన్యం ఎక్కువగా నష్టపోకుండా, శుభ్రమైన గింజలను అందించే నూర్పిడి యంత్రం ఎంతో అవసరం. మార్కెట్లో రకరకాల నూర్పిడి యంత్రాలు అందుబాటులో వున్నా, ఒక్కో పంటకు ఒక్కో రకం యంత్రాలు ఉంటాయి. అవి కూడా ధాన్యం నష్టం ఎక్కువగా జరగకుండా నియంత్రించలేక పోవడమే కాదు, శుభ్రమైన ధాన్యాన్ని కూడా అందించలేవు. ఈ సమస్యలన్నీ పరిష్కరించేందుకు దాదాపు అన్ని రకాల ధాన్యాలను నూర్పిడి చేసేందుకు ఒకే యంత్రం తయారు చేశారు రాజస్థాన్‌కు చెందిన 'మదన్‌లాల్ కుమావత్'. ఈ యంత్రం తక్కువ ధాన్యం నష్టంతో, ఎక్కువ శుభ్రమైన ధాన్యాన్ని రైతుకు అందిస్తుంది.

**పరికరం :**

మదన్‌లాల్ బజార్లో లభించే ఇతర నూర్పిడి యంత్రాలలో వుండే ఇబ్బందులన్నింటిని అధిగమిస్తూ, ఎక్కువ సామర్థ్యం కల అనేక రకాలైన పప్పుదినుసు పంటలు, ధాన్యాలే కాక, కొద్దిపాటి మార్పులతో వేరుశనగను కూడా నూర్పిడి చేసుకునే విధంగా దీన్ని రూపొందించాడు.

దీనిలో నూర్పిడి చేసుకున్న తర్వాత తిరిగి ఏ రకమైన శుభ్రపరిచే ప్రక్రియ చేపట్టకుండానే నేరుగా మార్కెట్‌కు తరలించవచ్చు. ఒక ధాన్యం నుండి మరో ధాన్యం నూర్పిడి చేసుకునేలా పరికరంలో మార్పు చేయాల్సిన సమయం కూడా పదిహేను నిమిషాలకు మించదు. ధాన్యపు గడ్డి లేదా చొప్పలను కూడా చిన్న చిన్న ముక్కలుగా చేసి ధాన్యంతో పాటు కాకుండా వేరే ద్వారం ద్వారా బయటకు పంపిస్తుందీ యంత్రం.

**సాంకేతిక వివరాలు :**

❀ ఈ యంత్రంలో మూడు ముఖ్యమైన భాగాలుంటాయి.
❀ ఒకటి ధాన్యపు గడ్డి, వగైరాలను చొప్పించేది, రెండవది వాటిని ముక్కలుగా చేసేది, మూడవది వృధాను, ధాన్యాన్ని వేరు చేసేవిగా భాగాలుంటాయి.
❀ ధాన్యాలు మార్పు చెందినపుడు వీటిలో మొదటి భాగంలో మాత్రమే ఆ ధాన్యానికి అనువైన గేరును మార్చాల్సి వుంటుంది.
❀ యంత్రం కొలతలు : పొడవు - 3.9 మీ., వెడల్పు - 1.9 మీ., ఎత్తు 2 మీటర్ల వరకుంటుంది.
❀ 5 సిలిండర్ల గేర్ బాక్స్ కలిగి వుంటుంది.
❀ మూడు డ్రమ్ముల్లో బ్లేడ్లతో కూడిన 3 చక్రాలు అమర్చబడి వుంటాయి.
❀ యంత్రం మొత్తం రెండు టైర్ల చట్రంపై అమర్చబడి వుంటుంది.
❀ ఈ యంత్రం సామర్థ్యం గంటకు - గోధుమలు : 18-25 క్వింటాళ్ళు, పప్పు ధాన్యాలు - 14-18 క్వి., బార్లీ : 25-30 క్వి., జొన్నలు - 18-22 క్వి., సోయాబీన్ - 15-20 క్వి., వేరుశనగ - 20-22 క్వి., మొక్కజొన్న - 8-10 క్వి. వరకు నూర్పిడి చేసుకోవచ్చు.



**ముఖ్యాంశాలు :**

- 35 హార్స్‌పవర్‌ల ట్రాక్టర్‌కు కూడా అనుసంధానం చేసుకోవచ్చు.
- అనేక పప్పు దినుసులే కాక, సజ్జలు, జొన్నలు, శనగలు, మెంతులు, బార్లీ, జీలకర్ర, మినుములు, ఆవాలు, సోయాబీన్, వేరుశనగ, పెసర, ఆలసంద మొదలైన ధాన్యాలను నూర్పిడి చేసుకోవచ్చు.
- వేరుశనగ నూర్పిడి చేయగల ఏకైక యంత్రం ఇది.
- ఒక ధాన్యం నుండి మరో ధాన్యం నూర్పిడికి మార్పు చేయటం చాలా తేలిక, తక్కువ సమయం.
- కత్తిరించడం, నూర్పిడి చేయటం వరుసగా జరిగే యంత్రం.
- ఒక్కో పంటను ఒక్కోరకంగా యంత్రానికి అందించవలసి వుంటుంది.
- పంటను బట్టి యంత్రం లోని బ్లోయర్ వేగాన్ని నియంత్రించుకోవచ్చు.
- నూర్పిడి సామర్థ్యం 99.6%, శుభ్రత సామర్థ్యం 99%, ధాన్యం నష్టం 0.25%, గింజలు పక్కలకు ఎగిరి పోవటం 0.36% లతో ఎంతో సమర్థవంతమైన యంత్రం.

**పురస్కారాలు :**

- ఎన్.ఐ.ఎఫ్. 2001 జాతీయ పురస్కారం పొందింది.

**కావాలనుకున్నవారు సంప్రదించండి :**

**పల్లెసృజన, ఫోన్ : 040–27111959,**

**సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)**

## ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 1,000/–లతో 5 సంవత్సరాల పాటు గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

మీ గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక మీ గ్రామానికి వచ్చే ఏర్పాటు చేస్తారు.

చందా వివరాలు ఈ పత్రిక చివరి కవర్ పేజీలో ఇవ్వటమైనది. వీలైనన్ని ఎక్కువ గ్రామాలకు పత్రిక వెళ్ళేందుకు సహకరించాల్సిందిగా కోరుతున్నాము.

– ఎడిటర్

# పల్లెసృజన

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

'పల్లెసృజన' ఒక స్వచ్ఛంద సంస్థ. దీని నిర్వాహకులు, వాలంటీర్లు అంతా స్వచ్ఛందంగా పనిచే స్తారు. గ్రామాల్లోవున్న సృజనాత్మకతను వెతికి, సమాజానికి తెలియపరచడం, సృజనాత్మకత గల వ్యక్తులను (ఇన్నోవేటర్స్‌ను) గౌరవించి వారిని ప్రపంచానికి పరిచయం చేయాలన్న ప్రధాన లక్ష్యంతో 2005లో 'పల్లెసృజన' స్థాపించబడింది. చదువుకోని గ్రామ ప్రజల్లో కూడా శాస్త్రవేత్తలు ఉన్నారని త్రికరణశుద్ధిగా నమ్ముతుంది 'పల్లెసృజన'. అలాంటి జ్ఞానవేత్తల జ్ఞానాన్ని గుర్తించి, గ్రంథీకరించి, ఆ జ్ఞానాన్ని సమాజానికి అందించటంతో పాటు ఆ జ్ఞానకర్తను సమాజం గుర్తించేలా చేయటం 'పల్లెసృజన' ప్రధాన కార్యక్రమం. జ్ఞానశోధనకై 'పల్లెసృజన' ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి 3 రోజుల పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాల గుండా కేవలం ప్రకృతిని ఆస్వాదిస్తూ, జ్ఞానాన్ని వెతుక్కుంటూ సాగుతుంది 'చిన్నశోధయాత్ర'.

అలాంటి 'చిన్న శోధయాత్రలు' ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వున్న 'పల్లెసృజన' అభిమానులు, వాలంటీర్ల సహకారంతో సేకరించిన 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'ను "పల్లెసృజన" పత్రిక ద్వారా వెలుగులోకి తీసుకు రావటంతో పాటు జాతీయ స్థాయిలో "నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్", "హనీబీ నెట్‌వర్క్" లాంటి సంస్థలతో మమేకమై సేకరించిన జ్ఞానాన్ని గ్రంథస్థం చేస్తుంది. అలా వారి జ్ఞానానికి గుర్తింపు తీసుకు వచ్చే ప్రయత్నంలో ప్రారంభం నుంచి నేటి వరకు ముగ్గురు గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్‌కు "పద్మశ్రీ" పురస్కారాలు, 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్" (ఎన్.ఐ.ఎఫ్.) ద్వారా 14 మంది గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్స్‌కు 'రాష్ట్రపతి పురస్కారం', నలుగురు ఇన్నోవేటర్లకు అంతర్జాతీయ పురస్కారాలతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు ఎందరో ఇన్నోవేటర్లకు అందించటం ద్వారా వారికి సమాజంలో సమున్నత స్థానాన్ని కల్పించగలిగింది.

ఇలా తయారైన ఇన్నోవేషన్లను "క్రియేటివ్ మైండ్స్" మరియు అను బంధ సంస్థల సహకారం తో వాటిని ప్రజలకు చేరవేసేలా చర్యలు చేపట్టింది "పల్లెసృజన".

దేశీయ జ్ఞానాన్ని వెలుగులోకి తీసుకువచ్చి, దేశీయ జ్ఞానంతోనే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుంది అని నిరూపించాలన్నదే "పల్లెసృజన" సంకల్పం.

**అమ్మకానికి సిద్ధంగా వున్న ఇన్నోవేషన్లు....**

| | | |
|---|---|---|
| ❀ సీడర్లు (6), ❀ వీడర్లు (14), ❀ రొటోవేటర్లు (4), ❀ స్ప్రేయర్లు (16), ❀ హార్వెస్టర్లు (6), ❀ నూర్పిడి పరికరాలు (9), ❀ చేతి పనిముట్లు (8), ❀ మాన్యువల్ వీడర్లు (5), ❀ వ్యవసాయ పనిముట్లు, | ❀ నీరు తోడే మినీ పంపులు (4), ❀ ట్రాక్టర్ లిఫ్టర్లు & లెవెలర్లు (3), ❀ మినీ ట్రాక్టర్లు (5), ❀ మినీ రైస్ మిల్లు (2), ❀ ఫుడ్ ప్రాసెసింగ్ యంత్రాలు (10), ❀ ఇటుకల తయారీ యంత్రాలు (2), ❀ గ్రామీణ రవాణా యంత్రాలు (8), ❀ కొబ్బరి మరియు ఇతర చెట్లు ఎక్కే పరికరాలు (3), | ❀ కరెంటు స్తంభాలను ఎక్కే పరికరాలు (3), ❀ వృద్ధులు, పేషెంట్ల కొరకు సకల సౌకర్యాల మంచము (3), ❀ ఎలక్ట్రిక్ & ఎలక్ట్రానిక్ పరికరాలు (12), ❀ ఇంటి అవసరాల కోసం హెర్బల్ ద్రావకాలు, ❀ ఆవు పేడతో వస్తువులు చేసే పరికరాలు (14). ❀ 48 డిగ్రీల ఎండలో కూడా పండే 'HRMN - 99' ఆపిల్ మొక్కలు ❀ మూలికా / సేంద్రియ పురుగు మందులు |

**పై ఇన్నోవేషన్లు కావలసిన వారు సంప్రదించ గలరు :**

**సుభాష్ చందర్,** సి.ఇ.ఓ., **"క్రియేటివ్ మైండ్స్"**

ఫ్లాట్ నెం. 77, రోడ్ నెం. 3, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ – 500 094.

ఫోన్ : 040–27111959, మొబైల్ : 9652801700.

# ఇతర రాష్ట్రాల పల్లె జ్ఞానం

'హనీబీ' ఆంగ్ల పత్రిక సౌజన్యంతో

Loksarvani
(Gujarati version of Honey Bee)
SRISTI, P O Box No. 15050
Ambawadi, Ahmedabad - 380015, Gujarat
loksarvani@sristi.org

21101

**పశువుల్లో నులిపురుగుల నివారణకు:**



పశువుల పోషణలో ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా వాటి ప్రేవుల్లో నులి పురుగులు ఏర్పడి అవి తిన్నది అరగక బాధ పడుతూ వుంటాయి. అశ్రద్ధ వహిస్తే పశువు క్రమంగా క్షీణించి మరణించే ప్రమాదముంది. పశువులలో నులి పురుగుల నివారణకు బజార్లో చాలా మందులు లభిన్నాయి. కానీ గుజరాత్ రాష్ట్రం, బరూచ్ జిల్లా, కంబూడి గ్రామానికి చెందిన 'పుల్జీభాయ్ ఉమార్ భాయ్ వాస్వా' మన పెరట్లో దొరికే చెట్లతోనే వీటికి ఉత్తమమైన చికిత్స అందించవచ్చు అంటున్నారు. ఈయన పద్ధతి ప్రకారం 100 గ్రా. వేపాకులు, 100 గ్రా. దానిమ్మ ఆకులను మెత్తగా నూరి, 400 మి.లీ. నీటిలో కలపాలి. ఒక గంట తర్వాత ఆ మిశ్రమాన్ని బాగా కలిపి రోజుకొకసారి చొప్పున రెండు మూడు రోజులు పశువుకు తాగిస్తే నులిపురుగుల నుండి నివారణ పొందవచ్చు అంటున్నాడు.

21102

**పంటలలో రసం పీల్చే పురుగుల నివారణకు:**

ఈ రసం పీల్చే పురుగు ఏ పంటకైనా, మొక్కకైనా సోకి చెట్టు ఆకులలోని రసాన్ని పీల్చేసి మొక్కలను నిర్వీర్యం చేసి అవి నశించిపోయేలా చేస్తాయి. వీటి నివారణకు గుజరాత్‌కు చెందిన 'పరుషోత్తమ్ భాయ్' చక్కటి, తేలికైన ఉపాయం చెపుతున్నాడు. ఈయన చాలాకాలంగా తన పొలంలో ఇదే పద్ధతిని వాడుతున్నాడట. ఈయన



వేపాకులు, మజ్జిగ తేటను ఉపయోగించి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. వేపాకులను నీటిలో వేసి ఆ నీరు మూడవ వంతుకు వచ్చే వరకు మరగబెట్టి, 200 మిలీ. కషాయాన్ని తీసుకుని, 1500 మి.లీ. మజ్జిగ తేటలో కలిపి పొలాలపై పిచికారి చేస్తే ఈ రసం పీల్చే పురుగు నుండి నివారణ పొందవచ్చు అని చెపుతున్నాడు.

21103

**వెల్లుల్లి పంటను చీడనుంచి కాపాడటానికి:**



గుజరాత్ రాష్ట్రానికి చెందిన 'పరుషోత్తమ్ భాయ్' ఈ ఉపాయం కూడా చెబుతున్నారు. భారత సుగంధ ద్రవ్యాల బోర్డు లెక్కల ప్రకారం 2002-2007 మధ్యలో గుజరాత్ రాష్ట్రంలో వెల్లుల్లి ఉత్పత్తి 480 శాతం పెరిగింది. ప్రత్యేకించి జునాగఢ్ జిల్లాలో అత్యంకంగా వెల్లుల్లి పండిస్తుంటారు. ఆ జిల్లాలోని రైతులు వెల్లుల్లి పంటను కాపాడటానికి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాన్నిచ్చే సేంద్రియ పద్ధతిని పాటిస్తున్నారు. దాన్ని పరుషోత్తమ్ భాయ్ మనకు తెలియజేస్తున్నారు. మజ్జిగ, గోమూత్రము, కుళ్ళిపోయిన సజ్జలపిండి ఈ మూడింటిని బాగా కలిపి వెల్లుల్లి పంటపై పిచికారి చేసి పంటను చీడల నుండి రక్షించుకోవచ్చు అని చెపుతున్నారు.

ఇంకొక రైతు 'రమేష్ భాయ్' మరో పద్ధతి వాడి తన వెల్లుల్లి పంటను చీడనుండి కాపాడుకుంటున్నాడు. ఆయన ఆముదము, నీరు, బట్టలుతికే సోడను కలిపి ఈ ద్రావకాన్ని తయారు చేసుకుంటాడు. ఒకటిన్నర లీటర్ల ఆముదము, 100 గ్రా. బట్టలుతికే సోడ, 20 లీటర్ల నీటిలో కలిపి పంటకు నీరు పెట్టిన తర్వాత రెండుమూడు సార్లు పంటపై పిచికారి చేస్తే మంచి ఫలితం వుంటుందని చెపుతున్నారు.

21104

**మిరప పంటను తెగుళ్ళనుండి కాపాడటానికి:**



గుజరాత్‌కు చెందిన 'పరశురామ్ భాయ్' ఈ చిట్కా కూడా చెపుతున్నారు. మిరప పంటను తెగుళ్ళ బారినుండి రక్షించుకోవటానికి ఆయన నిమ్మ, కలబంద, పొగాకులను కలిపి వాడుతుంటాడు. ఆయన 2 కిలోల పొగాకు పొడి, 2 కిలోల కలబంద, 250 గ్రా. నిమ్మరసం లను 20 లీటర్ల నీటి లో కలిపి మరిగిస్తాడు. 250 మిలీ ఈ ద్రావకంలో 15 లీటర్ల నీటిని కలిపి 8 రోజులకొకసారి మిర్చి పంటపై పిచికారి చేస్తా డు. ఈ పద్ధతి వలన మిరప పంట లో 80% తెగుళ్ళను నివారించ గలిగాడు.

National Innovation Foundation-India

# నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) - ఇండియా

స్వయంప్రతిపత్తి గల సంస్థ, శాస్త్ర సాంకేతిక శాఖ, భారత ప్రభుత్వము.

## జాతీయ 13 వ ద్వైవార్షిక పోటీలు

**పునాది స్థాయిలో సహాయం అందని సాంకేతిక ఆవిష్కరణలు (ఇన్నోవేషన్లు) మరియు సంప్రదాయ జ్ఞానముల గుర్తింపు**



**నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్** (ఎన్.ఐ.ఎఫ్.) తన 13వ జాతీయ ద్వైవార్షిక పోటీలకు గాను ఎవరి సహాయమూ లేకుండా రూపొందించిన పునాది స్థాయికి చెందిన సాంకేతిక ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞానం గురించిన దరఖాస్తులను కోరుతున్నది. ఈ ఇన్నోవేషన్లను రైతులు, కళాకారులు, చేతివృతుల వారు, జాలర్లు, మహిళలు వ్యక్తిగతంగా కాని, సామూహికంగా కాని పంపవచ్చు. మహిళలు, మురికి వాడల్లో నివసించే వారు, వర్క్‌షాప్ మెకానిక్‌లు, విద్యార్థులు, స్థానిక సమాజాలకి ప్రాధాన్యత ఇవ్వబడును. ఈ సృజనలు వ్యవసాయం (పనిముట్లు, యంత్రములు, కొత్త పద్ధతులు, కొత్త వంగడాలు మొదలైనవి), గృహోపకరణాలు, రవాణా, శక్తి (ఎనర్జీ), ఉత్పత్తి/ పరిరక్షణ, పని భారాన్ని తగ్గించటము, మూలికా వైద్యము (మానవులు మరియు జంతువులు) మొదలైన వాటికి సంబంధించినవై మరియు తక్కువ ఖర్చుతో కూడుకుని, ఎక్కువ కాలం మనగలిగి, పర్యావరణానికి హానికరం కానివై ఉండాలి. ఈ ఆలోచనలు లేదా నమూనాలు బయటివారి సహాయము/ పర్యవేక్షణ లేకుండా తాము స్వంతంగా తయారు చేసినవై, ఇతరుల నుండి ఎటువంటి సాంకేతిక సలహాలు తీసుకోకుండా రూపొందించినవై ఉండాలి. మహిళల కొరకు మహిళలచే, వికలాంగుల కొరకు వికలాంగులచే రూపొందించబడిన ఇన్నోవేషన్లు, ఉత్తమమైన సాంకేతిక జ్ఞానానికి ప్రత్యేకమైన బహుమతులు ఇవ్వబడుతాయి.

### ఆకాశాన్ని అందుకోవాలన్న ఆశ....

ఉత్తమమైన వాటిగా గుర్తించ బడిన వాటిలో జాతీయ మొదటి **బహుమతిగా రూ. 5,00,000, జాతీయ రెండవ బహుమతిగా రూ. 3,00,000, జాతీయ మూడవ బహుమతిగా రూ. 1,00,000లను వివిధ వర్గాలలో ఇవ్వబడును. జీవిత కాలపు సాఫల్యత పురస్కారం క్రింద రూ. 7,50,000లు గొప్ప ఇన్నోవేటర్‌కు లేదా ఇన్నోవేషన్లనే జీవితంగా ఏర్పరచుకొన్న వారికి ఇవ్వబడును.** అంతే కాదు ప్రోత్సాహక బహుమతి క్రింది రూ. **10,000**లను వివిధ **వర్గాలలో ఎన్నుకోబడిన ఇన్నోవేషన్లు, సమాజ శ్రేయస్సుకు, పర్యావరణానికి తోడ్పడ్డ వాటికి ఇవ్వబడును.**

ఇవే కాక పునాది స్థాయిలో సాంకేతిక విజ్ఞానాన్ని వెతికి వెలికి తీయటానికి దోహదపడిన వ్యక్తులు లేదా సంస్థలకు కూడా గుర్తింపు ఉంటుంది. అదేవిధంగా సాంకేతిక జ్ఞానం కలవారు, పునాది స్థాయిలో ఇన్నోవేషన్లను వెలికి తీయటానికి కృషి చేసిన ఎలక్ట్రానిక్/ ప్రింట్ మీడియా జర్నలిస్టులకి కూడా గుర్తింపు ఉంటుంది. ఈ దరఖాస్తులను **31 మార్చి, 2023** లోగా మాకు చేరేలా పంపండి.

### దరఖాస్తు దారులకు గమనిక

**వ్యక్తిగతంగా కానీ, సమూహంగా కానీ ఎన్ని ఐడియాలనైనా వ్రాసి పంపవచ్చు.**
**మీ ఐడియా/ ఇన్నోవేషన్/ సాంప్రదాయ జ్ఞానానికి సంబంధించిన సాంకేతిక వివరాలు, ఫొటోలు, వీడియోలు ఏవి వున్నా పంపాలి.**
**దరఖాస్తుదారుడు తన విద్యార్హతలు, మీ వృత్తి వివరాలను తెలియజేయాలి.**
**మీ గుర్తింపు కార్డు (ఆధార్/ ఓటర్ కార్డు/ ప్రభుత్వం నుండి పొందిన ఏదైనా) కాపీని తప్పనిసరిగా జత చేయాలి.**
**మీ పూర్తి పోస్టల్ చిరునామా తప్పనిసరిగా పంపాలి.**

**దరఖాస్తు చేయుటకు చివరి తేది 31 మార్చి, 2023**

**మీ ఆవిష్కరణలను పంపవలసిన చిరునామా :**

**National Innovation Foundation,**
**C/o Gram Bharati, Amrapur, Gandhi Nagar-Mahudi Road, Gandhi Nagar, Gujarat-382 721.**
**Phone: (02764) 350001/ 02/ 03/ 04/ 05/ 06 Email: campaign@nifindia.org, Website: www.nif.org.in**

**సూచన :** వృత్తిపరమైన అనుభవం కలవారు లేదా వృత్తి కళాశాలలో చదువుకొనే విద్యార్థులు ఎన్.ఐ.ఎఫ్. నుండి ఏవిధమైన ఆర్థిక సహాయానికి కాని, పురస్కారాలకు కానీ అర్హులు కారని గమనించవలెను. అయినప్పటికీ అటువంటి వారు గ్రామస్థాయి ఇన్నోవేషన్లకి మెరుగు దిద్దినట్లయితే ఎన్.ఐ.ఎఫ్. వారిని గుర్తిస్తుంది. అర్హత వివరాలు, ఇతర మార్గదర్శకాలకై https://nif.org.in/announcement/biennial_competition సంప్రదించండి. లేదా 'పల్లెసృజన' కార్యాలయాన్ని (ఫోన్ : **040–27111959**) సంప్రదించండి.




కాల, ప్రాంతాలకు అతీతంగా శాస్త్ర విజ్ఞాన జిజ్ఞాస మానవాళిని అంటిపెట్టుకునే వుంది. ప్రాచీన భారత దేశంలో విభిన్న రంగాలలో విశేష కృషి చేసిన మహనీయులు విజ్ఞానాన్ని బహు ముఖాలుగా విస్తరించే ప్రయత్నం చేసిన ఆలోచనాపరులు కోకొల్లలు. ఆర్యభట్టు, వరాహమిహిరుడు, చరకుడు, సుశ్రుతుడు, భాస్కరుడు మొదలైన వారు ఖగోళము, గణితము, వైద్యము లాంటి శాస్త్రాలలో తమ పరిశోధనల ద్వారా కొన్ని మైలురాళ్ళను సృష్టించారు. ఆ కోవలోకి చెందిన వారే 'సురపాలుడు'.

వృక్ష శాస్త్రంలో నిగూఢమైన విషయాలను ఎన్నింటినో పరిశోధించి, అపురూపమైన వృక్ష వైద్య రహస్యాలను గ్రంథస్తం చేసినవాడు సురపాలుడు. మొక్కల లక్షణాలు కూడా మానవుల శరీరాన్ని పోలి వుంటుందన్న శాస్త్ర పరిజ్ఞానాన్ని ఆవిష్కరించినవాడు సురపాలుడు. వృక్ష శాస్త్రంలో విశేషమైన కృషి చేసిన ఈ మహనీయుడి గురించిన సమాచారం ఇటీవలి వరకు మన దృష్టికి రానేలేదు. ఆయన రచించిన "వృక్షాయుర్వేదం" అన్న గ్రంథం ఇంగ్లాండులోని ఒక గ్రంథాలయంలో ఇటీవలే బయట పడింది. ఆ పుస్తక ఆంగ్లానువాదం 'ఏసియన్ అగ్రో హిస్టరీ ఫౌండేషన్ (ఎఎహెచ్ఎఫ్), హైదరాబాద్ వారు **1996**లో ప్రచురించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వృక్ష శాస్త్రం పట్ల ఆసక్తిగల ప్రతి ఒక్కరికీ ముఖ్యంగా పరిశోధకులకు, విద్యార్థులకు, రైతులకు అందుబాటులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో 'ఐ-సర్వ్', హైదరాబాద్ వారు **2015** లో తెలుగు అనువాద ప్రక్రియకు ఉపక్రమించడం జరిగింది.

ఈ గ్రంథాన్ని 'పల్లెసృజన' పాఠకులకు అందించాలన్న సంకల్పంతో మే-జూన్, **2021** సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం. ఈ గ్రంథంలోని మహత్తరమైన జ్ఞానాన్ని పాఠకులు అవగాహన చేసుకుని, ఆచరిస్తారని ఆశిస్తున్నాం. - ఎడిటర్.

**(గత సంచిక తరువాయి)**

176. గొడ్డలితో కొట్టినపుడు, చెట్లకు గాయాలవుతాయి. దానివల్ల అన్ని రకాల చెట్లు ఎండిపోయే ప్రమాదం ఉంది.

177. "కఫము"లో సమతుల్యత లోపించడము వల్ల, గాయాలు లేనప్పటికి చెట్లు స్రవిస్తాయి. వ్యాధులకు తప్పుడు వైద్యం చెయ్యడం వల్ల 'వాతా'నికి సంబంధించిన వ్యాధులు వస్తాయి.

178. "వాతా"నికి సంబంధించిన వ్యాధుల వలన రోజు రోజుకు ఆకులు, పూలు, పండ్లు రాలిపోతాయి. అవసరానికంటే ఎక్కువ నీళ్ళు పట్టడం, ఎక్కువ వేడి, సరిపోని నేల, సరిపడని ఋతువు - వీటి వలన కూడా అవి రాలిపోయే ప్రమాదం ఉంది.

179. వృక్షాలలో వాత, పిత్త, కఫముల సమతుల్యత లోపించడం వల్ల పసిరికల వ్యాధి సంభవించవచ్చు. అది సోకిన చెట్లలో కాండము, ఫలాలు, ఆకులు, పచ్చగా మారిపోతాయి.

180. నాసిరకం విత్తనాలు, వైద్యం లేకపోవడం, తప్పుడు వైద్యం జరగడం వల్ల వాత, పిత్త, కఫములలో సమతుల్యత లోపం జరగవచ్చు. దీనివల్ల వృక్షాలు ఉత్పత్తి చేసే శక్తిని కోల్పోతాయి.

181. చీమలు దూరడం వలన, నీళ్ళు ఎక్కువ అవడం వలన వచ్చిన అజీర్తి వలన చెట్లనుండి దుర్వాసన వస్తుంది. సహజ పరిమళం నశిస్తుంది. ఆకులు మొగ్గలు పొట్టిగా అంపోతాయి.

182. నిప్పు, గాలి, ఇతర చెట్లతో రాపిడి, ఎప్పుడూ నీడలో ఉండడం, ఎక్కువ సంఖ్యలో పక్షులు గూళ్ళు కట్టుకోవడం, తీగలు ఎక్కువగా పాకడం, కలుపు మొక్కలు దగ్గరలో ఎక్కువగా పెరగడం, తీగలు ఎక్కువగా పాకడం, కలుపు మొక్కలు దగ్గరలో ఎక్కువగా పెరగడం - వీటన్నిటి వలన వక్షాలకు తీరని హాని కలుగుతుంది.

183. పైన పేర్కొన్న విధంగా వ్యాధి సూచనలను గమనించి, వివిధ రోగాలను నిర్ధారించి వృక్షాలకు మంచి జ్ఞానవంతునిచే చికిత్స చేయించ వలెను.

184. (ఈ శ్లోకము అగుపించుట లేదు)

**చికిత్స:**

185, 186......

187. చేదుగా, ఘాటుగా, ఒగరుగా వున్న పంచమూల (శ్రీఫలము, సర్వతో భద్రము, పాటులము, గనికరికము, స్యోనకము అనే అయిదు రకాల మొక్కల వేర్లతో తయారయినది) కషాయంను పన్నీరులాగా సువాసన కలిగిన నీటితో కలిపి చికిత్స చేస్తే "కఫం" వల్ల వచ్చిన వ్యాధులను సులభంగా అధిగమించ వచ్చును.

188. నీళ్ళలో తెల్ల ఆవాల పిండి కలిపి పిసికి వేళ్ళకు అంటించి, నువ్వులు, బూడిద కలిపిన మిశ్రమాన్ని నీళ్ళలో కలిపి ఆ నీళ్ళను చెట్లకు పడితే "కఫం" వల్ల వచ్చిన వ్యాధులను అరికట్టవచ్చు.

189. వృక్షాలకు "కఫం" వలన వచ్చిన వ్యాధిని నయం చెయ్యాలంటే, వేర్ల చుట్టూ వున్న భూమిని తవ్వి, మట్టిని తీసివేసి, పొడిగా వున్న కొత్త మట్టిని వేసి చికిత్స చేయాలి.

190. "పిత్త" ప్రకోపం వల్ల సంక్రమించిన వ్యాధులు సోకిన అన్ని రకములయిన వృక్షాలను తెలివైన వాడు చల్లగా, తియ్యగా ఉండే పదార్థాలతో చికిత్స చేస్తాడు.

191. పాలు, తేనె, "యష్టిమధు" మరియు "మధుకము"లతో తయారయిన కషాయం కలిపిన నీళ్ళను పోస్తే 'పిత్త' సంబంధమైన వ్యాధులు సోకిన చెట్లు త్వరగా కోలుకుంటాయి.

192. పండ్లు, "త్రిఫలములు", నెయ్యి, తేనెల కషాయాలతో కలిసిన నీళ్ళు పడితే వృక్షాలలో "పిత్త" సంబంధమైన వ్యాధులు తొగి పోతాయి.

193. వేళ్ళనుండి, కొమ్మల నుండి పురుగులను తొలగించాలంటే తెలివి మంతుడు ఆ వృక్షాలకు వారం రోజుల పాటు చల్లని నీళ్ళు పడతాడు.

194. పాలు, "కుణప" ద్రావకం, ఆవుపేడలను పిసికి దానికి నీళ్ళు కలిపి చికిత్స చేస్తే అది పురుగులు పోవడానికి మంచి మందులాగా పని చేస్తుంది. అలాగే తెల్లటి ఆవాలు, "వచ", "కుస్త", "అతివిష"లను మిశ్రమంగా తయారు చేస వేళ్ళకు పట్టించాలి.

195, 196....

197. కీటకాలచే తినబడుతూవున్న తీగలపై గానుగ పిండి కలిపి నీళ్ళను చిలుకరించాలి. ఆకులపై చేరిన క్రిములకయితే ఇటుకలను పొడి చేసి ఆ పొడికి బూడిదను కలిపి వాటిపై చిలుకరిస్తే క్రిములు నశిస్తాయి.

198. "విడంగాలు", నువ్వులు, ఆవు మూత్రం, నెయ్యి, ఆవాలు కలిపి తయారు చేసిన మిశ్రమాన్ని మర్దన చేసి, ఆ తర్వాత పాలను చిలకరిస్తే క్రిమి కీటకాదుల వల్ల అయిన గాయం త్వరలోనే నయమవుతుంది.

199. గడ్డ కట్టుకుపోయే చలి, మలమల మాడే ఎండలో చెట్లు ఇబ్బంది పడకుండా వాటిని బాగా కప్పి వుంచాలి. "కుణప" ద్రావకం, పాలు చిలకరించడం కూడా మంచిదే.

200–201 చెట్లు విరిగిపోతే, వాటిని బాగు చెయ్యడానికి ఒక చికిత్సా పద్ధతి ఉంది. నెయ్యి, తేనె, ద్రాక్ష సారాయి, పాలు కలిపి మిశ్రమం తయారు చేసి "పక్ష"ము (జువ్వి) మరియు "మేడి" చెట్లనుండి తీసిన బెరడు కలిపి విరిగిపోయిన చెట్లకు బాగా పూయాలి. గడ్డిపోచలతో తయారు చేసిన తాడుతో చెట్టులో విరిగిన భాగాలు గట్టిగా కట్టివేయాలి. చెట్టు పాదులో కొంత మట్టి నింపి, ఆ వెంటనే గేదెపాలు చిలుకరించి, నీరు పారించాలి. అలా చేస్తే విరిగిపోయిన చెట్లు తొందర్లోనే అతుక్కుంటాయి.

202. (ఈ శ్లోకం అగుపించట్లేదు)

203. చెట్ల కొమ్మలు రాలిపోతే, రాలిపోయినచోట తేనె, నెయ్యి కలిపి ఆ మిశ్రమంతో మర్దన చేసి పాలను, నీళ్ళను చిలుకరించాలి. అలా చేస్తే కొమ్మలు మళ్ళీ మొలకెత్తి, ఆకాశాన్నంటే విధంగా పెరుగుతాయి.

204. చెట్ల కొమ్మలు కాలిపోతే, ఆ కొమ్మలను నరికివేసి, కాలినచోట పాలు, నీళ్ళు చిలుకరించాలి. ఆ తర్వాత యండ్రకాయ చిప్పతో పొగ బెట్టాలి. ఆవిధంగా చికిత్స చేస్తే ఆ చెట్టు మళ్ళీ తొందరలోనే చిగురిస్తుంది.

205. చెట్లు మంటల్లో దగ్ధమైతే, తామర తీగతో పాటు ఉండే బురదతో




చెట్టు మొత్తాన్ని అలకాలి. ఆ తర్వాత "కుణప" మిశ్రమంతో నీళ్ళు పట్టాలి. అప్పుడు ఆ చెట్టు కొమ్మలు అంబరాన్నంటే విధంగా పెరుగుతాయి.

206. "విదారి" (తెల్లనేల గుమ్మడి) పంచదార, నాగజిహ్వ (ఎర్ర పాషాణం (రెడ్ ఆర్సెనిక్)) మరియు నువ్వులు – వీటన్నిటిని కలిపి మర్దన చేసి పాలు కలిపి నీళ్ళను చిలుకరిస్తే, పిడుగు పాటుకు గురి అయిన వృక్షాలు మళ్ళీ చిగురిస్తాయి.

207. మంటల వల్ల ఎండిపోయి, శుష్కించి పోయిన చెట్లు తిరిగి జీవం పోసుకోవాలంటే తామర మొక్క కింద ఉండే బురదతో ఆ చెట్టు మొత్తం అలకాలి. ఆ తర్వాత పంచదార, నువ్వులు, పాలు కలిపి మిశ్రమం తయారు చేసి, దానిని నీళ్ళు పట్టడానికి, మర్దన చెయ్యడానికి ఉపయోగించాలి.

208. మంచి నేల కాకపోవడం వల్ల, చెట్టు ఎండిపోతే, ఆ మట్టిని తీసివేసి, పోషక విలువలు కలిగిన ఆరోగ్యవంతమైన మట్టితో నింపి, పాలు కలిపిన నీళ్ళను చిలకరించాలి.

209. నీళ్ళు లేకపోవడం వల్ల చెట్టు ఎండిపోతే, పాలు కలిపిన నీళ్ళు పెట్టి, యండ్రకాయ చిప్పతో పొగబెట్టి సరిగా కాపడం పెట్టాలి.

210. ఆవుపేడ, తేనె, నెయ్యి, "మర్రి", "మేడి" చెట్ల బెరడుతో లేహ్యం తయారు చేసి ఆ లేహ్యంతో చికిత్స చేసినచో చెట్లకు తగిలిన గాయాలు నయమౌతాయి.

211. పైన పేర్కొన్న లేహ్యంతో చికిత్స చేసి, "ధవ", "శ్రీపర్ణిక", "శ్యామ", "వేతన", "అర్జునము"ల నుండి తీసిన బెరడును కారేచోట కప్పి ఉంచితే, చెట్టునుండి ద్రవం స్రవించడం ఆగిపోతుంది.

212. తప్పుడు వైద్యం చెయ్యడం వల్ల సంభవించిన రోగాలు తగ్గిపోవాలి అంటే నీళ్ళలో కలిపిన పాలు చిలుకరించాలి. అలాగే చిక్కటి బురద కలిపిన "విడంగ" తైలాన్ని లేపనంగా పూయాలి.

213. పాలు, తేనె, బార్లీపొడి, (యవల) గోధుమలు కలిపిన మిశ్రమాన్ని నీటిలో కలిపి ఆ నీళ్ళను చిలుకరించిన కావెర్ల రోగం కొన్ని వారాలలో పూర్తిగా తగ్గిపోతుంది.

214. "కుణప" నీళ్ళు, పాలు చెట్లకు పోస్తే అనుత్పాదక చెట్లు సంతృప్తి కరంగా పూలు, పండ్లు కాస్తాయి.

**గమనిక: పైన కొన్ని సంఖ్యలలో ఖాళీగా ఉంచబడినవి. దానికి కారణం. అక్కడ వివరించిన విధానాలు ఎన్నో రకాల అడవి జంతువుల మాంసం, మరియు ఇతర శరీర భాగాలతో చేయవలసిన పనులు. ఇవి రైతులకు సాధ్యం కాదు, పైగా 'మృగ హింస' చట్టానికి గురయ్యే ప్రమాదం ఉంది. కాబట్టి వాటిని వివరించటం లేదు.**

**(తరువాయి భాగం వచ్చే సంచికలో)**

# 10వ జాతీయ ద్వైవార్షిక పోటీ విజేతలు




ఎన్.ఐ.ఎఫ్. వారు 2019లో నిర్వహించిన 10వ జాతీయ స్థాయి ఇన్నోవేషన్ మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలలో జాతీయ బహుమతి పొందిన విజేతల వివరాలు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి వ్యాసాలకు స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

## ఆకుపచ్చ బియ్యం - కుబ్రి మమ్‌హనీ & కమల్

**పేరు : రోహిత్ సాహు**

**నివాసి : దుర్గ్ జిల్లా, ఛత్తీస్‌ఘడ్**



49 సంవత్సరాల రోహిత్ సాహు ఛత్తీఘడ్ జిల్లాలో ఆకుపచ్చ రంగు బియ్యం, సాంప్రదాయ పద్ధతి లో పండించటంలో ప్రయోగాలు చెయ్యటంలో ప్రసిద్ధి పొందిన రైతు. అతనికి సేంద్రియ పద్ధతిలో సాంప్రదాయ ధాన్యాన్ని పండించటంలో మంచి నేర్పు / పేరు ఉన్నాయి. ఆయన ఇప్పటికే ఎన్నో రకాల కనుమరుగై పోతున్న వరి రకాలని పునరుద్ధరించి, సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తుంటాడు. ఈయన పచ్చ వరి రకమైన 3అబ్రి మన్‌హనీ నుండి ఎంపిక పద్ధతిపై కుబ్రి మమ్‌హనీ సెలెక్షన్ రకాన్ని, రామ్‌తిల్ రకం నుంచి కమల్ రకాలను ఆకుపచ్చ వరి రకాలని రూపొందించాడు.

2012వ సంవత్సరంలో తాను సాధారణంగా పండించే కుబ్రి మమ్‌హనీ మరియు రామ్‌తిల్ రకాల వరిలో నల్లని పెద్ద వడ్లు ఉండటం గమనించి, ఆకుపచ్చ రకం వరి ఉండటం గమనించాడు. సాధారణంగా ఆకుపచ్చ రంగు వరిలో ఉండే సువాసన, రుచి మారిపోకుండా, ఆ రంగు ఇంకా అభివృద్ధి చేస్తూ ఎంపిక పద్ధతిలో 4-5 సంవత్సరాలు ప్రయోగాలు చేశాడు. ఈ రె,డు రకాల లక్షణాలను 2016లో సేకరించి, 2017 నుంచి భారీ స్థాయిలో ఉత్పత్తి చెయ్యటం ప్రారంభించాడు. ఈ ఆకుపచ్చ రంగు ఉండే వరికి ఆ లక్షణం చాలా సున్నితమైనది. ఇది పూర్తిగా పంట పని పద్ధతి, నారుకట్టే పద్ధతి వాతావరణ పరిస్థితులు, నూర్పిడి పట్టడం, పాలిష్ చెయ్యటంలపై ఆధారపడి ఉంటుంది. ఇది చాలా జాగ్రత్తగా చెయ్యాల్సిన వ్యవసాయం.

రామ్‌పురా లోని ఇందిరాగాంధీ కృషి విశ్వ విద్యాలయంలో ఈ రకాలని ఎన్ఐఎఫ్ వారి సహకారంతో పరీక్షలు జరిపించటం జరిగింది. ఈ పరీక్షలలో రెండు రకాలు సాధారణ రకాలకన్నా మేలైన ఫలితాలు చూపించాయి. దిగుబడి కూడా ఎక్కువగానే వచ్చింది. కర్నాటకలోని ఉత్తర కన్నడ ప్రాంతం మరియు మాస్టరంలోని ఉత్తర ఇంపాల్ లో జరిగిన క్షేత్రస్థాయి పరిశోధనలు ఉత్తమ రకాలుగా కితాబు పొందాయి. ప్రస్తుతం దుర్గ్ జిల్లాలో 50 ఎకరాలలో ఈ రెండు రకాల విత్తనాలకీ, సాధారణ వాడకానికిగాను పెంచటం జరుగుతోంది.

మేలైన ఆకుపచ్చ బియ్యాన్ని అభివృద్ధి చేసినందుకుగాను రోహిత్ సాహుకు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.



## జాతీయ ప్రోత్సాహక పురస్కారం

### బత్తాయి & మామిడి సాంప్రదాయ రకాల పరిరక్షణ

**పేరు : సయ్యద్ ఘనీఖాన్**

**నివాసి : మాండ్య జిల్లా, కర్నాటక.**



స్వతహాగా వ్యవసాయం పైన అభిరుచి లేకుండ మైసూరు వెళ్ళి కామర్స్ చదివి, అక్కడే ఉద్యోగం చెయ్యాలనుకున్న మాండ్య జిల్లా, కర్నాటకకు చెందిన 38 సంవత్సరాల సయ్యద్ ఘనీ ఖాన్‌కి కుటుంబ ఆర్థిక పరిస్థితులు కలిసిరాక తప్పనిసరిగా కుటుంబ వృత్తి వ్యవసాయాన్ని చేపట్టవలసి వచ్చింది. ఈవిధంగా మొదలైన అతని వ్యవసాయ వృత్తి కారణంగా యిప్పుడు అతను దక్షిణ భారతదేశంలోనే సాంప్రదాయ మామిడి రకాలను పరిరక్షించే రైతుగా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. ఇతను తన తోటకి 'బడాబాగ్' అనే పేరు పెట్టి, అక్కడ 900 రకాలకు పైగా వరి రకాలు, 116 రకాల అంతరించి పోతున్న మామిడి రకాలను పెంచుతున్నాడు. ఈ మామిడి రకాలలో సంత్ర, బత్తాయి, జీలకర్ర రుచులు జోడించిన వాటితో పాటు, చేప ఆకారంలో పళ్ళు కూడా పండిస్తున్నాడు. ఈయన సేకరించిన వాటిలో 1200 వివిధ రకాల సాంప్రదాయ మరియు అభివృద్ధి చేసిన పంటల రకాలు ఉన్నాయి.

ఈయన రూపొందించిన మోసంబీ మామిడి రకం బత్తాయి వాసన కలిసిన మామిడి పండు కొద్దిగా పుల్లగా, మంచి కండ కలిగి, పండిన తరువాత ఆకుపచ్చ, పసుపు పచ్చ రంగుతో వున్న తోలు కలిగి, మంచి రుచి, వాసన, ఎక్కువ కాలం నిలువ ఉండే రకాలలో ఒకటిగా పేరొందింది. ఇంకా సెస్, మామిడి, ఆపిల్ పండులా అదే రంగులో గుండ్రంగా, ఆపిల్ కలిపిన రుచితో ఎక్కువ కాలం నిలువ ఉండే మామిడి రకాలు కూడా ఆకర్షణీయంగా ఉన్నాయి.

బెంగుళూరు లోని ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసర్చ్ మరియు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసర్చ్ వారు ఎన్ఐఎఫ్ వారి సౌజన్యంతో మామిడిపై పరిశోధనలు జరిపి ఇవి విభిన్న లక్షణాలు కల పళ్ళని నిర్ధారించి, రుచి, రంగులు కూడ కలిగి, వీటితోపాటు రకం, బరువు కూడా విభిన్నంగా ఉన్నాయనీ వీటి కారణంగా మంచి మార్కెట్‌కి అవకాశాలున్నాయనీ ధృవీకరించారు. ముఖ్యంగా మామిడికాయ బత్తాయి, ఆడిలు, జీలకర్ర వాసనలో, రుచిలో కలిగి ఉండటం మార్కెటింగ్‌కు చాలా మంచి అంశాలని నిర్ధారించి కితాబునిచ్చింది.



ఈయన జరిపిన ఉత్తమ ప్రయోగాలకు గాను 2012లో పిపివిఎఫ్అర్ (పంట రకాలకి పేటెంటు ఉండదు కనుక రిజిష్టర్ చేసే ప్రభుత్వ సంస్థ) వారు కనుమరుగై పోతున్న పంటల రకాలను రక్షించే రైతు బహుమానాన్ని ఇచ్చి సత్కరించారు. కర్నాటక ప్రభుత్వం 2010లో 'కృషి పండిట్' పురస్కారంతో సత్కరించారు. కర్నాటక ప్రభుత్వం ఈయన వద్దనుంచి అనేక రకాల మామిడి, మొదలైన మొక్కల అంట్లు తీసుకొని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో హార్టికకల్చర్ శాఖ ద్వారా పండించటంలో ప్రోత్సహిస్తోంది.

మామిడి సాంప్రదాయ రకాలను పరిరక్షించినందుకు గాను సయ్యద్ ఘనీఖాన్ కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.

## జాతీయ ప్రశంసా పురస్కారం

### పెండలాన్ని భూమిలోంచి తవ్వితీసే పరికరం

**పేరు : యస్. వనచింతనన్**

**నివాసి : ఈరోడ్, తమిళనాడు**



స్థానిక, తెలిసిన వాళ్ళ అవసరాలను తీర్చటానికి చిన్న చిన్న యంత్ర పరికరాలను చెయ్యటం 9వ తరగతి వరకు చదివిన 14 సంవత్సరాల వనచింతనన్ పెద్దయ్యాక డాక్టరై, సివిల్ రాసి దేశ చెయ్యాలనుకొంటున్నాడితను. పెండలం భూమిలోపల చాలా లోతుగా ఉంటుంది. దీనిని తవ్వి బైటకి తియ్యటానికి 100 చదరపు అడుగుల లోతు తవ్వటానికి రోజుకు ఇద్దరు మనషులు అవసరం అవుతారు. ఈయనను ఖర్చు తగ్గించటానికి వనచింతనన్ ఈ పెండలాన్ని భూమినుంచి సులభంగా తవ్వి తియ్యటానికి ఒక పరికరం కనుగొన్నాడు.

ఈ పరికరంకు రెండు లీవర్‌లు ఉంటాయి. ఒకటి చెట్టుని గట్టిగా పట్టుకొని ఉండటానికి, రెండోది తవ్విన పెండలాన్ని భూమి బైటకు తియ్యటానికి. ఈ రెండు లివర్‌లని ఒకేసారి వాడాల్సి ఉంటుంది. ఒకేసారి పట్టుకొవటానికి వెలుపలకి తీయటం లాంటి ప్రక్రియలు జరగటంతో పని సులభమై పెండలం సులభంగా బైటకి వచ్చేస్తుంది.

ఇదివరకి ఇద్దరు చేసే పనిని ఈ పరికరం వాడటం ద్వారా ఒక్కరే చెయ్యగలుగుతున్నారు. అదనపు కూలీల ఖర్చులు సగం ఆదా చేసుకోవచ్చు. సమయం కూడా ఆదా అవుతుంది. ఈ పరికరం వాడటం వలన శ్రమ చాలా వరకు తగ్గిపోతుంది.

శ్రమ, ఖర్చును తగ్గించే ఈ పరికరాన్ని కనుగొన్నందుకు గాను వనచింతనన్ కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్‌రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.



## జాతీయ ప్రశంసా పురస్కారం

### దివ్యాంగులకి మార్పు చేయబడిన వాహనం

**పేరు : జిగ్నేష్ యస్. షా**

**నివాసి : అహమ్మదాబాద్, గుజరాత్**



అహమ్మదాబాద్‌కు చెందిన 41 సంవత్సరాల జిగ్నేష్ షా స్వయంగా దివ్యాంగుడు. నడుం నుంచి క్రింది భాగం పని చెయ్యదు కానీ వీడియో ఎడిటర్ గా పని చేస్తుంటాడు. ఒకసారి ఇంటర్‌నెట్‌లో ఒక వీడియోలో ఒక వికలాంగుడు తన చక్రాల బండికి మోటారు అమర్చి నడవటం చూశాడు.

జిగ్నేష్ తానే స్వయంగా ఒక దిచక్ర వాహనాన్ని రూపొందించాడని ప్రత్యేకత ఏమిటంటే దానికి చక్రామం మండిని తగ్గించవచ్చు. అతను తాను స్థాపించిన ఫ్రీడమ్ విల్ ఎంటర్‌ప్రైజెస్ అనే సంస్థలో 10 రకాల వీల్ ఛైర్లను రూపొందించాడు. అన్నీ కూడా కనీసం కూర్చోవటానికి కూడా వీలుకాని వ్యక్తుల కోసం. తరవాత ఈ వీల్ ఛైర్స్‌ని అమర్చుకోవడం కోసం రెండు రకాల ద్విచక్ర వాహనాలను రూపొందించాడు. ఒకటి ఇంజనుతో (పెట్రోల్, డీజిల్), రెండోది కరెంటుతో (బ్యాటరీలు) తో నడిచేది. ఇంతకు ముందు కొంతకాలం తాను రూపొందించుకున్న గేర్లు కల వీల్‌ఛైర్‌లో తిరిగేవాడు కానీ దానిని ఎక్కటం, దిగటం కష్టంగా ఉండేది. వీల్‌ఛైర్, ద్విచక్ర వాహనాలని విడివిడిగా రూపొందించాడు. ఇప్పుడ తన బ్యాటరీతో నడిచే వీల్‌ఛైర్ ద్విచక్ర వాహనానికి అనుసంధానం చేసుకొనేలా ఏర్పాటు చేసుకొన్నాడు. ఇది ఎవరైనా చేతితో నడిచే లేదా బ్యాటరీతో నడిచే వీల్‌ఛైర్‌తో కలుపుకోవచ్చు.

స్కూటర్ వెనక భాగాన్ని కుడివైపుకి మార్చి, దాని స్థానంలో వాహనం ముందు భాగంలో ఒక బండ లాంటి దాన్ని అమర్చాడు. దీనితో దివ్యాంగులు తమ వీల్‌ఛైర్‌తో అనుసంధానం చేసుకోవచ్చు. దీనికి బిగించుకోవటానికి బోల్ట్‌లు, వీల్ డాకింగ్ పద్ధతి వాడవచ్చు. ఏమాత్రం ప్రమాదాలకు అవకాశం లేకుండా నడపటానికి దీనిని అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి. ఈ వాహనాన్ని గంటకి 60 కి.మీ. వేగంతో నడపవచ్చు. ఈ మార్పులు చేయటానికి సుమారు 45 వేల రూపాయలు ఖర్చయింది.

ఈ దివ్యాంగుల ద్విచక్ర వాహనాన్ని తయారు చేసినందుకు జిగ్నేష్ యస్. షా కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్ రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.



## జాతీయ ప్రశంసా పురస్కారం

### పశువులలో కడుపు ఉబ్బరం వ్యాధికి మూలికా వైద్యం

**పేరు : గదేటి విశ్రాం భాయ్ సోమా భాయ్**

**నివాసి : ఆరవల్లి, గుజరాత్**



73 సంవత్సరాల విశ్రాం భాయ్ సోమా భాయ్ వ్యవసాయ కూలీ గా పని చేస్తుంటాడు. ఈయన వనమూలికలతో తనకున్న ప్రావీణ్యంతో పశువులకు వైద్యం చేస్తూ ఉంటాడు. తరచూ దగ్గరలోని అడవుల నుంచి అరుదైన మూలికలు సేకరిస్తుంటాడు.

కడుపు ఉబ్బటం వ్యాధి పశువులకు అప్పుడప్పుడూ వస్తూ ఉంటుంది. అది వచ్చిన పశువు పొట్ట ఉబ్బిపోయి, కాళ్ళు బిగుసుకుపోయి, ఊపిరి ఆడక చాలా బాధ పడుతుంది. సరైన సమయంలో సరైన మందు ఇవ్వకపోతే పశువు చనిపోయే ప్రమాదం కూడా ఉంది. విశ్రాం భాయ్ తయారు చేసిన మూలికా మందు 15 గ్రా. రోజుకొక్కసారి రెండు రోజులు పశువుచేత తినిపిస్తే చాలా మంచి ఫలితం ఉంటుదని చెపుతాడాయన. ప్రకృతి సిద్ధంగా లభించే మూలికలతో తయారు చేసిన ఈ మందు పశువులకి నియంత్రణ చెయ్యడానికి చాలా బాగా పని చేస్తుందని చెపుతున్నాడీయన. ఈ మందు వేసిన ఒక గంటలోనే గొర్రెలు, మేకలు, పశువులు ఉపశమనం పొందటం పశువు మళ్ళీ ఆరోగ్యంగా తిరిటం జరుగుతుంది.

పశువుల బాధలను తీర్చటానికి మూలికా మందు తయారు చేసినందుకు విశ్రాం భాయ్ సోమా భాయ్ కు ఎన్.ఐ.ఎఫ్. వారు తమ 10వ జాతీయ స్థాయి గ్రాస్ రూట్ ఇన్నోవేషన్లు మరియు సాంప్రదాయ జ్ఞాన పోటీలు 2019 లో జాతీయ స్థాయిలో ప్రోత్సాహక పురస్కారంతో సత్కరించారు.


**పల్లెసృజన లో ప్రతి శనివారం "రైతు సదస్సు"**

**రైతులకు, ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ (ఎఫ్.పి.ఓ.) సభ్యులకు**

**ఆహ్వానము**

యాంత్రిక పరిష్కారాలు, విత్తనాలు, మొక్కలు, పశు మరియు మానవ ఆరోగ్యానికి చెందిన సూచనలు, ఆయుర్వేద పురుగు మందులు లాంటి రైతులు ఆవిష్కరించిన జ్ఞానము..... ఇవన్నీ ప్రదర్శించబడతాయి. మీ సమస్యలను చర్చించి వాటికి పరిష్కారాలు సాధించటానికి ప్రయత్నాలు జరుగుతాయి.

సదస్సు నిర్వహించే స్థలము :

'పల్లెసృజన' కార్యాలయము, ప్లాట్ నెం. 77, రోడ్ నెం. 3,

వాయుపురి, సైనిక్‌పురి, సికింద్రాబాద్.

సమయం : ఉ. గం. 10-30 నుండి మ. 1-30 గం.ల వరకు.

వివరాలకు సంప్రదించండి : సుభాష్ చందర్, ఫోన్ : 9652801700

Honey Bee Network

gian

# Submit your Ideas, Innovations, Prototypes

## హనీబీ నెట్‌వర్క్
## క్రియేటివిటీ & ఇన్‌క్లూసివ్ ఇన్నోవేషన్ అవార్డులు
## HBN CRIIA

మీవద్ద మనుషులు, పశువులు, పర్యావరణం ఎదుర్కొనే దైనందిక సమస్యలను పరిష్కరించే సృజనాత్మక, సాంప్రదాయ పద్ధతులు లేదా ఆలోచనలు ఉన్నాయా?

**మీ ఆలోచనలను, ఇన్నోవేషన్‌లను, నమూనాలను పంపండి**

ఎవ్వరైనా దరఖాస్తు చేసుకోవచ్చు !

మీ దరఖాస్తులను ఈ చిరునామాకు పంపండి...
Email : gian@gian.org or post them to
GIAN, Bungalow No. 1,
Sattellite Complex, Nr. Mansi Crossroads,
Satellite, Ahmedabad – 380 015. Gujarat
Call us at : 079 26769686



మోటార్ సైకిల్‌తో పని చేసే పొలం దున్నే యంత్రం
మన్సుఖ్‌భాయ్ జగాని, గుజరాత్

ఎంపికైన ఆలోచనలు, నమూనాలను HBN CRIIA పురస్కారంతో సత్కరించటంతో పాటు, అవి కార్యరూపం దాల్చటానికి తగ్గ ఆర్థిక / ఇతర సహాయం కూడా చేయబడుతుంది.



ఎంత ఎత్తున్న విద్యార్థులైనా నీళ్ళు త్రాగటానికి వీలుగా వాలుగా ఏర్పాటు చేసిన కుళాయిలు.
ఛాయా ఠాకూర్, గుజరాత్.

చివరి తేది
31 ఆగస్టు, 2022

last date

# ఆయుర్వేద జ్ఞాన మథనం



- 'వైద్య' ఉమా మహేశ్వర రావు

## ఆరోగ్యాన్ని చేకూర్చే కొన్ని పదార్థాలు :

మనం తినే ఆహారంలో నిత్యం ఈ క్రింద వివరించిన పదార్థాలు ఉండేటట్లుగా చూసుకున్నట్లయితే మనిషి ఆరోగ్యం ఎంతో మెరుగు పడుతుంది, నవ యవ్వనంగా, అనారోగ్యం లేని జీవితం గడపవచ్చు.

**ఉసిరి:** ఉసిరిని వాడటం వల్ల వృద్ధాప్య లక్షణాలు ఉండవు, అనారోగం పాలు కాకుండా కాపాడుతూ ఉంటుంది. కీళ్ళు, కండరాలు సమర్థంగా పని చేస్తాయి. చలి కాలంలో వచ్చే అనారోగ్యాల నివారణకు ఉసిరి రసం, తేనె సమపాళ్ళలో తీసుకుని రోజూ ఒక చెంచా తీసుకున్నట్లయితే రోగ నిరోధక శక్తి పెరిగి శరీరం ఆరోగ్యంగా ఉంటుంది.

ఉసిరి కాయలను తేనెలో నానబెట్టి 6 నెలల పాటు కదల కుండా అలాగే అంచి ఆ తర్వాత అప్పుడప్పుడూ ఒక కాయను తీసుకుని నమిలి తింటూంటే చాలామటుకు రోగాలను దరిచేరనివ్వదు.

**తేనె :** పూర్వీకులు ఒక వంతు నెయ్యి, మూడు వంతులు తేనె, రెండు వంతులు పెరుగు, మూడు వంతులు పాలు, పంచదార లేదా పటిక బెల్లం కలిపి 'పంచామృతం' అని తయారు చేసి అప్పుడప్పుడూ ఇంట్లో అందరికీ మరీ ముఖ్యంగా చిన్న పిల్లలకు తినిపిస్తూ ఉండేవారు. అందుకు కారణం శరీరంలో రోగాలు వచ్చేది 'వాతం, పిత్తం, కఫం' అనేవి హెచ్చు తగ్గులు కావటం వల్లనే. కాబట్టి శరీరాన్ని సమశీతోష్ణంగా ఉంచే ఔషధం ఈ పంచామృతం. అందుకే ముఖ్యంగా చిన్న పిల్లలకు తినిపిస్తూ ఉండేవారు. అంతే కాదు చాలామంది ఇంట్లో తేనె ఎప్పుడూ ఉండేలా చూసుకునే వారు. అప్పుడప్పుడూ చిన్న పిల్లలకు తేనె తినిపిస్తూ ఉండేవారు. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని వారి నమ్మకం.

తేనె, అల్లం రసం కలిపి కనీసం వారంలో ఒకసారి ఒక చెంచాడు తీసుకున్నట్లయితే శరీరంలో పేరుకుపోయిన అన్ని రకాల మలినాలను బయటకు తీసివేసే గుణం తేనె, అల్లంకు ఉంటుంది.

వాతావరణం మారినప్పుడల్లా ఆస్తమా రోగులు చాలా ఇబ్బందులకు గురవుతూ ఉంటారు. ముఖ్యంగా ఈ చలికాలంలో వచ్చే జలుబు వల్ల ఆస్తమా రోగులు ఊపిరి సరిగ్గా అందక చాలా ఇబ్బందులు పడుతుంటారు. అటువంటి వారు ఒక గ్లాసు వేడి నీళ్ళలో ఒక చెంచా తేనె కలుపుకుని కనీసం 20 రోజుల పాటు తీసుకున్నట్లయితే ఈ సమస్య నుండి కొంత ఉపశమనం పొందవచ్చు.

**పసుపు:** ఇదిఅద్భుతమైన రోగ నిరోధక శక్తిని పెంపొందించే దినుసు. ప్రకృతి ప్రసాదించిన యాంటీ బయాటిక్ పసుపు. ప్రతిరోజూ కనీసం 5 గ్రాముల పసుపు మన శరీరంలోకి తీసుకో గలిగితే ఎన్నో రోగాల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అందుకే ఇప్పుడు వచ్చే వైరస్‌ల నివారణకు ఉపయోగించే ప్రతి కషాయంలో పసుపును తప్పనిసరిగా ఉపయోగిస్తూ ఉంటారు.

పసుపు, సైంధవ లవణం, శొంఠి, పిప్పళ్ళు, మిరియాలు, ధనియాలు, జీలకర్ర, ఇంగువ సమభాగాలుగా తీసుకుని, వీటన్నిటికి కలిపి పొడిగా చేసి ఇంట్లో ఉంచుకుని, ప్రతి ఒక్కరూ భోజనం సమయంలో మొదటి ముద్దలో పావు స్పూను ఈ పొడిని కలుపుకుని తిన్నట్లయితే ఇప్పుడున్న వైరస్‌లే కాదు, భవిష్యత్తులో కూడా ఎటువంటి వైరస్ దరి చేరనివ్వకుండా చేస్తాయి. పూర్వీకులు వ్రాసిన గ్రంథాలలో కూడా ఈ ఫార్ములా గురించి చెప్పటం జరిగింది.

**ఇంగువ:** ఇది ఆహారాన్ని తేలికగా జీర్ణం చేసే శక్తి కలది. అంతే కాకుండా ఆహారం త్వరగా పులిసి పోకుండా చేసే గుణం కూడా ఇంగువ కు ఉంది కాబట్టి ఇంగువను ప్రతి ఆహార పదార్థంలో ఉపయోగించటం మంచిది.

**కరివేపాకు:** కరివేపాకును దాదాపు ప్రతి ఒక్కరూ వంటలో తప్పనిసరిగా ఉపయోగించేది. కానీ చాలామంది ఈ కరివేపాకును తినేటపుడు మాత్రం తీసి ప్రక్కన వేస్తారు. అలా తీసి పారవేయకుండా ఆహారంతో పాటు తీసుకున్నట్లయితే గుండెకు సంబంధించిన జబ్బులు రాకుండా కొంత వరకు నిరోధిస్తుంది. ఇందులో క్యాల్షియం శాతం కూడా ఎక్కువ ఉండటం వల్ల దీన్ని ఆహారంతో పాటు తీసుకున్నట్లయితే ఎముకల గట్టితనం పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల కరివేపాకును ఆకులుగా వేయకుండా, పొడి చేసి పోపులో వేసుకున్నట్లయితే దాన్ని తీసి వేయటానికి రాదు కనుక ఆహారంతో పాటు కడుపులోకి పోతుంది.

**జీలకర్ర:** ధనియాలు, వాము, శొంఠి, జీలకర్రలతో పాటు సైంధవ లవణం కలిపి నేతితో దోరగా వేయించి పొడి చేసుకునిం ఒక సీసాలో భద్రపరచుకొని 4–5 రోజులకు ఒకసారి ఒక స్పూను పొడిని నోట్లో వేసుకున్నట్లయితే శరీరంలోని జీర్ణ వ్యవస్థపై అద్భుతంగా పని చేస్తుంది. జీర్ణ వ్యవస్థకు సంబంధించిన ఎటువంటి జబ్బులను రానీయకుండా చేసి, ఆహారం కూడా బాగా అరిగిపోయేటట్లు చేస్తుంది.

**మెంతులు :** దీన్ని ఉపయోగించటం వలన శరీరంలోని అనవసరపు మలినాలను బయటకు నెట్టివేయ బడతాయి. తీపి, చేదు, వగరు, పులుపు లాంటి ఆహారం తీసుకోక పోయినా, మెంతులు తీసుకున్నట్లయితే శరీరం సమతుల్యంగా ఉండేలా చేసే శక్తి మెంతులకు ఉంటుంది. అందుకే పూర్వం నుండి మహిళలు పోపులో తప్పనిసరిగా మెంతులను ఉపయోగిస్తారు. మెంతి ఆకుతో కూర కూడా అప్పుడప్పుడూ తప్పనిసరిగా చేస్తూ ఉంటారు. మెంతులను రాత్రి నానబెట్టి ఉదయం తీసుకుంటే మధుమేహ వ్యాధి కూడా ఆధీనంలో ఉంటుంది.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 9440286854

### కరోనాతో పాటు అన్ని కాలాల్లో 'జలుబు-దగ్గు' నివారణకు చిట్కా:

సాధారణంగా ఏ కాలంలోనైనా సరే వాతావరణ మార్పుల వల్ల కొందరికి దగ్గు, జలుబు వస్తూ వుంటాయి. ప్రస్తుతమున్న కరోనా సమయంలో ఇవి వచ్చాయంటే కరోనా సోకిందేమో అని భయపడుతూ ఉంటారు. వాటి నివారణకు సులభమైన మార్గం 'ఉత్తరేణి చెట్టును సమూలంగా అంటే వేర్లతో సహా పీకి నీటితో శుభ్రంగా కడిగి నీడలో ఆరబెట్టాలి. చెట్టు మొత్తం ఎండిన తర్వాత కాల్చి బూడిద చెయ్యాలి. ఒక వేళ కాల్చిన తర్వాత అక్కడక్కడా చెట్టు కొమ్మలు ఉన్నట్టు అనిపిస్తే ఆ బూడిదను మొత్తం జల్లి పట్టి మిగతా కొమ్మలను రోట్లో వేసి మెత్తగా దంచి ఈ బూడిదలోనే కలపాలి. ఆ బూడిదను ఒక గాజు సీసాలో తీసి ఉంచుకొని, ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం చేతిలో అర స్పూను తేనెలో చిటికెడు బూడిదను వేసుకుని నాకాలి. దీన్ని చిన్న పిల్లల వద్దనుండి పండు ముదుసలి వరకు ఎవరైనా తీసుకోవచ్చు. కానీ దీన్ని తీసుకునే 15 నిమిషాల ముందు తరువాత నీళ్ళు తాగకూడదు. ఇలా చేసినట్లయితే దగ్గు, జలుబు, ఆస్తమా లాంటి రోగాలన్నీ నయమౌతాయి. కేవలం రెండో రోజు నుండే దీని గుణం కనబడుతుంది.

### పుచ్చిన పళ్లు, నోటికి సబంధించిన రోగాలకు ఆయుర్వేద చిట్కా:

చాలామందికి పళ్ళు పుచ్చిపోయి భరించరాని నొప్పితో బాధ పడుతూ ఉంటారు. వీటితో పాటు పంటి నొప్పి, చిగుళ్ళ సమస్యలు కూడా ఎంతోమందిని బాధ పెడుతూ ఉంటాయి. ఇలా పళ్ల సమస్యలతో పాటు నోటి దుర్వాసన ఇతర నోటికి సంబంధించిన ఏ జబ్బు ఉన్నవారైనా సరే "ఉత్తరేని చెట్టు వేర్లను తీసుకుని వాటిని బాగా కడిగి అందులో పండ్లు తోమే బ్రష్షు లాగా పెద్ద పరిమాణంలో వున్న వేరు ముక్కను తీసుకుని దాని కొసను కొద్దిగా నమిలి బ్రష్షులాగా తయారు చేసుకుని పళ్లను బాగా తోమినట్లయితే పుచ్చిపళ్ళు, పంటి నొప్పి లాంటి ఇతర నోటికి సంబంధించిన రోగాలన్నీ నయమౌతాయి.

అలాగే మామిడి కొమ్మను తీసుకుని బ్రష్షు లాగా చేసుకుని పళ్ళు తోముకున్నట్లయితే చిగుళ్ళ సమస్య అస్సలు ఉండదు. పైగా నోరు కూడా తాజాగా మారిపోతుంది. ఎటువంటి దుర్వాసన కూడా రాదు. సాధారణంగా చాలామంది వేప పుల్ల లేదా కానుగ పుల్లలతో పళ్లు తోముకుంటూ ఉంటారు. వాటికన్నా ఉత్తరేని వేరు పుల్ల లేదా మామిడి పుల్లతో పళ్లు తోముకున్నట్లయితే చాలావరకు నోటికి సంబంధించిన రోగాలు నయమౌతాయి.

అలాగే 'నేపాలం' చెట్టు వేరుతో పళ్లు తోముకున్నట్లయితే పంటి సమస్యలు ఉండవు. అందుకే "నేపాలం తింటే భూపాలం అదురుతుంది" అని ఒక సామెత కూడా ఉంది. ఈ చెట్టు వేర్లను సేకరించి, చిన్న పిల్లలకు దీనితో పళ్లు తోమే అలవాటు చేసినట్లయితే వారు వయోవృద్ధులు అయినా సరే పళ్ళు ఊడిపోకుండా గట్టిగా ఉంటాయి. అయితే ఈ చెట్టు కొద్దిగా చేదుగా ఉంటుంది కాబట్టి పళ్ళు తోమేటపుడు రసం వీలైనంత వరకు నోటిలోకి వెళ్ళకుండా చూసుకుంటే సరిపోతుంది. అలాగే ఈ నేపాలం చెట్టు ఆకును తుంచినట్లయితే ఆకు నుండి పాలు కారుతాయి. బ్రష్షు చేసుకునే టపుడు ఈ పాలను కూడా అద్దుకుని నోటిని శుభ్రం చేసుకున్నట్లయితే నోటి దుర్వాసన కూడా పోయి, నోరు తాజాగా తయారవుతుంది. ఇలా నేపాలం చెట్టు చాలా రకాలుగా పని చేస్తుంది. కానీ దీన్ని కడుపులోకి తీసుకో కూడదు, పైపూతగానే వాడుకోవాలి. బ్రష్ చేసేటపుడు ఎంత జాగ్రత్తగా నోట్లోకి వెళ్ళకుండా చూసుకున్నా కొంత రసం నోట్లోకి వెళ్ళే అవకాశం వుంటుంది కానీ అదేమీ చెయ్యదు. ఆకులు తినటం లాంటివి మాత్రం చెయ్యకూ డదు.



\- 'వైద్య' కొమెర జాజి

చిన్న పిల్లలకు ఎక్కువగా విరోచనాలు చేసినపుడు ముడ్డి వాపు వస్తూ వుంటుంది. అటువంటి సమయం లో ఈ నేపాలం చెట్టు వేరును కొద్దిగా నీరు వేసుకుని సాది గంధం తీసి మలద్వారం చుట్టూ పూసినట్లయితే ఈ సమస్య నుంచి నివారణ పొందవచ్చు.

### చెవిలో పుండ్లు, చీము కారటం లాంటి రోగాల నివారణకు చిట్కా:

కొంతమందికి చెవిలో చీము కారుతూ వుంటుంది. చెవిలో పుండ్లు కూడా అవుతూ ఉంటాయి. అటువంటి వారు జాజికాయ చెట్టు ఆకులను సేకరించి రోట్లో వేసి మెత్తగా నూరి, అందులో కొన్ని చుక్కల నీరు వేసి రసం పిండుకోవాలి. అలా తీసిన రసాన్ని ఒక్కో చెవిలో రెండు చుక్కల చొప్పున వేసుకుని కొద్ది సేపు పడుకున్నట్లయితే ఒక వారం రోజుల్లో చీము కారటం, చెవిలో పుండ్లు నయమైపోతాయి.

### దీర్ఘకాల పుండ్ల నివారణకు జాజికాయతో చిట్కా:

మధుమేహ వ్యాధి గ్రస్తులకు ఏవైనా గాయలు అయినట్లయితే ఒకపట్టాన అవి మానవు సరికదా అవి పుండ్లుగా తయారై పురుగులు కూడా పడుతూ ఉంటాయి. అటువంటి వారు జాజికాయను మెత్తటి పొడిగా చేసుకుని ఒక గాజు సీసాలో ఉంచుకుని ప్రతి రోజూ కొద్దిగా పొడిని ఒక స్పూను ఆవు నెయ్యితో కలిపి పుండుపైన పూసి, తర్వాత ఆ పుండు పైన ఒక తమలపాకును ఉంచి, కట్టు కట్టినట్లయితే పుండ్లలోని క్రిములను చంపివేసి, పుండు త్వరగా నయమైపోతుంది.

### నాలుకపైన పూత, నాలుక పగుళ్ళకు జాజికాయతో వైద్యం:

కొంతమందికి నాలుకపైన పుండ్లు అవుతూ ఉంటాయి. దీన్నే నాలుక పగలడం అని కూడా అంటారు. అటువంటి వారికి రుచి కూడా తెలియదు. ఈ సమస్య నివారణకు జాజికాయను కొద్దిగా పాలు తీసుకుని పాలలో జాజికాయను సాది గంధం తయారు చేసుకుని నాలుకపై పూసుకోవాలి. కనీసం పది నిమిషాల వరకు తినటం, త్రాగటం చెయ్యకుండా ఉన్నట్లయితే ఆ గంధం నాలుకకు బాగా పట్టుకుంటుంది. ఇలా ఒక వారం రోజుల పాటు చేసినట్లయితే నాలుకపైన పగుళ్ళు, పూత లాంటివి పోయి, రుచి కూడా బాగా తెలుస్తుంది.

### తరచూ గర్భస్రావం జరిగే మహిళలకు ఆయుర్వేద ఔషధం:

కొంతమంది మహిళలు తరచూ గర్భస్రావాలకు గురవుతూ ఉంటారు. వారు డాక్టర్లు, ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ లక్షలాది రూపాయలు ఖర్చు చేసుకుంటూ ఉంటారు. అటువంటి వారు జాజికాయను మెత్తటి పొడిగా తయారు చేసుకుని ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం అర చెంచా పొడిని మేక పాలతో కలిపి తీసుకుంటూ ఉన్నట్లయితే గర్భస్రావం సమస్య తీరిపోయి, గర్భం దాల్చడం జరుగుతుంది. ఈ చిన్న చిట్కా వల్ల ఎంతోమంది మహిళలు లాభపడ్డారు.

**గమనిక:** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయస్కరం.

'వైద్య' కొమెర జాజి, ఫోన్ నెం.: 9908411700

# స్పందన

**గౌరవనీయులు శ్రీ గణేశం గారికి,**

నమస్తే. మీరు దయతో పంపిన 'పల్లెసృజన' అందినది. ధన్యవాదములు. 'వలసదారులు పడుతున్న పల్లె ప్రజలు' సంపాదకీయం కనువిప్పు కాగలదు. గాంధీ గారి 'పల్లె పిలుపు' ఆవశ్యకతను ప్రజా బాహుళ్యం లోకి తీసుకు వెళ్ళాలి. విజ్ఞాన భారతావనికి కొలబద్దగా ఉన్న పల్లెసృజన మరింత ఆదరణకు నోచుకోవాలి.

కోవిడ్–19కు ఎంత తొందరగా తెర పడితే అంత వేగంగా పని పుంజుకోవాలి. ఆధునిక కాలంలో డిజిటల్ టెక్నాలజీని, మట్టిలోని మాణిక్యాలను కరదీపికగా రూపు దిద్దాలి. 'మల్లేశం' సినిమా ఓ ట్రెండ్ సెట్టర్. ప్రచార ప్రసార మాధ్యమాలు లఘు చిత్రాలు ఈ దిశలో ప్రజలలోకి చొచ్చుకుపోతాయి.

భూ సుపోషణ పేరుతో శ్రీ భాగయ్య గారు (రా.స్వ.సంఘ్) అఖిల భారత స్థాయిలో వివిధ సంస్థలతో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. నాబార్డ్ ఈ ఆవశ్యకతను గుర్తించి, ముందుకు రావడం ముదావహం.

మీరు సంపాదకీయంలో సూచించినట్లు ఉపాధి హామీ పథకం వలసలకు పరాకాష్టగా మారింది. నిధులు దారి మల్లుతున్నాయి. మరోవైపు పశ్చిమ బెంగాల్, బీహార్ నుండి కూలీలు తెలంగాణకు తరలి వస్తున్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణ శాపమా, లాభమా అనేది చర్చనీయాంశమైనది. భారీ యంత్రాలు ఖర్చుతో కూడినవి. గ్రామీణ స్థాయిలో సృజనాత్మకంగా రూపొందించిన యంత్రాలకు రైతుబంధు, రైతు భరోసా కేంద్రాలు మార్కెట్ కలిగించాలి.

పల్లెసృజన ముమ్ముందు యువతలో ఇగ్నైటింగ్ మైండ్స్, గ్రామీణ సంతలలో యంత్రాల అమ్మకాలు, పల్లె యువతకు శిక్షణా కార్యక్రమాలతో రాణించాలని విశ్వసిస్తూ నమస్సులతో.....

**–దండు కృష్ణవర్మ**, విజయవాడ.

**కృష్ణవర్మ గారూ,**

మీ అభిమానానికి ధన్యవాదములు. మీ స్పందన మాకెంతో విలువైనది. మీ సలహాలను తప్పక ఆచరించే ప్రయత్నం చేస్తాము.

**– బ్రిగేడియర్ పి. గణేశం.**

**ఎడిటర్ గారికి,**

మన గత సంచిక పల్లెసృజన లో ప్రచురించిన గొర్రెల కాపరి సమస్యకు నాకు ఒక పరిష్కారం తోచింది. "గొర్రెలు కాస్తూ ఉన్నపుడు ఒక చేనులో మంద పెట్టగా ప్రక్క చేనులోకి వెళ్ళకుండా ఉండటానికి ఏ ఇతర కంచె వేయాలన్నా ఖర్చుతో కూడుకున్న పని. దీనికి గాను సోలార్ సంబంధిత కంచె వేసి, దానికి ఒక అలారమ్ మ్రోగేలా ఏర్పాటు చేసి, ఆ తీగలను ఎవరు ముట్టుకున్నా సరే అలారం మ్రోగేలా ఏర్పాటు గలిగితే గొర్రెల కాపరులు ఎక్కువ మంది లేకున్నా సరే దొంగలు, తోడేళ్ళ నుండి కాపాడుకోవటమే కాక గొర్రెలు ప్రక్క పొలాలలోకి వెళ్ళకుండా కూడా రక్షణ పొందవచ్చు అనుకుంటున్నాను. ఈ విషయం మన ఇన్నోవేటర్లతో చర్చించి తగిన ఇన్నోవేషన్ ఏర్పాటు చేయవచ్చేమో ఆలోచించ గలరు.

**– రవీంద్రనాథ్ సందిరి,** కరీంనగర్ జిల్లా. ఫోన్ : 98498 62696.

**రవీంద్రనాథ్ గారు,**

మీరు అందించిన సూచనలను ఆలోచించి తగిన పరిష్కారం ఇన్నోవేటర్లతో సంప్రదించి, తగిన పరిష్కారం కనుగొంటారని ఆశిస్తున్నాము. మీ ఆలోచనలు మాతో పంచుకున్నందుకు ధన్యవాదములు.

– ఎడిటర్.

## FORM IV

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA)***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. -500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

పల్లెసృజన

అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల

# ఇన్నోవేషన్లు

## జొన్న, మొక్కజొన్న పంటల్లో అంతర సేద్యానికి వెంకట్ వీడర్

ఇన్నోవేటర్ : **వెంకటయ్య**, మహబూబ్‌నగర్



ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న వీడర్లు ప్రత్తి, మిప లాంటి పంటల్లో అంతర సేద్యానికి మాత్రమే పని చేస్తాయి. కానీ, ఈ వీడర్‌తో జొన్న, మొక్కజొన్న, వేరుశనగ లాంటి పంటలతో పాటు ప్రత్తి, మిరప పంటల్లో కూడా అంతర సేద్యం చేసుకోవచ్చు. పంట వేసిన సాలు వెడల్పును బట్టి అనువైన గొర్రు, గుంటక 9 అంగుళాల నుండి 30 అంగుళాల వెడల్పు వరకు ఏర్పాటు చేసుకోవచ్చు. ఒకే చక్రంతో నడిచే ఈ యంత్రం మహిళలు కూడా సులువుగా తోలవచ్చు. ఒక లీటరు పెట్రోలుతో 2-3 ఎకరాలలో సేద్యం చేసుకోవచ్చు.

## తక్కువ ఖరీదులై ట్రాక్టర్ హైడ్రాలిక్ క్రేన్

ఇన్నోవేటర్ : **మహిపాల్ చారి**, హన్మకొండ



ట్రాక్టర్‌కు క్రేన్ ఏర్పాటు చేసుకోవాలంటే లక్షలాది రూపాయలు వెచ్చించాల్సి ఉంటుంది. కానీ, ఈ హైడ్రాలిక్ క్రేన్ ఖరీదు సామాన్య రైతుకు కూడా అందుబాటులో వుంటుంది. గ్రామాల్లో, గోడౌన్‌ల వద్ద హమాలీలు లభించక, ధాన్యం మూటలు, ఇతర బరువులను ఎత్తే కూలీల ఖర్చు విపరీతంగా వుంటోంది. దీనికి పరిష్కారంగా కనుగొన్నదే ఈ ట్రాక్టర్ హైడ్రాలిక్ క్రేన్. ట్రాక్టర్‌కు, లారీలకు, ఎద్దుల బండ్లను బరువులను ఎత్తడం, దించడం కేవలం ఇద్దరు లేదా ముగ్గురు వ్యక్తులే చేసుకోవచ్చు. ఎటువంటి నిర్వహణా ఖర్చులు ఉండవు. ఊరికొక్క క్రేన్ ఉంటే చాలు రైతులు ధాన్యం సంచులు ఇంటికి, మార్కెట్‌కు తరలించేందుకు హమాలీల కొరకు వేచి ఉండాల్సిన అవసరం లేదు. గోడౌన్ యజమానులకు ఇది చాలా ఉపయోగకరమైనది.

## సమాన దూరం, లోతులో విత్తనం వేసే జడిగం

ఇన్నోవేటర్ : **గొర్రె అశోక్**, సూర్యాపేట



ఏ విత్తనమైనా సమాన దూరంలో, సరియైన లోతులో నాటితేనే విత్తనాలు వృధా కాకుండా మొలకెత్తుతాయి లేకుంటే విత్తనం వృధా, పంట దిగుబడి కూడా తగ్గుతుంది. ఈ సమస్య పరిష్కారానికి సన్న చిన్నకారు రైతుల కోసం తయారు చేయబడిన చేతి పరికరం ఈ జడిగం. ఒక అడుగు నుండి 2-3 అడుగుల దూరం, 2-3 అంగుళాల లోతులో విత్తనం వేసుకోవచ్చు. సాధారణ రైతు కూడా దీన్ని అందుబాటులో ఉంచుకోవటానికి అనువైన తక్కువ ఖరీదులో లభిస్తుంది. ప్రత్తి, మొక్కజొన్న లాంటి విత్తనం నాటే పనులు ఇక వంగి భూమిలో నాటి అలసి పోవాల్సిన అవసరం లేకుండా నిలబడే విత్తనం వేసుకుంటూ సమాన దూరంలో నాటుకోవచ్చు.

## జొన్న, వేరుశనగ అంతర సేద్యాల వీడర్

ఇన్నోవేటర్ : **వెంకటేశ్వరా చారి**, హన్మకొండ



జొన్న, వేరుశనగ లాంటి పంటల్లో సాధారణంగా ఎద్దులతోనే అంతర సేద్యాలు చేస్తూ ఉంటారు. ఒక ఎద్దుల జతకు 5-6 దంతెలు వేసి అంతర సేద్యం చేస్తూ ఉంటారు. అందుకు ఎక్కువ కూలీలు అవసరం, చాలా ఖర్చవుతుది. ఈ వీడర్‌తో కూడా ఒకేసారి 5-6 సాళ్ళలో ఒకే వ్యక్తి అంతర సేద్యం చేసుకోవచ్చు. ఒక ప్రధాన చక్రం వుండి, బ్యాలెన్స్ చేసుకోవడానికి అనువుగా ఇరువైపులా రెండు సైకిల్ చక్రాలు ఏర్పాటు చేయటం వలన తేలికగా బ్యాలెన్స్ అవుతుంది. మహిళలు కూడా సులభంగా అంతర సేద్యం చేసుకోవచ్చు.

మొక్కలు కావలసిన వారు సంప్రదించండి :

బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700

PALLE SRUJANA Telugu Bi-monthly January - February 2022 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

**ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే**

ఇన్నోవేషన్ల వీడియోల కొరకై ఈ QR కోడ్‌ను స్కాన్ చేసి చూడవచ్చు.


























పల్లెసృజన సభ్యులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. సభ్యులుగా చేరాలనుకున్నవారు చందా కట్టి, మీ చిరునామాను స్పష్టంగా 9866001678 కి పంపడం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094.

లేదా నేరుగా ఈ బ్యాంక్ లో జమ చేయండి.

**M/s Pallesrujana, Canara Bank, Sainikpuri, Secunderabad.**
**SB A/c No. 30232200019150, IFS Code : CNRB0013023**

PhonePe

**"Phone Pe" no 9866 00 1678**

QR code for Phone Pe

లేదా

'గూగుల్ పే' చెయ్యాలనుకున్న వారు 9652801700 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

## సభ్యత్వ వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | లైబ్రరీ |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,000/- |